


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 29, సంచిక: 98 | ఆదివారం | 27-09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





## వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేదు

- 'సర్'పై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు వార్తల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం భేటీ

**న్యూఢిల్లీ :** 'సర్' లోని ఓటరు వివరాల్లో అన్‌మ్యాప్డ్ లేదా ఇతర వ్యత్యాసాలు ఉన్నాయని నోటీసులు అందుకున్న ప్రతి వ్యక్తి కూడా తప్పనిసరిగా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్‌ఒ) వద్ద వ్యక్తిగత విచారణకు హాజరుకావాల్సిన అవసరం లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒ) స్వయంగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్స్ సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, కేవలం అసాధారణ కేసుల్లో మాత్రమే ఆన్‌లైన్ లేదా తమ ప్రతినిధి ద్వారా విచారణ ఉంటుందని పేర్కొంది. కొత్తగా ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడానికి ఉపయోగించే ఫారం 6 కు సంబంధించిన సర్ డిక్లరేషన్, సదరు నిబంధనలను సుప్రీంకోర్టు ముందే సమర్థించిందని ఇసిఐ మరోసారి స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విధానంలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న నివేదికలు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న వేళ, శనివారం కేంద్ర ఎన్నికల సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. నిర్వాచన్ సదన్‌లో జరిగిన సమావేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి)

తరువాయి 8లో



## 'సర్'తో ఓటుహక్కు హరించడం తీవ్ర ఆక్షేపణీయం

- వామపక్ష, కాంగ్రెస్, బిఆర్ఎస్, పలు ప్రజాసంఘాల నాయకుల తీవ్ర ఆగ్రహం
- వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం
- సర్‌ను నిలిపివేయాలని, భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- 30న ఇసి కార్యాలయం ముందు వామపక్షాలు, ఇతర భాగస్వామ్య పార్టీలు, సంఘాలు, మేధావులతో నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడి
- అక్టోబర్ ఒకటవ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అత్యంత ప్రాథమిక ప్రజాస్వామ్య ఆయుధమని, దానిని కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ పేరుతో హరించడం తీవ్ర ఆక్షేపనీయమని వామపక్ష, కాంగ్రెస్, బిఆర్ఎస్ రాజకీయ పార్టీలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఇందుకు కారణమైన భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గౌరవప్రదంగా రాజీనామా చేసి ఎన్నికల కమిషన్ వ్యవస్థ ప్రతిష్టను కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆయన రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీన ఎలక్షన్ కమిషన్ కార్యాలయం ముందు వామపక్షాలు, ఇతర భాగస్వామ్య పార్టీలు, సంఘాలు, మేధావులతో కలిసి నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.కోదండరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బి.వినోద్ కుమార్,

తరువాయి 8లో

# డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

- ఢిల్లీలో ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి
- మాజీ ప్రధాని విగ్రహావిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్
- సింగ్ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు చాలా గొప్పవని ప్రశంస






ప్రజాపక్షం/హైదరాబాద్

"దేశమే గర్వించదగిన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్ సింగ్. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు చాలా గొప్పవి. ఆర్థిక రంగంలో సరళీకృత విధానాలను తీసుకొచ్చారు. ప్రధాని పి.వి.నరసిహారావు నేతృత్వంలో భారత్‌ను సంక్షోభం నుంచి గట్టెక్కించారు. పి.వి. నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. తెలంగాణ బిల్లుపై మన్మోహన్ సింగ్ పెట్టిన సంతకం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. తెలంగాణ బిల్లుపై పెట్టిన సంతకాన్నే ఇక్కడ నిక్షిప్తం చేశాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ డాక్టర్ సేవలు, స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని సిఎం రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాటాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ జ్ఞాపకాలను దేశ రాజధాని ఢిల్లీలో చిరస్థాయిగా నిలిపేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొన్ని సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేస్తున్నామని సిఎం తెలిపారు. ఢిల్లీలో ఆయన పేరుతో ఒక

తరువాయి 8లో

## జ్ఞానేశ్ కుమార్ నన్ను బిజెపి అభ్యర్థిగా పోటీ చేయమన్నారు..

సిఇసిపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి జిజి థామ్సన్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్న తరుణంలో, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, కేరళం మాజీ ప్రధాన కార్యదర్శి జిజి థామ్సన్ కీలక విషయాన్ని వెల్లడించారు. జ్ఞానేశ్ కుమార్ గతంలో తనను బిజెపి అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయమని ఒప్పించడానికి ప్రయత్నించారని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ సర్వీసులో ఉన్న సమయం 2016లో ఈ ప్రతిపాదన జరిగిందని ఆయన తెలిపారు. తాను కేరళం ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో, ఢిల్లీకి వెళ్లే

తరువాయి 8లో

## నవంబర్ రెండో వారం నుంచి కాళేశ్వరం పునరుద్ధరణ పనులు

- 2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- బ్యారేజీల పటిష్టంతో పాటు నిర్వహణ సామర్థ్యం పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లు ఖరారు చేసినట్లు వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారం నుంచి ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి పునరుద్ధరణ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. మూడు బ్యారేజీల భద్రతను పటిష్టం చేయడంతోపాటు, వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన

తరువాయి 8లో

## సైన్యం చేతిలో పాక్ సర్కార్ కీలుబొమ్మ

ఉగ్రవాదానికి మూల్యం చెల్లించకతప్పదు
జనరల్ అసెంబ్లీలో భారత్ హెచ్చరిక




**న్యూయార్క్:** పాకిస్థాన్‌లో ఉన్నది కేవలం సైన్యం చేతిలో ఒక కీలుబొమ్మ ప్రభుత్వమని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికపై భారతదేశం విమర్శించింది.ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్ మూల్యం చెల్లించకతప్పదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించింది. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని,దారుణమైన మోసాలకు పాల్పడుతోందని విమర్శించింది. వీటికి తగిన మూల్యం చెల్లించకతప్పదని పేర్కొంది. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ శుక్రవారం రాత్రి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ,2025లో భారత్–పాకిస్థాన్ మధ్య

తరువాయి 12లో

## 30న ఇండియా కూటమి పార్టీల సమావేశం

ఇసి, సర్‌పై చర్చించే అవకాశం: వర్గాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఈ నెల 30న ఢిల్లీలో సమావేశమయ్యే అవకాశముంది. ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ఉన్న ఆందోళనలతో పాటు ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు వర్గాలు తెలిపాయి. సర్ ప్రక్రియలోని కొన్ని అంశాలపై ఎన్నికల సంఘంలో విభేదాలు ఉన్నట్లు వార్తలు రాగా, ఎన్నికల సంఘం విషయంలో ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం పెరిగిన తరుణంలో ఈ సమావేశం జరగనుంది. ఈ విషయంపై పార్టీలు పరస్పరం సంప్రదింపులు జరుపుకుంటున్నాయని, ఉమ్మడి ప్రతిస్పందనపై చర్చిస్తున్నాయని వర్గాలు తెలిపాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, సర్‌ను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ డిమాండ్ చేయగా, కాంగ్రెస్ కూడా కుమార్‌పై విమర్శలను తీవ్రతరం చేసింది. ఈ విషయంపై తమ వ్యూహాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈనెల 29న సమావేశం కానుంది. పశ్చిమ బెంగాల్‌లోని బద్ధ రాజకీయ

తరువాయి 12లో

## ఎఐతో పర్యాటకాభివృద్ధి

ప్రభుత్వం చర్యలు : ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/రంగారెడ్డి/హైదరాబాద్


ప్రభుత్వ,ప్రైవేట్ ప్రాపర్టీ(పిపిపి)భాగస్వామ్యంతో పర్యాటక మౌలిక వసతులను పెద్దఎత్తున అభివృద్ధి చేయడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని

తరువాయి 8లో






## వినూత్న ఆవిష్కరణ..



ఇటీవల శాస్త్రవేత్తలు హీలియం లీకులను గుర్తించేందుకు ఒక వినూత్నమైన శబ్ద ఆధారిత సెన్సార్‌ను అభివృద్ధి చేశారు. ఇది రసాయన చర్యలపై ఆధారపడకుండా పని చేయడం వల్ల ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. హీలియం అనేది రసాయనికంగా నిర్జీవమైన వాయువు కావడంతో సంప్రదాయ సెన్సార్లతో దాన్ని గుర్తించడం కష్టం. అంతేకాకుండా ఇది అరుదైన వనరు కావడం, అనేక కీలక పరిశ్రమలకు అవసరమవడం వల్ల లీకుల గుర్తింపు అత్యంత ముఖ్యమైంది. ఈ నేపథ్యంలో శబ్ద తరంగాలను ఉపయోగించే ఈ కొత్త సాంకేతికత ఒక పెద్ద ముందడుగుగా భావించబడుతోంది. ఈ సెన్సార్‌లో టోపోలాజికల్ మెటీరియల్స్‌ను వినియోగించారు. ప్రత్యేకంగా కగోమే లాటీస్ అనే త్రిభుజాకార నిర్మాణాన్ని ఉపయోగించి శబ్ద తరంగాలను మూలల్లో బంధించే విధానం దీనికి ఆధారం. సాధారణంగా సెన్సార్లు గ్యాస్‌తో రసాయన చర్య జరిపి మార్పులను గమనిస్తాయి. కానీ ఈ సెన్సార్‌లో అలాంటి చర్య అవసరం లేదు. శబ్ద తరంగాలు ఒక నిర్దిష్ట స్థితిలో చిక్కుకుని ఉండగా, చుట్టూ ఉన్న మాధ్యమంలో మార్పు వస్తే వాటి ప్రవర్తనలో తక్షణ మార్పు కనిపిస్తుంది. హీలియం లీక్ అయినప్పుడు సెన్సార్‌లో శబ్దం ప్రయాణించే వేగం మారుతుంది. హీలియం ఇతర వాయువులతో పోలిస్తే తక్కువ సాంద్రత కలిగి ఉండటంతో శబ్దవేగంపై స్పష్టమైన ప్రభావం చూపుతుంది. ఈ మార్పు వల్ల మూలల్లో బంధించబడ్డ శబ్ద తరంగాల ఫ్రీక్వెన్సీ మారుతుంది. ఆ ఫ్రీక్వెన్సీ మార్పును కొలిచి, హీలియం లీకేజీ స్థాయిని వెంటనే లెక్కించవచ్చు. ఈ విధానం అత్యంత వేగవంతమైనది, ఖచ్చితమైనది, శక్తి సామర్థ్యం కలిగినదిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## కిడ్నాప్‌లపై శిక్షణ ఇచ్చి..



మెక్సికోలో కిడ్నాప్ కాకుండా ఎలా ఉండాలో ప్రసంగించిన భద్రతా నిపుణుడే ఆ తర్వాత కిడ్నాప్ అయ్యాడనే కథనం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందింది. ఇందులో కొంత నిజం ఉన్నప్పటికీ, వాస్తవ సంఘటనను చాలా సరళీకరిం చి, కొంత నాటకీయంగా చెప్పడం జరిగింది. అమెరికాకు చెందిన భద్రతా సలహాదారు ఫెలిక్స్ బాటిస్టాకు, కిడ్నాప్ నిరోధక వ్యూహాలు, బందీల విడుదల చర్చలు వంటి అంశాల్లో విశేష అనుభవం ఉంది. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కిడ్నాప్ కేసులకు సంబంధించి సలహాలు అందించాడు. 2008లో మెక్సికోలోని సాల్టిల్లో నగరంలో కిడ్నాప్ ప్రమాదాలు, భద్రతా చర్యలపై శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నాడు. అయితే 2008 డిసెంబర్ 10న ఒక సమావేశం ముగించుకుని బయటకు వచ్చిన తర్వాత సాయుధ వ్యక్తులు ఆయనను బలవంతంగా తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియ లేదు. అమెరికా ఎఫ్‌బీఐ, మెక్సికో అధికారులు ఈ కేసును దర్యాప్తు చేశారు. నేర ముఠా 'లాస్ జెటాస్' ఈ అపహరణ వెనుక ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, ఆయనకు ఏమైందనే విషయం అధికారికంగా నిర్ధారించలేదు. కాగా, 'కిడ్నాప్‌లను ఎలా నివారించాలో చెప్పిన వ్యక్తే కిడ్నాప్ అయ్యాడు' అనే వాక్యం ఈ సంఘటన తర్వాత ప్రచారంలోకి వచ్చింది. అయితే ఆయన ప్రసంగం అధికారికంగా 'మెక్సికోలో కిడ్నాప్ కాకుండా ఎలా జాగ్రత్త పడాలి' అనే పేరుతో జరిగిందని నిర్ధారించే ఆధారాలు లేవు. ఈ శీర్షిక సోషల్ మీడియాలో తర్వాత ప్రాచుర్యం పొందిన రూపం. ఏదిఏమైనా, బాటిస్టా కిడ్నాప్ అయిన విషయం నిజం. ఆయన ఆచూకీ ఇప్పటి వరకూ తెలియకపోవడం కూడా నిజమే. ఆయన 'హౌ నాట్ టు బి కిడ్నాప్డ్ ఇన్ మెక్సికో' అనే విషయంపై ఉపన్యాసం ఇచ్చిన తర్వాత అపహరణకు గురయ్యాడన్నది కొంత అతిశయోక్తి కావచ్చు. ఏదిఏమైనా, ఈ ఘటన భద్రతా నిపుణులు కూడా సంఘటిత నేరాల నుంచి పూర్తిగా రక్షితులు కాదని గుర్తుచేస్తుంది.

## మనిషిని గుర్తించే వైఫై



జర్మనీలోని పరిశోధకులు వైఫై సాంకేతికతను ఉపయోగించి, కెమెరా అవసరం లేకుండానే ఒక వ్యక్తిని అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించగల కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ పరిశోధనలో సాధారణంగా ఇళ్లలో, కార్యాలయాల్లో ఉపయోగించే వైఫై రౌటర్ నుంచి వెలువడే రేడియో తరంగాలు గదిలోని వస్తువులు, మనుషుల శరీరాలను తాకి తిరిగి వచ్చే విధానాన్ని విశ్లేషించారు. ప్రతి వ్యక్తి శరీర ఆకృతి, ఎత్తు, నడక తీరు, కదలికలు భిన్నంగా ఉండటంతో, రేడియో తరంగాలు తిరిగి ప్రతిఫలించే నమూనా కూడా ఒక్కో వ్యక్తికి ప్రత్యేకంగా ఉంటుంది. కృత్రిమ మేధస్సు (ఎఐ) సహాయంతో ఈ నమూనాలను విశ్లేషించి, ఎవరు గదిలో ఉన్నారో గుర్తించవచ్చని పరిశోధకులు నిరూపించారు. దీనిని వారు 'అదృశ్య వేలిముద్ర' (ఇన్‌విజిబుల్ ఫింగర్‌ప్రింట్)తో పోల్చారు. ఈ సాంకేతికతను వృద్ధుల సంరక్షణ, ఆసుపత్రుల్లో రోగుల పర్యవేక్షణ, స్మార్ట్ హోమ్ వ్యవస్థలు, భద్రతా సేవలు వంటి అనేక రంగాల్లో ఉపయోగించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా కెమెరాలు అవసరం లేకుండా వ్యక్తుల కదలికలను గుర్తించే అవకాశం ఉండటం దీని ప్రత్యేకత. అయితే, ఈ సాంకేతికతపై గోప్యత విషయంలో కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తుల అనుమతి లేకుండానే వారి ఉనికిని లేదా కదలికలను గుర్తించే అవకాశం ఉండటంతో, దీనిని వినియోగించే సమయంలో కఠినమైన గోప్యతా నిబంధనలు అవసరమని కొందరు పరిశోధకులు సూచిస్తున్నారు.

## మొక్కల ప్రమాద సంకేతాలు!



మొక్కలు మాట్లాడలేవు, వినలేవు అనే అభిప్రాయం చాలాకాలంగా ఉంది. అయితే తాజా శాస్త్రీయ పరిశోధనలు మొక్కలు కూడా తమ చుట్టూ ఉన్న ఇతర మొక్కలకు ప్రమాద సంకేతాలు పంపగలవని వెల్లడించాయి. ఒక మొక్కను పురుగులు తినడం ప్రారంభించినప్పుడు లేదా అది గాయపడినప్పుడు, ఆ మొక్క గాలిలో 'వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్' (విఒసి) అనే ప్రత్యేక రసాయనాలను విడుదల చేస్తుంది. ఇవి గాలిలో వ్యాపించి సమీపంలోని మొక్కలకు చేరుతాయి. ఈ రసాయన సంకేతాలను గుర్తించిన ఇతర మొక్కలు ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేసి తమ రక్షణ వ్యవస్థను చురుకుగా మారుస్తాయి. ఉదాహరణకు, కొన్ని మొక్కలు చేదు రసాయనాలను ఉత్పత్తి చేసి ఆకులను పురుగులకు తినలేనివిగా మారుస్తాయి. మరికొన్ని మొక్కలు పురుగులను తినే కీటకాలను ఆకర్షించే సువాసనలను విడుదల చేస్తాయి. దీంతో వాటిపై దాడి చేసే పురుగుల సంఖ్య తగ్గుతుంది. ఈ ప్రక్రియను శాస్త్రవేత్తలు 'ప్లాంట్ కమ్యూనికేషన్' లేదా 'రసాయన సంకేతాల ద్వారా సమాచార మార్పిడి'గా పేర్కొంటున్నారు. ఈ ఆవిష్కరణ వ్యవసాయ రంగానికి కూడా ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. పంటలకు హాని కలిగించే కీటకాల దాడిని ముందుగానే గుర్తించి, సహజసిద్ధమైన రక్షణ వ్యవస్థలను ప్రోత్సహించే కొత్త పద్ధతులను అభివృద్ధి చేయవచ్చు. దీంతో రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుంది. ఈ పరిశోధన ప్రకృతి ప్రపంచం ఎంత అద్భుతంగా పనిచేస్తుందో చూపిస్తోంది. మాటలు లేకపోయినా, మొక్కలు తమ ప్రత్యేక రసాయన భాష ద్వారా ఒకదానితో ఒకటి సమాచారాన్ని పంచుకుంటూ, సమూహంగా తమ మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. – బిఎస్ఎస్ మైత్రేయి

# ఫలప్రదమైన జిన్‌పింగ్ అమెరికా పర్యటన

చైనా దేశాధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మూడు రోజుల అమెరికా పర్యటన శనివారం ముగిసింది. ప్రపంచ దేశాలు సంఘర్షణలు, ఆర్థిక, సరఫరా గొలుసుల అంతరాయాలతో సతమతమవుతున్న సమయంలో ఈ పర్యటన అంతర్జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకుంది. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికాతో పోటీకి వస్తున్న చైనా అంటే ట్రంప్‌కు ఆది నుంచి అయిష్టతే. ఆయన అధ్యక్షుడిగా తొలి దఫా, మలి దఫాలో చైనాపై పలుమార్లు అక్కసును వెళ్లగక్కారు. చైనా నుంచి అమెరికా కంపెనీలు తిరిగి స్వదేశానికి వచ్చేయాలని పిలుపునిచ్చారు. అన్ని దేశాల కంటే చైనా ఎగుమతులపైనే అత్యధిక టారిఫ్‌లను విధించడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు చెడినాయి. ఈ ఏడాది మే మాసంలో ట్రంప్ చైనా పర్యటన ద్వారా ఇరు దేశాల సంబంధాలు కొంత వరకు మెరుగయ్యాయి. జిన్‌పింగ్ తాజా పర్యటన వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. వైట్‌హౌజ్‌లో జరిగిన అగ్రనాయక సమావేశాల్లో ట్రంప్ – షీ జిన్ పింగ్ నడుమ ప్రధానంగా ఆర్థిక అంశాలు, కృత్రిమ మేధస్సుతో పాటు, ఇరాన్ యుద్ధంపై చర్చ జరిగింది. కృత్రిమ మేధస్సు విషయంలో మానవ నియంత్రణ ఉండాలన్న చైనా అధినేత అభిలాషకు భిన్నంగా ట్రంప్ ఆలోచన ఉంది. ఎఐ అభివృద్ధి విషయాన్ని కంపెనీలకే వదిలేయాలన్నట్లుగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధస్సును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా కాకుండా సూపర్ ఇంటెలిజెన్స్‌గా వ్యవహరించాలనే ట్రంప్ సూచనకు చైనా సానుకూలంగానే స్పందించింది. వాణిజ్య మండలి ఏర్పాటు, 30 బిలియన్ డాలర్ల విలువైన పరస్పర సుంకాల తగ్గింపు ఒప్పందం, కౌలాలంపూర్ సంప్రదింపులలో సాధించిన ఫలితాల విస్తరణ వంటి అంశాల రూపంలో తమ దేశాల ఆర్థిక, వాణిజ్య బృందాలు సాధించిన ఫలితాలను వారు ఈ సందర్భంగా గమనంలోకి తీసుకున్నారు. ఉభయ దేశాల మధ్య నవంబర్‌లో ముగియనున్న వాణిజ్య ఒప్పందాన్నిమరో రెండు నెలల పొడిగింపునకు అంగీకరించడం సానుకూల పరిణామం.

శిఖరాగ్ర సమావేశంలో ఎనిమిది అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. పరస్పర గౌరవం, చేయూత, నిష్పాక్షికంగా నిర్మాణాత్మక సంబంధాలను నిర్మించుకోవాలని నిర్ణయించారు. తాము అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమనే మాటను ఇరాన్ నిలబెట్టుకోవాలని, ఏ దేశం లేదా అంతర్జాతీయ జలాలలో రవాణా రుసుము వసూలు చేయకూడదనే విషయంలో ఉభయనేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో తైవాన్ విషయంలో అమెరికా దుడుకుతనంతో వ్యవహరించవద్దనే ప్రస్తావన వచ్చినట్లు మీడియా వార్తలు చెబుతున్నాయి.

శిఖరాగ్ర భేటీల్లో ఉభయులూ సుభాషితాలు పంచుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా జపాన్‌పై దాడి సమయంలో ఇరు దేశాలు కలిసి పని చేశాయని ట్రంప్ చెప్పగా, సంఘర్షణ కంటే ఘన చైనా పునరుజ్జీవం, మేకింగ్ అమెరికా గ్రేట్ అగెయిన్ లక్ష్యాల సాధనకు పరస్పరం సహకరించుకోవాలని జిన్‌పింగ్ మనోగతాన్ని వెల్లడి చేశారు. అదే సమయంలో అమెరికాను భాగస్వామి గా తప్ప, పోటీ పడే సూపర్ పవర్ గా చూడబోమని అనడం ద్వారా ఇటీవల చైనా పదే పదే ప్రతిపాదిస్తున్న బహుళధృవ వాదాన్ని ముందుంచింది. అంతే గాక, ఎవరూ ఊహించని విధంగా విద్యార్థి బదిలీ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలో లక్ష మంది యువ అమెరికన్‌లు చైనాలో చదువుకునేందుకు రావాలని జిన్ పింగ్ ఆహ్వానించారు.

దశాబ్దకాలంలో చైనా అధ్యక్షుడు అమెరికా పర్యటించటం ఇదే తొలిసారి. షీ జిన్‌పింగ్ పర్యటనకు ట్రంప్ అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్ళిన షీ జిన్ పింగ్‌కు ట్రంప్ తన సతీమణితో కలిసి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అంతేగాక వైట్ హౌజ్‌లో అమెరికా ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలతో ఆయన గౌరవార్థం విందును ఏర్పాటు చేశారు. ఈ ఏడాదిలో రెండు అగ్రదేశాధినేతలు కలవడం రెండవసారి. ఏడాది ముగిసే లోగా మరో రెండు మార్లు ఇరువురు భేటీ కానున్నారు.

నవంబర్ 18–19 తేదీలలో చైనాలోని షెన్‌జెన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఎపెక్) శిఖరాగ్ర సమావేశానికి ట్రంప్ హాజరుకానున్నారు. అలాగే, డిసెంబర్‌లో మియామీలో జరిగే జి– 20 సమ్మిట్‌కు షీ జిన్ పింగ్ హాజరుకానున్నారు. ఈ ఏడాదిలో రెండు అగ్రరాజ్య దేశాధినేతలు నాలుగుసార్లు కలుసుకోనుండడం సుహృద్భావ వాతావరణాన్ని తెలియపరుస్తోంది. అయితే, ట్రంప్ తన మాటపై ఎంత వరకు నిలబడతారనేది చివరి వరకు చెప్పలేము. వచ్చే నెలలో జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులకు వామపక్ష భావజాలం కలిగిన అభ్యర్థులు ధీటుగా పోటీనిస్తున్నారు. అంతర్జాతీయ కారణాలే కాకుండా, ఈ ఎన్నికల్లో లెఫ్ట్ అభ్యర్థులలో గందరగోళం సృష్టించేందుకు కూడా షీ జిన్ పింగ్ పర్యటనను ఆయన ఉపయోగించుకుంటారని పరిశీలకుల భావన. ఏదేమైనప్పటికీ పెళుసుబారిన అంతర్జాతీయ సంబంధాలమధ్య రెండు కీలక దేశాల మధ్య సమావేశం సానుకూల ఫలితాలివ్వాలని ఆశించుదాం. ఇది సంఘర్షణల ముగింపునకు, మానవాళి పురోగతికి ఉపయోగపడితే ప్రయోజనం ఉంటుంది.

# ఎఐఎస్‌ఎఫ్ చరిత్ర తరతరాల విద్యార్థులకు స్ఫూర్తిమంతం

## 'చదువుతో జ్ఞానం ఆర్జించండి – సమాజ మార్పుకై పోరాడండి'



తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
ఎఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు

'చదువు – పోరాటం' అనే నినాదంతో, సామ్రాజ్యవాదానికి, మతతత్వానికి, కులవర్గ అసమానతలకు వ్యతిరేకంగా దేశచరిత్రలో చెరగని ముద్ర వేసిన భారతదేశ తొలి అఖిల భారత విద్యార్థి సంఘం ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎఐఎస్‌ఎఫ్). 1936 ఆగస్టు 12న జన్మించిన ఈ సంస్థ, 2026 నాటికి 90 సంవత్సరాల ఘనమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ ప్రస్థానంలో ఎన్నో ఉద్యమాలకు, పోరాటాలకు ఎఐఎస్‌ఎఫ్ వేదికగా నిలిచింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి తనవంతు పాత్ర పోషించింది. గడిచిన 90 ఏండ్ల కాలంలో విద్యార్థులకు అండగా నిలిచిన అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎఐఎస్‌ఎఫ్ ఖ్యాతి గడించింది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి 90వ వార్షికోత్సవాలు చారిత్రక నగరం అయిన ఓరుగల్లు వేదికగా నిర్వహించడం జరుగుతున్నది.




### ఎఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ నేపథ్యం

1936లో ఆగస్టు 12, 1936న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో (గంగా ప్రసాద్ మెమోరియల్ హాల్)లో ఎఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించింది. ఇందులో దేశవ్యాప్తంగా 11 ప్రావిన్సులు, 200 స్థానిక సంస్థల నుండి 936 మంది ప్రతినిధులు హాజరయ్యారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ సదస్సును ప్రారంభించగా, ముహమ్మద్ అలీ జిన్నా అధ్యక్షత వహించారు. మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగోర్ తదితరుల శుభాకాంక్షలు అందాయి. తొలి సాధారణ కార్యదర్శిగా ప్రేమ్ నారాయణ్ భార్గవ ఎన్నికయ్యారు. రెండో సదస్సు (లాహోర్, నవంబర్ 1936): శరత్ చంద్ర బోస్ అధ్యక్షతన నిబంధనావళిని ఆమోదించి, 'వరల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్'తో అనుబంధం ఏర్పాటు చేసుకున్నారు.

### స్వాతంత్ర్య పోరాటంలో...

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త విద్యార్థి సమీకరణలో ఎఐఎస్‌ఎఫ్ కీలక పాత్ర పోషించింది. సింధ్‌కు చెందిన ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్త హేము కలాని (19) బ్రిటిష్ సైన్యంచే ఉరితీయబడ్డారు. కనకలతా బరువా వంటివారు ప్రాణాలర్పించారు. బెంగాల్ కరువు (1943), ఆర్ఐఎన్ మ్యూటినీ (1946), 1943 బెంగాల్ కరువు సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనడం, 1946లో బాంబేలో రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటుకు మద్దతుగా విద్యార్థులను కదిలింపజేయడం వంటి చారిత్రాత్మక పనులు చేసింది.

నవంబర్ 20న తొలిసారిగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ డే నిర్వహించారు. స్వతంత్ర భారతంలో పోరాట పంథా (శాస్త్రీయ సోషలిజం వైపు), స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారీ విధానాల వల్ల ఏర్పడిన నిరుద్యోగం, పేదరికం, ఆకలి మరణాలకు వ్యతిరేకంగా ఎఐఎస్‌ఎఫ్ నినదించింది. సమగ్ర విద్యారంగ సంస్కరణల కోసం ఉచిత, నిర్బంధ, శాస్త్రీయ, లౌకిక విద్య కోసం దేశవ్యాప్త పోరాటాలు నిర్వహించింది. ఫాసిజం, సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికలపై అంతర్జాతీయంగా అంతర్జాతీయ విద్యార్థి సంఘం స్థాపనలో భాగస్వామ్యమైంది.

### విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణపై

భారతీయ విద్యా వ్యవస్థను మతతత్వ భావజాలంతో నింపే కాషాయీకరణ, విద్యను అంగడి సరుకుగా మార్చే కార్పొరేటీకరణ, ప్రజాస్వామ్య, లౌకిక, శాస్త్రీయ దృక్పథానికి అత్యంత ప్రమాదకరమని ఎఐఎస్‌ఎఫ్ భావిస్తుంది. దీనికి వ్యతిరేకంగా ఎఐఎస్‌ఎఫ్ నిరంతర సైద్ధాంతిక, ప్రత్యక్ష పోరాటాలు సాగిస్తోంది. శాస్త్రీయ దృక్పథానికి తూట్లు పొడుస్తూ డార్విన్ పరిణామ సిద్ధాంతం తొలగింపు, మొఘల్/మధ్యయుగ చరిత్ర వక్రీకరణ, మనువాద భావజాలాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాలను శాస్త్రీయ విద్యకు వ్యతిరేకం గా చూస్తుంది. ఎన్ఈపి 2020 తిరస్కరిస్తూ,, జాతీయ విద్యా విధానం, విద్యను మరింత కేంద్రీకృతం చేస్తూ, మతతత్వ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తో ది. యూనివర్సిటీలు చర్చావేదికలుగా, శాస్త్రీయ పరిశోధనా కేంద్రాలుగా ఉండాలే కానీ, మతతత్వ రాజకీయ క్రీడాక్షేత్రాలుగా మారకూడదని ఎఐఎస్‌ఎఫ్ స్పష్టం చేస్తుంది. క్యాంపస్‌లలో భావప్రకటన స్వేచ్ఛ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు సామాజిక న్యాయం కోసం నిలబడుతుంది. 'చదువుకునే వయసులో కుల, మత, కార్పొరేట్ విషబీజాలు కాదు... శాస్త్రీయ వైజ్ఞానిక చైతన్యం అందించాలి.''అనేది ఎఐఎస్‌ఎఫ్ విద్యా విధాన వైఖరి.

ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్య/యూనివర్సిటీల వరకు ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని ఏఐఎస్‌ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఫీజుల మోత, విపరీతమైన ఫీజులు, డొనేషన్ల వల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోందని, ఉచిత, నిర్బంధ నాణ్యమైన ప్రభుత్వ విద్యే ఏకైక పరిష్కారమని వాదిస్తుంది. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం, విద్యార్థులపై కాలేజీల యాజమాన్యాల ఒత్తిళ్లకు వ్యతిరేకంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దఎత్తున సమ్మెలు, ధర్నాలు నిర్వహిస్తోంది. పాఠ్య పుస్తకాలలో శాస్త్రీయ చరిత్రను తొలగించి, మతతత్వ, పౌరాణిక గాథలను చొప్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తుంది.

### తెలంగాణలో సంక్షోభంలో విద్యారంగం

తెలంగాణలో విద్యారంగం ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, మరోవైపు విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న ఉపాధ్యాయ, ఆచార్యుల ఖాళీలు విద్యారంగాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని ప్రకటనలు వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో దాదాపు 80శాతం వరకు బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. విసిల నియామకాలు, రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడం వల్ల ఉన్నత విద్య ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ని ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరత వల్ల ఒకే గదిలో ఐదు తరగతులను ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. పేదరికం, రవాణా సౌకర్యాల లేమి, సరైన వసతులు లేకపోవడం వల్ల పదో తరగతి, ఇంటర్మీడియట్ దశలోనే విద్యార్థులు చదువు మధ్యలో మానేస్తున్న సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో కనీస పఠనా సామర్థ్యాలు కూడా సరిగ్గా లేకపోవడం విద్యా వ్యవస్థలోని లోపాలను కళ్లకు కడుతోంది. విద్యార్థుల ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్ షిప్‌లు అందడం లేదు. ఈ సమస్యలను చక్కదిద్దేందుకు ప్రభుత్వం విద్యా కమిషన్ నివేదికల ఆధారంగా కొన్ని కీలక మార్పులకు, పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనం వంటి సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నప్పటికీ, కేవలం చట్టాలు, జిఒల వల్ల మాత్రమే మార్పు రాదు. భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యారంగం ఇలా అస్తవ్యస్తంగా మారితే అది రాష్ట్ర భవిష్యత్తుకే పెద్ద ముప్పు. తక్షణమే ప్రభుత్వం నాణ్యమైన విద్య అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఆచార్యుల పోస్టులను భర్తీ చేసి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

### వర్ధమాన సవాళ్లు – 90వ వసంతం లక్ష్యాలు

నేటి కాలంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి 2020)లోని విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ, ఫీజుల పెంపుదలకు వ్యతిరేకంగా ఏఐఎస్‌ఎఫ్ గళం వినిపిస్తోంది. శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, లింగ సమానత్వం, విద్యార్థుల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం నేటి యువతకు ఎఐఎస్‌ఎఫ్ 90 ఏళ్ల చరిత్ర ఒక దిక్సూచిగా నిలుస్తుంది. 'చదువుతో జ్ఞానాన్ని ఆర్జించండి... సమాజ మార్పు కోసం పోరాడండి' అనే మూలసూత్రంతో ఏఐఎస్‌ఎఫ్ తరం నుంచి తరానికి స్ఫూర్తిని పంచుతూనే ఉంది.

*(సెప్టెంబర్ 28,29,30 తేదీలలో హనుమకొండలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలు జరుగుతున్న సందర్భంగా)*

# ఎన్నికల సంఘంపైనే ప్రశ్నలు తలెత్తితే?



డా.ముచ్చుకోట సురేష్ బాబు

భారత ఎన్నికల సంఘం మరో సారి విశ్వసనీయతకు సంబంధించిన ప్రశ్నల మధ్య నిలిచింది. అయితే ఈసారి వివాదం కేవలం రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలకు పరిమితం కాలేదు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా, కమిషన్ పనితీరుకు సంబంధించిన నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇది ఏ రాజ్యాంగ సంస్థకైనా తీవ్రమైన పరిణామమే. ముఖ్యంగా దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించే బాధ్యత కలిగినసంస్థ విషయంలో దీనిని తేలికగా తీసుకోలేం.

ఎన్నికల సంఘం మాత్రం తన పనితీరును సమర్థించుకుంది. నిర్ణయ ప్రక్రియలో భిన్నాభిప్రాయాలు, లిఖితపూర్వక అభిప్రాయాలు, అంతర్గత పరిశీలనలు సహజమేనని, చివరకు నిర్ణయాలు నిర్దేశిత విధానాల ప్రకారమే తీసుకున్నామని తెలిపింది. అయితే ప్రశ్న అక్కడితో ముగియదు. అసలు ప్రశ్న పారదర్శకత దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నేపథ్యంలోనే ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఓటర్ల జాబితాల్లో మరణించినవారు, వేరే ప్రాంతాలకు తరలిపోయినవారు, అనర్హులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వారి పేర్లను తొలగించి జాబితాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉండటాన్ని ఎవరూ తిరస్కరించలేరు.

కానీ అసలు ప్రశ్న ఆ ప్రక్షాళన ఎలా జరుగుతోంది? అన్నదే. సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఈ తొలగింపుల్లో చాలా వరకు నిబంధనల ప్రకారం జరిగి ఉండవచ్చు. కానీ ఇంత భారీ స్థాయిలో పేర్లు తొలగించబడుతున్నప్పుడు, ప్రతి అర్హుడైన ఓటరుకు ధృవీకరణ, అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం, అప్పీల్ చేసుకునే సులభమైన విధానం ఉండటం అత్యవసరం. ఓటర్ల జాబితా నుంచి ఒకరి పేరు తొలగిపోవడం కేవలం డేటాబేస్‌లోని ఒక ఎంట్రీ మాయం కావడం కాదు. అది ఆ పౌరుడి ఓటు హక్కును ఆచరణలో వినియోగించుకునే అవకాశాన్ని ప్రభావితం చేసే అంశం.

**డిజిటల్ ఓటర్ల జాబితాపై నియంత్రణ ఎవరిది?**

అంతర్గతంగా లేవనెత్తిన అంశాల్లో అత్యంత కీలకమైనది ఓటర్ల డేటా కేంద్రీకృతం. ఎన్నికల జాబితాల నిర్వహణలో రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి చట్టబద్ధ అధికారులకు తగినంత ప్రాప్యత, నియంత్రణ కొనసాగుతోందా? లేక సాంకేతిక వ్యవస్థల ద్వారా నిర్ణయాధికారం క్రమంగా కేంద్రస్థాయికి కేంద్రీకృతమవుతోందా? అనే ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి.

ఇది ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన అంశం.

సాంకేతికత ఎన్నికల నిర్వహణను మెరుగుపరచాలి. కానీ చట్టబద్ధ బాధ్యతను సాంకేతిక వ్యవస్థ భర్తీ చేయకూడదు.

ఓటర్ల జాబితాలో ప్రతి పేరు చేర్పు, తొలగింపు లేదా మార్పుకు స్పష్టమైన డిజిటల్ ఆధారం ఉండాలి. ఎవరు మార్పు చేశారు? ఏ చట్టపరమైన అధికారంతో చేశారు? ఏ ఆధారంతో చేశారు? అనే ప్రశ్నలకు ఆడిట్ ద్వారా సమాధానం దొరికేలా వ్యవస్థ ఉండాలి. గోవాలో 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించినప్పటికీ, సాఫ్ట్‌వేర్ పరిమితుల కారణంగా ఆ నిర్ణయాలను నమోదు చేయడంలో సమస్యలు ఎదురయ్యాయని వచ్చిన నివేదికలు కూడా డిజిటల్ వ్యవస్థలపై పారదర్శకత, బాధ్యత ఎంత అవసరమో చూపిస్తున్నాయి.

అంతర్గత భిన్నాభిప్రాయం సమస్య కాదు

అసలు ఆందోళన ఏమిటంటే— ఆ అభ్యంతరాలను ఎలా పరిగణించారు? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? ప్రజలకు దాని గురించి ఎంతవరకు సమాచారం అందుతోంది?

కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం–6 విధానంలో మార్పులు, పశ్చిమ బెంగాల్‌లో అప్పీళ్ల ప్రక్రియ వంటి అంశాలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. ఇలాంటి విషయాల్లో రాజకీయ ఆరోపణలు కాకుండా స్పష్టమైన నియమాలు, ఆధారాలు, పత్రా లు ప్రజలకు అందుబాటులో ఉండాలి.

ఎన్నికల జాబితాలను అధికార పార్టీకి అనుకూలంగా మార్చుతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బిజెపి, ఎన్నికల సంఘం ఆ ఆరోపణలను ఖండిస్తున్నాయి. వాటికి ఆధారాలు అవసరం.

అదే సమయంలో, ఎన్నికల నిర్వహణపై లేవనెత్తుతున్న ప్రతి ప్రశ్నను రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. ఎవరు ప్రశ్న అడిగారు అన్నదానికంటే, ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటి? అన్నదే ప్రజాస్వామ్యంలో ముఖ్యం.

ఎన్నికల సంఘం విశ్వసనీయత కేవలం ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో లేదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా విశ్వసించడంలో ఉంది. అందుకే ప్రస్తుత వివాదాన్ని మరో రాజకీయ ఘర్షణగా చూడకుండా, సంస్థాగత పారదర్శకతను పెంచుకునే అవకాశంగా ఎన్నికల సంఘం చూడాలి. అంతర్గతంగా లేవనెత్తిన అభ్యంతరాలపై సాధ్యమైనంతవరకు పత్రాలు, విధానాలు, నిర్ణయాల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ఓటర్ల డేటాబేస్ భద్రత, పేర్ల తొలగింపు, కొత్త నమోదు, అప్పీళ్ల ప్రక్రియలపై స్పష్టమైన జవాబులు ఇవ్వాలి. ఎందుకంటే భారత ప్రజాస్వామ్యం మమ్మల్ని నమ్మండి అనే మాటపై మాత్రమే ఆధారపడకూడదు. అది పారదర్శకమైన విధానాలు, చట్టబద్ధమైన నిర్ణయాలు, స్వతంత్ర పరిశీలన, ప్రజలకు జవాబుదారీతనం మీద నిలవాలి.

చివరికి ప్రశ్న ఒక్కటే:

అర్హత కలిగిన ప్రతి భారతీయుడి పేరు ఓటర్ల జాబితాలో ఉందని, తన ఓటు హక్కును ఎవరూ ఏకపక్షంగా తొలగించలేరని, తన ఓటుకు సంబంధించిన ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతోందని ఒక సాధారణ పౌరుడు నమ్మగలడా? ఆ నమ్మకాన్ని ఎన్నికల సంఘం మాటలతో కాదు–వ్యవస్థతో, ఆధారాల తో, పారదర్శకతతో నిరూపించాలి. ఎన్నికలు ఎవరు పాలించాలో నిర్ణయిస్తాయి. కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో నిర్ణయిస్తుంది.

## సిఇసి రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో

# 28న రాష్ట్రవ్యాప్తంగా టిపిసిసి ఆందోళనలు

- ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద 10.30 గంటలకు భారీ నిరసన
- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి
- టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిరసనగా ఎఐసిసి పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తం గా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10.30 గంటలకు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న మొదటి నుచి అనేక అనుమానాలకు తావిస్తుందని ఆయన విమర్శించారు. ఈ మేరకు మహేష్‌కుమార్ గౌడ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్‌ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం 6లో సర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని, ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయాన అన్నారు. ఫారం6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

# గుడిసెలు లేని రాష్ట్రమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- 72వేల ఉద్యోగాలిచ్చాం... రూ.70వేల కోట్ల జీరో వడ్డీ రుణాలు
- రూ.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం
- ప్రెస్టన్‌గ్రౌండ్‌లో జరిగిన సభలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/జనగామ :** ఇది ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించి గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే 72 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మరో ఐదారు నోటిఫికేషన్లు వేస్తున్నామని, మహిళల్ని కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంతో రూ.70వేల కోట్ల జీరో వడ్డీ రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి, పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలు అమలు చేస్తాన్నామన్నారు. శనివారం జనగామలో సుమారు రూ.37 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, 500 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. జనగామ పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రెస్టన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో మంత్రి పొంగలేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 33 మాసాల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి కానున్నాయన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం వారి ఖాతాలో డబ్బులు వేయడం జరుగుతుందని, 40వేల ఇళ్లకు ఇటీవల ఫైనల్ బిల్లు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మరో లక్షా 80వేల ఇళ్లు పూర్తి అయ్యాయని వాటికి సైతం పది, పదిహేను రోజుల్లో ఫైనల్ బిల్లులు జమ చేస్తామనానరు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నామని మొదటి ప్రాధాన్యతగా గుడిసెల్లో ఉండే లబ్ధిదారులను గుర్తించి వారి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జనగామ జిల్లాలో 500 గుడిసెలు ఉన్నాయని అధికారుల సర్వేలో తేలిందని, రాజకీయాలకు అతీతంగా ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఒక్కటే కాకుండా 33 మాసాల కాలంలో రూ.70వేల కోట్లు డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ రుణాలు ఇచ్చామని, మరిన్ని రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జనగామ మున్సిపాల్టీలో మౌలిక వసతుల కల్పనకు స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్ పర్సన్ కోరిన విధంగా దసరా నాటికి రూ.25 కోట్లు మంజూరు చేస్తానని హామి ఇచ్చారు. ఇలా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందన్నారు.

**మేము ప్రజలకే జవాబుదారి : ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**

తమను ప్రజలు ఆశీర్వదించి గెలిపించారు. అందుకే తాము ఎవరికీ జవాబాదారి కాదు ప్రజలకే జవాబుదారి అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కరోజు తీరిక లేకుండా పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ తెచ్చుకుంది భవిష్యత్తు కోసమే అన్నారు. ఐదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలు ఆ తరువాత నెలబెడతారో.. కూలగొడతారో వారి ఇష్టమన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, అధికారులు సైతం ఇదే గుర్తించాలన్నారు.

**అభివృద్ధి పనులకు నిధులివ్వండి :ఎమ్మెల్యే పల్లా**

జనగామలో అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. చిటకోడూరు రోడ్డు, జనగామ నెల్లుట్ల బైపాస్ రోడ్డు, జనగామ పట్టణంలో రోడ్లు, మురుగు కాల్వలకు నిధులు మంజూరు చేయాలని, దేవాదుల రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయడం కోసం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద నాలుగు మోటర్లు మునిగినందున వాటిని వెంటనే రిపేర్ చేయాలని కోరారు.

**జనగామను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్**

జనగామను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. డంపింగ్ యార్డు, నీటి శుద్ధి కేంద్రం మంజూరు అయ్యాయని, మున్సిపాల్టీ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు అవసరం ఉన్నాయన్నారు. జనగామ పట్టణ సుందరీకరణతో పాటు రోడ్లు, కాల్వలు మరమ్మత్తు చేస్తామని, కొత్తగా నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, యాదాద్రి లక్ష్మి నర్సింహ్మస్వామి ట్రస్ట్‌బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్, చెంచారపు కరుణాకర్‌రెడ్డి, ఆర్‌డిఓ గోపిరాం, మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్‌రెడ్డితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మిస్సైన హియరింగ్.. ఓటు తొలగింపునకు కారణం కాదు

- తెలంగాణ 'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ 7 డిమాండ్లు..
- నోటీసులు, ఫారం-6, సాఫ్ట్‌వేర్‌పై పారదర్శకత కోరిన టిపిసిసి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో విచారణకు హాజరు కాలేదన్న ఒక్క కారణంతో ఓటరు పేరును తొలగించరాదని టిపిసిసి డిమాండ్ చేసింది. ఓటర్లకు జారీ చేసిన నోటీసుల్లో ఉన్న అసమానతలను స్పష్టంగా వెల్లడించడం, ఫారం–6 దరఖాస్తులపై రోజువారీ వివరాలు ప్రకటించడం, ఓటర్ల జాబితా నిర్వహణ సాఫ్ట్‌వేర్‌కు స్వతంత్ర ఆడిట్ నిర్వహించడం సహా ఏడు డిమాండ్లను ఎన్నికల సంఘం ముందు ఉంచింది. గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిపిసిసి అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ ఈ డిమాండ్లను వెల్లడించారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రారంభమైన సమయంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ముసాయిదా జాబితాలో సుమారు 2.65 కోట్ల మంది మాత్రమే ఉన్నారని నిజాముద్దీన్ తెలిపారు. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ (ఏఎస్‌డిడి) కేటగిరీల కింద 73.39 లక్షల మంది ముసాయిదా జాబితాలో లేకుండా పోయారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 3,38,26,448 మంది ఓటర్లలో 2,64,87,213 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారు; 73,39,235 మంది ఎఎస్‌డిడి కేటగిరీలో ఉన్నారు. మరోవైపు సుమారు 92.87 లక్షల నోటీసులు జారీ కాగా, అందులో దాదాపు 60.50 లక్షలు వివిధ అసమానతలకు, 32.36 లక్షలు 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాకపోవడానికి సంబంధించినవని ఆయన తెలిపారు. సుమారు 47 లక్షల మంది నోటీసుదారులు విచారణకు హాజరు కాలేదని, మరో 7.41 లక్షల నోటీసులు అందజేయాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే విచారణకు రాకపోవడాన్ని ఓటరు చనిపోయినట్లు, వేరే ప్రాంతానికి వెళ్లిపోయినట్లు, డూప్లికేట్‌గా లేదా అనర్హుడిగా నిర్ధారించే ఆధారంగా పరిగణించరాదని ఆయన అన్నారు. నోటీసు అందుకున్న ప్రతి ఓటరుకు తన పేరుపై నమోదైన కచ్చితమైన అసమానత ఏమిటో తెలియజేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే 11 రకాల అసమానతలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా పూర్తి వివరాలను ఎన్నికల సంఘం బహిరంగపరచాలని కోరింది.

ఫారం–6 దరఖాస్తులకు సంబంధించి ప్రతిరోజూ ఎన్ని స్వీకరించారు, ఎన్ని ఆమోదించారు, ఎన్ని తిరస్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో వెల్లడించాలని సూచించింది. ఎఎస్‌డిడి జాబితా, విచారణకు గైర్హాజరైనవారు, తిరిగి చేర్చిన ఓటర్ల వివరాలను లింగవారీగా ప్రకటించాలని కూడా కోరింది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను ఎస్ఐఆర్ విచారణలో చెల్లుబాటు అయ్యే ఆధార పత్రంగా గుర్తించాలని నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌పై స్వతంత్ర ఆడిట్ నిర్వహించి, చేర్పులు–తొలగింపుల విషయంలో స్థానిక ఎన్నికల నమోదు అధికారులకు ఉన్న అధికారాలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత నియంత్రణలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. 73.39 లక్షల మంది ముసాయిదా జాబితా నుంచి బయటపడగా, వారి పేర్లను తిరిగి చేర్చుకునేందుకు సుమారు 4.4 లక్షల ఫారం–6 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని నిజాముద్దీన్ పేర్కొన్నారు. కేవలం పునరుద్ధరణకు అవకాశం కల్పించడం సరిపోదని, ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం, పారదర్శకత ఉండాలని అన్నారు. ముఖ్యంగా అద్దెకు నివసించే వారు, వలస కార్మికులు, పేద కుటుంబాలు, మహిళలు ఓటర్ల జాబితా సవరణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్‌పై తెలంగాణలోని అంశాలను సెప్టెంబర్ 29న న్యూఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రస్తావించనున్నట్లు నిజాముద్దీన్ తెలిపారు.

# జైళ్లశాఖ, రైల్వే పార్సిల్ సేవలకు స్కోచ్ అవార్డు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైదీల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రిస్తూ వారిని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన 'నివృత్తి డీ అడిక్షన్ కేంద్రాల'కు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు–2026 లభించింది. ఖైదీల పునరావాసం, వ్యసన విముక్తికి శాస్త్రీయ పద్ధతుల్లో అందిస్తున్న చికిత్స, కౌన్సెలింగ్, ప్రవర్తనా మార్పు కార్యక్రమాలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరిగిన 109వ స్కోచ్ సమ్మిట్–ఇండియా ఎకనామిక్ ఫోరంలో తెలంగాణ జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ అవార్డును స్వీకరించారు. స్కోచ్ లా ఆఫీసెస్ వ్యవస్థాపకుడు రోహన్ కొచర్, స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచర్ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జైళ్లశాఖ డిఐజి ఎం.సంపత్ పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ డ్రగ్‌ఫ్రీ తెలంగాణ లక్ష్యానికి అనుగుణంగా 'నివృత్తి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్ఎపిడిడిఆర్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. వ్యసనానికి గురైన వారిని గుర్తించడం, స్క్రీనింగ్, కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం, విడుదల అనంతరం సమాజంలో తిరిగి కలిసేలా సహకారం అందించడం ఈ కార్యక్రమంలో భాగంగా ఉంది. స్కోచ్ అవార్డు తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి లభించిన గుర్తింపుగా డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆఫ్టర్‌కేర్, నిరంతర సహకారం, సామాజిక పునరేకీకరణ కొనసాగాలని ఆమె పేర్కొన్నారు.

**ఎస్‌సిఆర్‌కు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు**

**హైదరాబాద్ డివిజన్ వాణిజ్య విభాగం రూపొందించిన యాప్‌కు అవార్డు**

రైల్వే పార్సెల్ సేవలను డిజిటల్ బాట పట్టించి, వినియోగదారులకు మరింత సులభతరం, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన దక్షిణ మధ్య రైల్వేకు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు–2026 దక్కింది. హైదరాబాద్ డివిజన్ వాణిజ్య విభాగం రూపొందించిన 'రైల్ పార్సెల్ యాప్'కు ఈ–గవర్నెన్స్ విభాగంలో ఈ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌సిఆర్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇటి పాండే, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవార్డును స్వీకరించారు. రైలు పార్సెల్ సేవల్లో ఇప్పటివరకు ఉన్న స్టేషన్ కేంద్రిత విధానాన్ని మార్చి, ఫస్ట్ మైల్ డోర్‌స్టెప్ పికప్ నుంచి రైల్వే నెట్‌వర్క్ ద్వారా మిడ్ మైల్ రవాణా, చివరగా లాస్ట్ మైల్ డోర్‌స్టెప్ డెలివరీ వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించడం రైల్ పార్సెల్ యాప్ ప్రత్యేకతగా నిలిచింది. అవార్డు లభించడంపై ఎస్సీఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య విభాగం, హైదరాబాద్ డివిజన్ అధికారులను అభినందించారు. ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇటి పాండే, హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ అనిరుధ్ పామర్‌తోపాటు సంబంధిత సిబ్బంది కృషిని ప్రశంసించారు.




# భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, అదే స్ఫూర్తితో బిసిలందరూ ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం పోరాడాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ వీరనారి, రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి (చిట్యాల) ఐలమ్మ 131వ జయంతి వేడుకలు హైదరాబాద్ రవీంద్రభారతిలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి, బిసి శాఖ ముఖ్య సలహాదారు వి.హనుమంతరావు, వాషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ డి.అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బంగారు బాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయినప్పటికీ, టెలిఫోన్ ద్వారా తమ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బిసి జనగణనలో బిసి వర్గాలను చేర్చాలనే డిమాండ్ జరుగుతున్న పోరాటానికి ప్రభుత్వం తరపున పూర్తి అండదండలు ఉంటాయన్నారు. తాను ఎంపిగా పనిచేసిన కాలంలో పెద్దపల్లిలో మూడు విగ్రహాల ఏర్పాటుకు కృషి చేశానని, గోదావరిఖని, చెన్నూరు, మందమర్రి తదితర ప్రాంతాల్లో రజక సంఘాల కమ్యూనిటీ భవనాలు, ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు మంత్రి గుర్తుచేశారు. బిసిల అభ్యున్నతి కోసం వి.హనుమంతరావు, ఆర్.కృష్ణయ్య నిరంతరం చేస్తున్న పోరాటాలను ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బాల్మూర్ వెంకట్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ రాష్ట్రానికి మణిహారం

- పదివేల ఆయిల్‌పామ్ తోటలకు ఫ్యాక్టరీ నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట :** దేశంలోనే అత్యాధునిక యంత్రాలతో నిర్మించిన నరమెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ తెలంగాణ రాష్ట్రానికి మణిహారమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంత్రిగా తొలిసంతకం నర్మెట్ట ఫ్యాక్టరీ నిర్మాణానికి చేశానని, అధికారుల ప్రత్యేక శ్రద్ధతో ఫ్యాక్టరీ త్వరగా నిర్మాణం పూర్తయిందన్నారు. శనివారం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో గల ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ పనితీరును, నీటి లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్చి నుండి ఇప్పటివరకు ఈ ఫ్యాక్టరీలో 70 వేల మెట్రిక్ టన్నుల గెలలను ప్రాసెస్ చేయడం జరిగిందన్నారు. ఈ ఆయిల్ ఫ్యాక్టరీలో ఓఈఆర్ అధికంగా వచ్చి రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభించినప్పుడు రూ.12 వేల ధర టన్నుకు ఉండగా ఇప్పుడు రూ.24 వేలకు పెరిగిందన్నారు. దేశంలోనే అత్యాధునిక యంత్రాలతో నిర్మించిన నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ తెలంగాణ రాష్ట్రానికి మణిహారం అన్నారు. రాష్ట్రం నడి మధ్యలో గుండెకాయలాగా ఉండి అన్ని జిల్లాలకు సేవలను అందిస్తుందన్నారు. పదివేల ఎకరాలు ఆయిల్‌పామ్ తోటలు ఉన్న జిల్లాకు ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం 11 ఫ్యాక్టరీలు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో నిర్మాణంలో ఉన్నాయి. రిలయన్స్ సంస్థ కూడా తెలంగాణలో రీఫైనరీతో కూడిన ఆయిల్ సన్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ముందుకు వచ్చిందన్నారు. 10 లక్షల ఎకరాలతో దేశంలో సగానికి పైగా ఆయిల్‌పామ్ తోటలు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఉన్నాయన్నారు. 40 సంవత్సరాల క్రితం తోటల పెంపకం ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆరు లక్షలు, మూడు, నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభమైన తెలంగాణలో నాలుగు లక్షల ఎకరాల్లో పంట పండిస్తున్నారు. రానున్న మూడు, నాలుగు సంవత్సరాలలో తెలంగాణలో 10 లక్షల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు జరగాలని నా ఆకాంక్ష అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావం వలన ఫ్యాక్టరీలో నీటి సమస్య తలెత్తడంతో జిల్లా కలెక్టర్ కె.హైమావతి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తపస్పల్లి రిజర్వాయర్ నుండి నీటిని పంపిణీ చేయించి ఫ్యాక్టరీకి పంపిణీ చేయించారని, అందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం తరపున కృతజ్ఞతలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ఎంపీల ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థిర అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటలను పండించేందుకు రైతులు అధికంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసం

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అటకెక్కించిందని, సాగునీరు, తాగునీరుతో పాటు విద్యుత్ సరఫరాలో ఘోరంగా విఫలమైందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో తీవ్ర విద్యుత్ కొరత ఉన్నప్పటికీ, అప్పటి సిఎం కెసిఆర్ మొదటి రివ్యూ విద్యుత్ రంగంపైన నిర్వహించి, రాష్ట్రాన్ని చీకటి నుంచి వెలుగుల వైపు నడిపించారన్నారు. విద్యుత్ సంస్థలకు తెలంగాణ సోయి ఉన్న అధికారులైన ప్రభాకర్ రావు, రఘుమారెడ్డి, శంకర్ నారాయణలను నియమించి, రూ.36 వేల కోట్లు వెచ్చించి, విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. కేవలం మూడేళ్లలోనే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను మెరుగుపరిచి, 28 వేల కిలోమీటర్ల మేర కొత్త లైన్లు, సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసి, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. ఒడిశా, ఢిల్లీ, ముంబైలలో విద్యుత్ ప్రైవేటీకరణ తీవ్రంగా విఫలమైందని, ఇక్కడ కూడా రేవంత్ రెడ్డి తన మిత్రులకు లబ్ధి చేకూర్చేందుకే రూ. లక్షల కోట్ల ఆస్తులున్న ట్రాన్స్‌కోను కారుచౌకగా అమ్మేస్తున్నారని విమర్శించారు. అధికారులను ఎసిబి కేసులతో బెదిరిస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని, బిఆర్ఎస్ ఈ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి విషయంలో కూడా ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని, 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని ఆరోపించారు. డైవర్షన్ డ్రామాలు విడిచిపెట్టి, దసరా వరకు వేచి చూడకుండా వెంటనే పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టి ఎండుతున్న పొలాలను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలతో భారత ప్రగతికి బలమైన పునాది వేసి కొత్త దిశ చూపారని ఆయన కొనియాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివన్నారు. సరళత, విజ్ఞానం, నిబద్ధతతో ప్రజాసేవ చేసిన మహనీయుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. ప్రపంచ ఆర్థిక వేదికపై భారత స్థాయిని బలోపేతం చేసిన నేత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజాయితీ, అంకితభావానికి మన్మోహన్ సింగ్ ఆదర్శమని, మన్మోహన్ సింగ్ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మన్మోహన్ సింగ్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. గాంధీభవన్‌లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, టిపిసిసి నాయకులు సామ రామ్మోహన్ రెడ్డి, అల్లం భాస్కర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఫోన్ నం. 0878-2243438, ఫ్యాక్స్ నం. 0878-2240624, ఇమెయిల్: knrcmnr@rediffmail.com

సీల్డ్ కొటేషన్ నోటీసు

నం. E1/MCK//Quotations/Non-SoR/Vanamahotsavam/2026-27, తేదీ: 25.09.2026

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే "వనమహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పూలు మరియు పండ్ల మొక్కల పెంపకానికి సంబంధించిన పనుల కోసం (Non-SoR రేట్ల పరిధిలోకి వచ్చే ఐటెంలపై) సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది. కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ: 03-10-2026, సాయంత్రం 04:30 గంటలు. మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన నంబర్: 7995013525

సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 10671-PP/CL/ADVT/2026-27, Date: 26-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, చార్మినార్ జోన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు – నిర్వహణ పనులు

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 14/EE-25/ CRZ/GHMC/ 2026-27 | SI No. 01 to 1 | రూ. 50.00 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 28.09.2026 ఉ.10.30గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ: 06.10.2026 మ.01.00గం.ల వరకు | శ్రీ ఆర్.యాదగిరి, ఇఇ, సర్కిల్-25, చార్మినార్ జోన్, మస్రతి గ్రాండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్. సెల్ నెం. 9030478364 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25- సంతోష్‌నగర్, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10719-PP/CL/ADVT/2026-27, Date: 26-09-2026

## శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి

తెలంగాణ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/షాబాద్: శాస్త్రీయ యజమాన్య పద్దతులను తప్పని సరిగా పాటించాలని తెలంగాణ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం ద్వారా రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాజేశ్వర్ రెడ్డి, భారతి మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే ముందు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులు పంటలు వేసే ముందు వ్యవసాయ అధికారుల ద్వారా భూమిలో మట్టి పరిక్షలు చేసిన అనంతరం పంటలు నాటుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర, రైతులు పాల్గొన్నారు.

## యువత గ్రామాభివృద్ధికి పాటు పడాలి



ప్రజాపక్షం/యాచారం : యువత చెడు అవాట్లకు అలవాటు పడకుండా గ్రామాభివృద్దికి అందరు కృషి చేయాలని ఎవిజి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడాల గణేశ్ అన్నారు. శనవారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఎర్పాటు చేసిన వినాయక ఉత్సవాల సంధర్భంగా గ్రామంలోని యువజన సంఘాలకు అర్ధిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతికగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. తెలంగాణాలో వినాయక చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాధన్యత సంతరించకుందని తెలిపారు. ఎవిజి పౌండేసన్ ఆధ్వర్యంలో గ్రామంలో అనేక కార్యక్రమాలు చేపట్టి నట్లు తెలిపారు. ఎండా కాలంలో అంబలి కేంద్రాలతో బాటు చలి వేంద్రాలు ఎర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామస్తుల సహకారంతో అభివృద్దికి బాటు వేస్తున్నామన్నారు. పాఠశాల విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకోని తనకు తోచిన అర్థిక సహాయం అంద జేస్తున్నామని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు కూడా ప్రతి సంవత్సరం తనకు తోచిన విధంగా అర్థిక సహాయం అంద జేస్తూ యువతకు ప్రోత్సాహం అంద జేస్తున్నానని తెలిపారు. మునుముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు కోనసాగుతాయని తెలిపారు. గ్రామస్తులందరు సహకరించాలని అయన కోరారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రజాపక్షం/యాచారం : విద్యార్థులు చదువుతోబాటు క్రీడల్లో రాణించాలని నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ శాస్త్రీఅన్నారు. శనివారం మండల పరిధిలోని నందివనపర్తి జిల్లా పరిషత్త ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇబ్రహింపట్నం సమీపంలోని గురకుల విద్యాపిఠ్‌లో అండర్ 14 కబడ్డి,అండర్ 17 వాలిబాల్ పోటిల్లో అత్యంత ప్రతిభ కనబర్చిజిల్లా స్థాయి పోటిలకు ఎంపికైనారు.జిల్లా స్థాయిలో ఎంపికైన అండ లోకబడ్డిలో ఎంపికైన ఎం. విష్ణు, కె. శ్రీరామ్ రెడ్డి, వాలీబాల్ అండర్ 17లో అఖిల్,ఎన్ అజయ్ లు పోటిలకు ఎంపికైనారు. ఈ కార్యక్రమంలో ఫ్రిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిషన్ రాథోడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఒ ఆఫీస్ ముందు దివ్యాంగులు ధర్నా




ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ శనివారం దివ్యాంగులు హక్కుల జాతీయ వేధిక రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి.అనంతరం పరిపాలన అధికారికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి అడవయ్య కాసార్ల యాదయ్య,ఆశన్న,భుజంగారెడ్డి,జేర్కోని రాజు,జంగయ్య, మహేష్ వికలాంగులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్‌పై యూత్ కాంగ్రెస్ కీలక సమావేశం

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: చేవెళ్ల అసెంబ్లీ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు,నాగేందర్ రెడ్డి, డిస్టిక్ ఇన్‌చార్జి రాంరెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, కార్యాచరణకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లుగారి కార్తీక్ రెడ్డి,శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి,నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్,చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాంరెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఎం.డి.జాఫర్,యూత్ కాంగ్రెస్ నాయకులు శివకుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,శంకర్‌పల్లి మండల ఉపాధ్యక్షులు శశికాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి,జిల్లా ఇన్‌చార్జ్ రామ్ రెడ్డి హాజరయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేలా గ్రామాలు, మండలాల వారీగా అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు.ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియకు సంబంధించి త్వరితగతిన కార్యాచరణ రూపొందించి, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు.




# స్యాచురేషన్ మోడ్‌లో పంచాయతీ సొంత భవనం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క

ప్రజాపక్షం/రంగారెడ్డి: రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా స్యాచురేషన్ మోడ్‌లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్గొండ,మహబూబ్‌నగర్, రంగారెడ్డి,మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 5,118 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవని,ఆయా గ్రామ పంచాయతీలకు భవనాలు




నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 3,269 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు సుమారు 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ ఏడాదిలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు

గ్రామ పంచాయతీ భవనాలతో పాటు రాష్ట్రంలోని 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.800 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇప్పటికే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి కార్యకలాపాలను మరింత సమర్ధవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

### హ్యామ్ రహదారుల పనులు గడువులోగా పూర్తి చేయాలి

తెలంగాణలో గ్రామీణ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని గ్రామీణ రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మిస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో చేపడుతున్న హ్యామ్ రహదారుల్లో సుమారు 50 శాతం ఈ నాలుగు జిల్లాల్లోనే ఉన్నందున అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు నిర్మాణ పనులకు అనువైన కాలాన్ని పూర్తిగా వినియోగించుకుని పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' పోస్టర్ ఆవిష్కరణ

రంగారెడ్డి జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం-2026 కార్యక్రమాలు



ప్రజాపక్షం/రంగారెడ్డి: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ మాసం 2026లో భాగంగా 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' అనే అంశానికి సంబంధించిన పోస్టర్లను శనివారం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా సంక్షేమ అధికారి జి. శాంతిశ్రీతో కలిసి ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించే పోషణ మాసం సందర్భంగా జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం,ఆరోగ్యం,బాలల సమగ్ర అభివృద్ధి, ప్రారంభ విద్యపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యమన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల్య ఆహారం అందేలా కుటుంబాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు, తగినంత ప్రోటీన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు పోషకాహారంతో పాటు చిన్నారుల ప్రారంభ విద్య, సమగ్ర అభివృద్ధికి కీలక కేంద్రాలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీ మాట్లాడుతూ.. పోషణ మాసం సందర్భంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రాజెక్టు పరిధిలో పోషకాహారం, ఆరోగ్యం, బాలల అభివృద్ధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు.

## రీ-సర్వేకు రైతులు సహకరించాలి

108 గ్రామాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ: కలెక్టర్

ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ సరిహద్దుల చట్టం1923 ప్రకారం జిల్లాలో భూ రీసర్వే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 108 గ్రామాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, 15 గ్రామాల్లో డీజీపీఎస్ పరికరాలతో క్షేత్రస్థాయిలో సర్వే పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. రీసర్వే ప్రక్రియలో ఆయా గ్రామాల్లోని భూములన్నింటినీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేయనున్నట్లు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు, సంబంధిత శాఖల అధికారులు తమ తమ హద్దులను సర్వే, రెవెన్యూ అధికారులకు చూపించి రీసర్వే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.
ఈ రీసర్వే ద్వారా ప్రతి భూమికి ఖచ్చితమైన కొలతలు, అక్షాంశాలు, రేఖాంశాలు, విస్తీర్ణం, ఆకారం, యజమానుల వివరాలు నమోదు చేయబడతాయని తెలిపారు. తద్వారా ప్రతి రైతుకు కొత్త సర్వే నంబర్‌తో పాటు ల్యాండ్ పార్సెల్ మ్యాప్ (ఎల్ పిఎం ) అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. రైతు భరోసా, రైతు బీమా,బ్యాంకు రుణాలు,ఎరువులు, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలు, పంటల విక్రయం వంటి సేవలను భవిష్యత్తులో భూధార్ నంబర్ ద్వారా సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. భూ లావాదేవీలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వ భూసేకరణ, అభివృద్ధి పనుల అమలుకు కూడా ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. రీసర్వేకు భూసేకరణ పనులతో ఎలాంటి సంబంధం లేదని,దీనిపై ఎలాంటి అపోహలకు గురికావద్దని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో రీసర్వే పనులు త్వరగా పూర్తయ్యేలా రైతులు,అధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 'సర్'తో ఓటు హక్కు తొలగిస్తున్న మోదీ ప్రభుత్వం

తెలంగాణ గిరిజన సమాఖ్య



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎస్ఐఆర్ పేరుతో సామాన్య ప్రజల ఓటు హక్కును హరించే ప్రయత్నాలు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఓటు పేరుతో ఓట్లను తొలగించే ప్రయత్నాలు మానుకోవాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ సక్రు నాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బాణావత్ బిక్షం నాయక్ హెచ్చారించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకుని కోట్లాది మంది ప్రజల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తూందని వారు ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యం లో, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భారత ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాం గ సంస్థగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని డిమాండ్ చేశా రు. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉ న్నాయనే భావన ప్రజల్లో కలగకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పలు జిల్లాల్లో డ్రాఫ్ట్ ఓట ర్ల జాబితాలు, నోటీసుల జాబితాలు విడుదలయ్యాయని, తమ ఓటు వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు ఉన్న ప్రజలకు సరైన సమాచారం, అవకాశం కల్పించాలని తెలిపారు. గతంలో ఓటర్ల జాబితా సవరణల్లో డూప్లికేట్ ఓట్లు, మృతుల పేర్లు, చిరునామా మారిన ఓటర్ల వివరాలను గుర్తించడం వంటి అంశాలను ప్రాధాన్యత ఉండేదని, అయితే ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియలో సాధారణ ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేరును తొలగించినా వారికి తమ అభ్యంతరాన్ని తెలియజేసే, అధారాలు సమర్పించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఓటు హక్కు ప్రతి సౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని దాని పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా పనిచేయాలని డిమాండ్ చేశారు.

# చాకలి ఐలమ్మ అంటే దొరల గుండెల్లో వణుకు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



ప్రజాపక్షం/తుర్కయంజాల్ : భూ స్వాములకి వ్యతిరేకంగా దొరల అరాచకాలకి వ్యతిరేకంగా ఆయుధం పట్టిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని ఆమె పేరు వింటేనే దొరలకు గుండెల్లో వణుకు అని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. విరానారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన రావి నారాయణ రెడ్డి కాలనీ ఫజ్ 2 సిపిఐ కార్యాలయంలో జరిగిన నివాళి కార్యక్రమానికి ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ అని అన్నారు. ఐలమ్మను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టిన ఆమె నష్టపోయినప్పటికీ కూడా ఆమె కుటుంబం ఎర్రజెండాను వీడలేదు.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,అబ్దుల్లాపూర్ మెట్ మండ ల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా,మండల కార్యవర్గ స భ్యులు మాధవ రెడ్డి, కాటి అరుణ,వట్టి నవనీత,పేరాల గోపి,వినోద్ నాయక్, సుజాత, ఆవుల యాదగిరి, దుపం నిరంజన్,గణేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం : కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిసి ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలను, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా,నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని మల్లేష్ యాదవ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్,జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్,దశరథ్,శ్రీరాములు,వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్,బిసి వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, బిసి సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు,బిసి సంఘం నాయకులు అచ్చన నరసింహా, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ సాక్షిగా కెసిఆర్ ఆస్తులు తెలంగాణ ఉద్యమకారులకు పంచాలి : వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ : చాకలి ఐలమ్మ సాక్షిగా కెసిఆర్ ఆస్తులు తెలంగాణ ఉద్య మకారులకు పంచాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ని వాళ్లు అర్పించారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో కెసిఆర్ కుటుంబం అక్రమంగా సంపాదించిన ఆస్తులను ఉద్యమకారులకు పం చాలని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులను మోసం చేసిన కెసిఆర్‌ను చూసి చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మ ణ్ బాపూజీ వారి ఆత్మలు క్షోభిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, శేఖర్, అశోక్, మహమ్మద్ హాలీఖాన్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ ఆశయాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



చాకలి ఐలమ్మ ఆశాయాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కా ర్యక్రమంలో కౌన్సిలర్లు వసంత, శ్రీనివాస్, శారద, గోపాల్, శేఖర్, జమాల్‌ఖా న్ రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శం



శంకర్‌పల్లి: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆదర్శమని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా శంకర్ పల్లి పట్టణంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెం కట్ రెడ్డి వెంకట్రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, కౌన్సిలర్లు అశోక్, గణేష్, అఖిల యాదిరెడ్డి గుండా గిరిజ చంద్రశేఖర్, లలితా మోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ

ఎల్‌బి నగర్ : భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడిది చాకలి ఐలమ్మ అని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి కొనియాడారు. శనివారం



చింతలకుంట చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడి దొరలను తరిమికొట్టిన వీరానారి చాకలి ఐలమ్మ గారి ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యాచారం మండల కేంద్రంలో..



యాచారం : మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోదురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రజక సంఘం ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ముందుగా అమే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత శరణం, భూతర రాజు దశరథ,వార్డు సభ్యులు పాష, వెంకట్ రెడ్డి,యాదగిరి, బీముడు, యాదయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు



రంగారెడ్డి: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి,ధైర్యం,ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని టియుఎఫ్ఐడిసి చైర్మన్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జిల్లాలగూడ డివిజన్‌లోని చందన చెరువు కట్టపై వీరవనిత చాకలి ఐలమ్మ 131వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ఐతరాజు భాస్కర్,రాజేందర్,అంజయ్య,యాదయ్య, నరేష్,ఆనంద్ కుమార్,దశరథ,చంద్రయ్య, బాలరాజు,అశోక్,రాజు,రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేష్ గౌడ్,ప్రశాంతి డివిజన్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, సెక్రటరీ శేఖర్ రెడ్డి,పరుశురాం,ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కోటేష్,ప్రభులింగం తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో

ఇబ్రహీంపట్నం : తెలంగాణ సాయుధ పోరాట యోదురాలు,వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ద్రుర్గన్ సుదర్శన్ రెడ్డి పాల్గోన్ని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు మడుపు లక్ష్మమ్మ,సిఎచ్ బుగ్గరాములు,గిరి,కొంద్రు ప్రవీణ్,త్రిలోక్ కుమార్ పాల్గోన్నారు.



# మౌలిక వసతుల కల్పనకు వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రోడ్లు, డ్రైనేజీ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని డిసిసి అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ పారిశుద్ధ్య, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులపై ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డితో వజ్రేష్‌యాదవ్ చర్చించి వినతి పత్రం అందజేశారు. పనులు అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు

ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ మహాసభల సందర్భంగా పోస్టర్ విడుదల

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఈ నెల 28 నుండి మూడు రోజుల పాటు జరుగనున్న ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ మహాసభలు హన్మకొండలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఎఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అజీం పాషా, మహేష్‌లు పిలుపిచ్చారు. ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం మల్లాపూర్‌లో మహాసభలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అన్న నినాదంతో విద్యార్థి లోకం పక్షాన గత 9 దశాబ్దాలుగా పోరాడుతున్న చరిత్రను ఎఐఎస్ఎఫ్ కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులు అలీ, కిరణ్, షబాజ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు పెబ్బల్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌లో శిక్షణ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టిడిఎఫ్) తెలంగాణ ప్రాజెక్టులో భాగంగా పెబ్బల్ ఆర్టిస్ట్ చాడ శ్వేతరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పెబ్బల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పెబ్బల్ ఆర్ట్స్ తయారీ విధానం పెబ్బల్ సేకరణ లాంటి అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థుల చేత ఆర్ట్స్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, ఆచార్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# నకిలీ హిజ్రాలపై చర్యలు తీసుకోవాలి

స్థానిక హిజ్రాల ఆవేదన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్థానికేతర హిజ్రాల వలన హిజ్రాలందరికీ చెడ్డ పేరు వస్తుందని నకిలీ హిజ్రాల ముఠాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లాకు చెందిన హిజ్రా నాయకులు భాగ్యశ్రీ యాదవ్, సాయిసిరి, సంధ్యలు అన్నారు. శనివారం ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమాజం లో ఆగడాలకు పాల్పడుతున్నది స్థానికేతర హిజ్రాలేనని నగరంలో చుట్టు పక్కల అడ్డగోలుగా నకిలీ హిజ్రాలు పుట్టుకొస్తున్నారని వారివల్లే అసలైన హిజ్రాలకు మనుగడ లేకుండా పోతుందని వివరించారు. స్థానికేతర నకిలీ హిజ్రాలు ముఠాలుగా తయారుచేస్తు డబ్బుల కక్కుర్తికై చేయకూడని పనులు చేయించి కమిషన్లతో కొందరు హిజ్రా గురువుల ముఠా నాయకు లు కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. గతంలో వందల్లో ఉన్న హిజ్రాలు నేడు వేల సంఖ్యలో తయారయ్యారని వీరికి ఆశ్రయం కల్పిస్తున్న వారిపై ముఠాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుభకార్యాల సీజన్‌లో మాత్రమే వచ్చి వెళ్లే స్థానికేతర హిజ్రాల వల్ల స్థానిక హిజ్రాల కడుపు కొట్టొద్దని ఆవేదన చెందారు.



# 25 వేల తాగునీటి బాటిళ్లు పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, ప్రభుత్వ అధికారులు, సేవా సిబ్బంది, కార్మికులు, ప్రజలకు 25వేల తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు. లయన్ కొత్తపల్లి రాంబాబు పిఎంజె ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అశోక్‌కుమార్ స్వైన్ పిఎంజెఎఫ్ ప్రారంభించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగారెడ్డి, మాట్లాడుతూ రాంబాబు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమ సలహాదారు లయన్ కొత్త రామారావు పిఎంజె మాట్లాడుతూ భవిష్యత్తులో విజన్ తదితర రంగాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో లయన్ బాల వెంకటేశ్వర్లు, రాంచందర్‌రాజు, మోహన్, జోన్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల పరిధిలోని బండివాడ గ్రామంలో అంజప్ప అనే వ్యక్తి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు పూరిగా కాలిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి కష్టపడి సంపాదించి పెట్టుకున్న డబ్బులు 30లక్షల వరకు ఉందని, నాలుగు తులాల బంగారం, బట్టలు పూర్తిగా కాలి దగ్ధమైపోయాయని తెలిపారు. ప్రభుత్వం అదుకోవాలని బాధితుడు అంజప్ప కోరారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల పరిరక్షణ కోసం పోరాటం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/కాప్రా/బోడుప్పల్ :** తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు పేదలు, రైతుల హక్కులకోసం భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన కామ్రెడ్ చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఇసిఐఎల్ చౌరాస్తాలో సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ జీవితం తెలంగాణా రైతాంగ పోరాట చరిత్రలో చెరగని అధ్యాయమన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం తీరు మరువరానిదన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలను సంఘటితం చేస్తూ మరింత బలోపేతం చేయాలని పిలుపిచ్చారు. ఐలమ్మ చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతరం ముందుకు తీసుకెళ్లాలన్నారు. కామ్రెడ్ ఐలమ్మ ఆశయాలను కొనసాగించటమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, మధు, రవి, ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టరేట్‌లో...**సామాజిక అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బిసి అభివృద్ధి శాఖ





ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల హక్కులు, ఆత్మ గౌరవం కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బిసిల అభివృద్ధి అధికారి ఝాన్సిరాణి మాట్లాడుతూ ఐలమ్మ ధైర్యం, ఆత్మ విశ్వాసం, సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ మాలతి రజక సంఘ నేతలు పాల్గొన్నారు.

**బోడుప్పల్‌లో...**బోడుప్పల్ సర్కిల్‌లోని రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో అణగారిన ప్రజల పక్షాన నిలిచి దొరల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడిన వీరవనిత అని వక్తలు కొనియాడారు. నేటి సమాజంలో వెనుక బడిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం నేటికీ కొరబడ్డాయని, తమ హక్కుల కోసం పోరాటం చేయక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు ముత్యాలు, యాదగిరి, సిద్దులు, సత్తయ్య, వెంకటయ్య, వినోద్, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కల్మారి ఎల్లయ్య, వడ్డేమాను సుధర్, ఎన్ రాము యాదవ్, మరాటి మల్లేష్, చింత రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దసరా, బతుకమ్మ పండుగలు ప్రశాంతంగా నిర్వహించాలి

మున్సిపల్ చైర్మన్ జాం రవి




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** దసరా, బతుకమ్మ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్యం, డ్రైనేజి, విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. దసరా, బతుకమ్మ పండగలను పురస్కరించుకుని ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు ముందస్తుగా కల్పించడంపై అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటగోపాల్, వైస్ చైర్మన్ శశిరేఖ, కౌన్సిలర్లు, ఆర్ఓ హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, డిఇ స్ఫూర్తి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, ఎటిపిఓ సుభాష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు ప్రారంభం

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం నందు వయో వృద్ధుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2026 వేడుకలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కి కెపాసిటి బిల్డింగ్ ఇన్ ఓల్డ్ ఏజ్ హోం అనే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే డే కేర్ సెంటర్స్ సీనియర్ సిటిజన్స్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా తగిన నిబంధనలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, సూపర్ వైజర్స్, సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ మెంబర్స్, డిడబ్ల్యూఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్‌పై విచారణ జరపాలి

ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత అవసరం : డా.సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చట్టబద్ధ విధానాలను పాటించడంపై కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. శనివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వ్యవహారశైలిపై విచారణ జరపాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం 6లో మార్పులు, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అంశాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించబడినట్లు వచ్చిన నివేదికలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, రాష్ట్రాలు, నియోజకవర్గాల వారీగా తొలగించిన పేర్లు, కారణాలు, అభ్యంతరాలు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను ఎన్నికల సంఘం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో చట్టబద్ధ అధికారాలు కలిగిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర, పర్యవేక్షణ, బాధ్యతలపై కూడా స్పష్టత అవసరమన్నారు. సర్ ప్రక్రియ, ఫారం 6 మార్పులు, ఓటర్ల జాబితా డేటా నిర్వహణ తదితర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి 14 సందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేసినట్లు వచ్చిన సమాచారంపై కూడా పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఓటర్ల జాబితా తయారీ నుంచి సవరణలు, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వరకు ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం ఉండాలన్నారు. యువత, ముఖ్యంగా జెన్ జీ, ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని, రాహుల్ గాంధీ చేపడుతున్న పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నాయకత్వానికి గుర్తింపుగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్ ముహమ్మద్ –2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు లభించిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.




# దళితులపై దాడులకు అడ్డుకట్ట వేయాలి

ఎస్‌సి, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : డిహెచ్‌పిఎస్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** తెలంగాణ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న సామాజిక వివక్ష, కుల దాడులు, అత్యాచారాలు, భూ, ఇళ్ల, విద్య, ఉపాధి సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మేడ్చల్ జిల్లా డిహెచ్‌పిఎస్ విస్తృత కౌన్సిల్ సమావేశం కుత్బుల్లాపూర్‌లోని నల్లమల్ల గిరి ప్రసాద్ విజ్ఞాన కేంద్రంలో కొమ్ము వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌సి, ఎస్‌టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సమావేశంలో 2023 నుంచి రాష్ట్రంలో 7,563 ఎస్‌సి, ఎస్‌టి అఘాయిత్య కేసులు నమోదైనట్లు వెల్లడైందన్నారు. బాధితులకు పరిహారం అందించేందుకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. అయితే కేసులు నమోదు చేయడం, పరిహారం ప్రకటించడం మాత్రమే సరిపోదని, దర్యాప్తు, చార్జిషీట్లు, ప్రత్యేక న్యాయస్థానాల్లో విచారణ, బాధితులకు రక్షణ, పునరావాసం, నిందితులకు చట్టపరమైన శిక్ష వేగంగా జరిగేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దళితులు 31 శాతం లబ్ధిదారులుగా ఉన్నారని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని అన్నారు. అలాగే దళితుల అసైన్డ్ భూముల రక్షణ, అక్రమ ఆక్రమణల తొలగింపు, భూమి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లక్ష్మీ నారాయణ, డి.రాములు, కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

పరామర్శించిన ఎస్‌పి స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/పరిగి:** పట్టణంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం తెల్లవారు జామున రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుండగా పరిగి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నర్సింలు గొడవను అదుపు చేసేందుకు మధ్యలోకి వెళ్లారు. గొడవ పడుతున్న తరుణ్ అనే వ్యక్తి కత్తితో కానిస్టేబుల్ పై దాడి చేసి కడుపులో గాయపరిచాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే ఎస్ఐ, సిఐ, డిఎస్‌పి గాయపడిన వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కాంటినెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్నా జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా గాయపడిన వ్యక్తిని పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఏ వ్యక్తిపై దాడిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# డిసిఎం ఢీకొని ఐదు గేదెలు మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రోడ్డు దాటుతున్న పశువులను డిసిఎం వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో 5 గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 4 గేదెలకు తీవ్ర గాయాలైన సంఘటన జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి గ్రామానికి చెందిన రైతు తుమ్మ రాజుకు చెందిన గేదెలు తుర్కపల్లిలోని జ్యోతిష్మతి కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డును దాటుతున్న క్రమంలో గజ్వేల్ నుంచి నగరానికి వెళ్తున్న డిసిఎం వ్యాన్ రోడ్డు దాటుతున్న పశువులను ఢీకొట్టి తిరిగి వెనక్కి రావడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో అక్కడికక్కడే 5 గేదెలు మృతి చెందాయి. గాయపడిన గేదెలకు పశువైద్యాధికారి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి ఐలమ్మ




ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన వారనారి చాకలి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ సేవలు ఎన్నటికీ మరువలేనివని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరు ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జలిగం, చింతస్వామి, సింగారం మల్లేశ్, మురళి, సత్యనారాయణ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



**చర్లపల్లిలో:** తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు , వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా ఇసిఐఎల్ చౌరస్తాలో ఆమె కాంస్య విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయిధ పోరాటంలో వీరనారి చిట్యాల ఐలమ్మ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు, కొత్త రామారావు, ప్రభుదాస్,జి శ్రీనివాస్‌రెడ్డి, శనిగరం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో.....**
నాగారం బిజెపి నాయకులు జూపల్లి నరేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి,



నాగరాజు, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, సూర్య శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగారం డివిజన్ పరిధిలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు పేదలు, రైతుల హక్కుల కోసం భూసామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైరంగా పోరాడిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మల్లేష్‌యాదవ్,అనంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**పరిగిలో:** అణిచివేత,దోపిడీకి వ్యతిరేకంగా భూమి ,భుక్తి హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాధించిన పోరాటం తెలంగాణ సమాజానికిఎంతో స్ఫూర్తిదాయకమని రజకసం కమిటీ సభ్యులు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పరిగి పట్టణంలోని వారి విగ్రహానికిపూలమాలలు వేసి నవాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు రాములు, పట్టణ అధ్యక్షులు అంజనేయులు,జనరల్ సెక్రెటరి శేఖర్ ,నర్సింలు ,జంగయ్య,అంజేయులు. తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్‌లో :** చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం, చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన కృషిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్, మాధవరెడ్డి, అబ్దుల్ ఘని, తదితరులు పాల్గొన్నారు.



**కూకట్‌పల్లిలో :** శనివారం తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఫతేనగర్ డివిజన్ శోభనా కాలనీలోని ధోబీఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఫతేనగర్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, రజక సంఘం ప్రతినిధులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్, రజక సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘట్‌కేసర్ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పొట్ల చెరువు శ్రీరాములు నేతృత్వంలో అంబేద్కర్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,పోచారం మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి,మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, బ్యాంక్ చైర్మన్ సింగిరెడ్డి రామ్‌రెడ్డి, బిజెపి అధ్యక్షుడు కొమ్మిడి మైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం

**• హుస్సేన్ సాగర్‌లో 60 వేల విగ్రహాలు • మహానగరంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ • నగరంలో 10 వేల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు**









**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో గణనాథుడి నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రంతో అత్యంత భక్తిశ్రద్ధలు, ఘనమైన కోలాహలం నడుమ ప్రశాంతంగా ముగిశాయి. శనివారం రెండో రోజు కూడా ఎన్‌టిఆర్ మార్గ్, ట్యాంక్ బ్ండ వైపు వందలాది గణేశ్ మండపాలు క్యూ కట్టాయి. నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేసేందుకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను సడలించడంతో నగరంలో వాహనదారులకు ఊరట లభించింది. సాయంత్రం ఏడు గంటల వరకు ట్యాంక్ బండ్ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను అనుమతించారు. ఈ ఏడాది గ్రేటర్ పరిధిలో నిమజ్జన ప్రక్రియ రికార్డు స్థాయిలో సాగింది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు హుస్సేన్ సాగర్‌తో పాటు ఇతర నిమజ్జన పాయింట్లలో జిహెచ్‌ఎంసి పరిధిలో సుమారు 1,15,000 పైచిలుకు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,19,000 పైచిలుకు విగ్రహాలు నిమజ్జనమయ్యాయి. ఒక్క హుస్సేన్ సాగర్‌లోనే సుమారు 60 వేల విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. ముందస్తు ప్రణాళికలు పక్కాగా అమలు కావడంతో, బాలాపూర్, ఖైరతాబాద్ బడా గణపయ్యల నిమజ్జనం వేగంగా పూర్తయి, రెండో రోజు సాయంత్రానికే మొత్తం ప్రక్రియ సఫలమైంది. నిమజ్జనం పూర్తయిన వాహనాలను ఖైరతాబాద్ సర్కిల్, లక్డీకాపూల్ వైపు మళ్లించడంతో పంజాగుట్ట, సోమాజీగూడ, మాసబ్ ట్యాంక్ పరిసరాల్లో సాయంత్రం వరకు కొంత ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు నిమజ్జనం పూర్తయిన వెంటనే నగరాన్ని శుభ్రపరిచేందుకు జిహెచ్‌ఎంసీ ముమ్మర శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిహెచ్‌ఎంసి, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో ఉత్సవాల సందర్భంగా మొత్తం 10,327 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అయ్యాయి. ఒక్క జిహెచ్‌ఎంసి పరిధిలోని నిమజ్జన రూట్లు, బేబీ పాండ్లు, హుస్సేన్ సాగర్ పరిసరాల్లోనే 4,527 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించారు. గతేడాదితో పోలిస్తే జిహెచ్‌ఎంసి పరిధిలోనే అదనంగా 1,261 మెట్రిక్ టన్నుల చెత్త నమోదైంది. వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించేందుకు 136 బృందాలను, 6,000 మంది సిబ్బందిని రంగంలోకి దించారు. గాల్లోకి లేచే పేపర్ షాట్లను తొలగించేందుకు శానిటేషన్ కార్మికులు కొన్ని చోట్ల నీళ్లతో శుభ్రం చేశారు. ఆదివారం సాయంత్రానికి నగరంలో వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు వెల్లడించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహించిన పూల వ్యర్థాల సేకరణ విశేష ఆదరణ పొందింది. సిఎంసి పరిధిలో గత 11 రోజుల్లో సుమారు 6,000 కిలోల పూజా పూల వ్యర్థాలను సేకరించారు. వీటిని వేరు చేసి ఎండబెట్టి, అగరబత్తీలు, ధూపాలు, దీపాల తయారీలో వినియోగిస్తున్నారు. ఐడిఎల్ చెరువు వద్ద 4,000 కేజీలు, బైరునీ చెరువు వద్ద 1,500 కేజీలు, ప్రగతి నగర్ చెరువు వద్ద 500 కేజీల చొప్పున పూజా వ్యర్థాలను సేకరించారు. మల్కాజ్గిరి చెరువు వద్ద కూడా 2,800 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి రోడ్లన్నింటినీ యంత్రాంగం శుభ్రం చేస్తోంది.

## పిసిబి పర్యావరణ హితం




**ప్రజాపక్షం/సనత్‌నగర్:** ప్రతి ఏటా వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది వినాయకచవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 3.26 లక్షల మట్టి గణపతి విగ్రహాలను పిసిబి పంపిణీ చేసింది. మట్టి విగ్రహాల సరఫరా టెండర్ల కేటాయింపుతో కుమ్మరి సంఘాలకు చేయూత అందించడం జరుగుతోంది. జలాశయాల పరిరక్షణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు, నీటి నాణ్యత పర్యవేక్షణకు టిజిపిసిబి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విగ్రహాల నిమజ్జనాలతో జలవనరుల నీటి నాణ్యతలో వచ్చే మార్పులను గుర్తించి, పర్యావరణంపై ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం, భవిష్యత్లో అవసరమైన కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా టిజిపిసిబి కార్యక్రమాల నిర్వహిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే స్ఫూర్తితో ప్రజలు ప్రతి ఏటా పర్యావరణహిత గణేష్ విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలంటూ పిసిబి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

## సౌర విద్యుత్ కేంద్రంతో సమన్వయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** మరో సబ్‌స్టేషన్ సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో సమన్వయం చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఉప విభాగం పరిధిలోని నాగలగిద్ద సెక్షన్‌లోని 33/11 కేవీ పూసలపాడు సబ్‌స్టేషన్‌కు అనుసంధానించిన డాకాన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం విజయవంతంగా విద్యుత్ గ్రిడ్‌తో సమన్వయం చేయడం జరిగింది.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప స్వామి ఆలయంలో భాద్రపద మాస పౌర్ణమి, ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా శనివారం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఏకవస్త్రధారణ చేసిన 150 మంది మహిళలు ఆరు గంటలపాటు నిర్విరామంగా 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తిశ్రద్ధలతో సాగిన పారాయణంతో దేవస్థాన ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించింది. అనంతరం భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి గుమ్మడిదల సుధాకర్ పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు దేవేందర్ శర్మ, లక్ష్మీ నారాయణమూర్తి, ఫణీంద్ర శర్మ, నరసింహమూర్తి, మహేష్ శాస్త్రి, శశికాంత్ పాండే పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

## కొనసాగిన గణపతి నిమజ్జనాలు



**ప్రజాపక్షం/చార్మినార్:** వినాయక నిమజ్జన కార్యక్రమం శనివారం కూడ కొనసాగింది. పాతబస్తీ నుంచి బయలుదేరిన విగ్రహాలు నిమజ్జనం చేయడం జరిగింది. ఈ క్రమంలోనే ఛత్రినాక చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీశక్తి గణపతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసాయి. ఇందులో భాగంగానే పుప్పాల రఘుమోహన్‌రావు లడ్డూను రూ.1.86 లక్షలకు కైవసం చేసుకున్నారు.

## పేదలకు కొండంత అండ




**ప్రజాపక్షం/బేగంపేట్:** వైద్యం కోసం అయ్యే ఖర్చులను భరించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో అండగా నిలుస్తుందని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. బేగంపేట్ డివిజన్ పాటిగడ్డకు చెందిన రజియా బీకి సిఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును డాక్టర్ కోట నీలిమ అందజేశారు.

## గణేష్ లడ్డూల వేలం



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** వెంకటగిరి యూత్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. స్వామివారి 25 కిలోల పెద్ద లడ్డూను స్థానిక నివాసి బరిగెల జగదీశ్వర్ రూ.1,05,116కు దక్కించుకున్నారు. చిన్న లడ్డూను స్థానిక వ్యాపారి ఠాగూర్ అజయ్సింగ్ రూ.38,001కు కైవసం చేసుకున్నారు. లడ్డూ వేలంలో విజేతలుగా నిలిచిన జగదీశ్వర్, అజయ్సింగ్లను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా శాలువాలుకప్పి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పులి రామ్మోహన్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, రవికుమార్గౌడ్, కొండ నాగార్జున, కొండ శ్రీనివాస్, మార్గం శ్రీనివాస్, దొండి గణేష్, మహానంది, నాయుడు, పొన్నాల శ్రీనివాస్, సందీప్, విష్ణుకుమార్, సర్వేశ్వర్, రాజేశ్వర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## 51,207 వినాయక విగ్రహాలకు..

# రూ.17.80 కోట్ల విద్యుత్ వ్యయం

**టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిన పరిస్థితుల్లోనూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునే వినాయక చవితి ఉత్సవాలకు పూర్తి సహకారం అందిస్తూ టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందించింది. 202627 ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో మొత్తం 51,207 వినాయక విగ్రహాలు, మండపాలు నమోదయ్యాయి. వీటి కోసం 1,12,586 కిలోవాట్ల విద్యుత్ లోడ్ మంజూరు చేయబడగా, ప్రభుత్వం సుమారు రూ.17.80 కోట్ల విద్యుత్ వ్యయాన్ని భరించింది. జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల పరిధిలోని బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, సైబర్సిటీ, రాజేంద్రనగర్, సరూర్నగర్, హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లలో మాత్రమే 20,128 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం 60,217 కిలోవాట్ల లోడ్ మంజూరు చేయబడగా, సుమారు రూ.9.04 కోట్ల విద్యుత్ వ్యయం జరిగింది. గత ఏడాది (202526)తో పోలిస్తే ఈ ఏడాది వినాయక మండపాల సంఖ్య 47,649 నుంచి 51,207కు పెరిగింది. విద్యుత్ లోడ్ 98,627 కిలోవాట్ల నుంచి 1,12,586 కిలోవాట్లకు పెరగగా, విద్యుత్ వ్యయం రూ.15.59 కోట్ల నుంచి రూ.17.80 కోట్లకు పెరిగింది. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు అండగా నిలుస్తూ వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందించింది. అన్ని శాఖల సమన్వయం, విద్యుత్ ఉద్యోగుల అంకితభావం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా వినాయక ఉత్సవాలు విజయవంతంగా పూర్తయ్యాయి అని తెలిపారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లలో భాగస్వాములైన డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, ఏడీఈలు, ఏఈలు, ఓ అండ్ యం సిబ్బంది, ఆర్టీసన్స్, కంట్రోల్ రూమ్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రాజెక్టు పనులకు భూసేకరణ త్వరితగతిన పూర్తి

**ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ ప్రక్రియ, పట్టణ ప్రణాళిక అంశాలపై కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. టౌన్ ప్లానింగ్, ప్రాజెక్ట్స్, భూసేకరణ, న్యాయ విభాగాల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. భూయజమానులతో సంప్రదింపులు జరిపి వివాదాలను త్వరగా ముగించాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యాన్ని నివారించేందుకు టిడిఆర్ జారీ ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలని, భూయజమానులు సమ్మతి తెలిపిన వెంటనే అవసరమైన పత్రాలను పూర్తి చేసి టిడిఆర్ మంజూరు చేయాలన్నారు. టిడిఆర్ పూర్తయిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని కమిషనర్ అధికారులను హెచ్చరించారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఖరాకండిగా చెప్పారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఫిర్యాదుల ఆధారంగా తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ, టిడిఆర్, ప్రాజెక్టుల నిర్వహణ పరస్పర ఆధారితాలు కాబట్టి టౌన్ ప్లానింగ్, న్యాయ, భూసేకరణ విభాగాలు పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు మేలు చేసే మౌలిక వసతుల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ బి. ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సరిత రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బి.ఎల్. శ్రీనివాస్ రావు, ప్రాజెక్ట్స్ ఈఈ రోహిణి, పాల్గొన్నారు.

## నేడు అస్టాకాన్ జాతీయ సదస్సు




**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** రాష్ట్రంలోని స్పయిన్ సర్జన్లను ఒకే అకాడమిక్ వేదికపైకి తీసుకొచ్చి విద్య, పరిశోధన, శిక్షణ, పరస్పర సహకారం, రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ స్పయిన్ సర్జన్స్ ఆఫ్ తెలంగాణ (ఏఎస్ఎస్టీ) అధ్యక్షుడు డా.రాఘవ్ దత్ ములుకుట్ల, కార్యదర్శి డా.ఏ.పవన్ కుమార్ , కోశాధికారి డా.సురేష్. తెలిపారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వారు మాట్లాడారు. యువ సర్జన్లు, పీజీ విద్యార్థులకు మెంటార్షిప్, కేస్ డిస్కషన్లు, వర్క్‌షాప్‌ల ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు ఆధారిత వైద్య విధానాలను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన స్పయిన్ కేర్ డేటాపై పరిశోధనలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఏఎస్ఎస్టీ తొలి ప్రధాన అకాడమిక్ కార్యక్రమంగా అస్టాన్ ను జాతీయ సదస్సు ఈ నెల 27న హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో జాతీయ స్థాయి నిపుణులతో పాటు తెలంగాణ స్పయిన్ సర్జన్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రోగులకు నాణ్యమైన స్పయిన్ కేర్ అందేలా ప్రభుత్వ, బోధనా సంస్థలతో సమన్వయం చేస్తామని తెలిపారు.

## సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి

**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పిల్లల సంరక్షణ కోసమే కాకుండా వారికి సంపూర్ణంగా సహకరించే కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బిజెఆర్‌నగర్ బస్తీలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, ఆధునీకరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు బురుగుల శ్యామ్ సుందర్‌గౌడ్, బిజెపి నేతలు సరళ, కె.శ్రీశైలంగౌడ్, బురుగుల రాకేష్‌గౌడ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సంరక్షణ, విద్య, పోషణ కోసం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, బస్తీల పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేసి ఆయన సత్కరించారు.

## 4న మాల విద్యార్థుల సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** రోస్టర్ సవరణ సాధన కోసం అక్టోబర్ 4వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే మాల విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ అంసా అధ్యక్షుడు గుండు రాజేష్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించినట్లు ఓ ప్రకటన విడుదల చేయడం జరిగింది. చారు. మాల సామాజికవర్గం హక్కుల పరిరక్షణ, రోస్టర్ వర్గీకరణలో జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దుకునేందుకు ఈ సభ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓయూలో జరిగే మహాసభకు ప్రతీ ఒక్క మాల విద్యార్థి, నిరుద్యోగి, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ మాదాస్ రాహుల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నేతలు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలు సృష్టించి నా భూమిని విక్రయించారు



న్యాయం చేయాలని బాధితుడు వసగౌని కృష్ణ గౌడ్ వేడుకోలు

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** తనకు వారసత్వంగా వచ్చిన 9 ఎకరాల 8 గుంటల భూమిని భూ కబ్జాదారులతో మంజుల, సురేందర్ విజయలక్ష్మి సంధ్యారాణి లు కలిసి నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించారని రైల్వే ఐఎన్టీయూసీ సీనియర్ నాయకుడు, విశ్రాంత రైల్వే ఉద్యోగి, వసగౌని కృష్ణ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, అల్వాల్ మండలం, యాప్రాల్ గ్రామంలోని సర్వే నెంబర్ 150, 151 లోని 9 ఎకరాల 8 గుంటల భూమిని రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు పెద్ద ఎత్తున డబ్బులు ముట్టజెప్పి ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములపై కోర్ట్ స్టే ఇచ్చిన కూడా రిజిస్ట్రేషన్ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారని ఆయన వాపోయారు. వారసత్వంగా సంక్రమించిన భూమికి సంబంధించిన పత్రాలు, హక్కు ఆధారాలు తన వద్ద ఉన్నాయని వివరించారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి భూమి రికార్డులను సమగ్రంగా పరిశీలించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



**అదనపు కలెక్టర్ కదివరన్ పలని**

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కదివరన్ పలని అన్నారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమాన్ని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, కలక్టరేట్ ఏఓ వెంట్రామిరెడ్డిలతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.





**చాంద్రాయణగుట్ట:** వీరవనిత ఐలమ్మ 131వ జయంతి పురస్కరించుకుని చాంద్రాయణగుట్ట నల్లవాగు ధోబిఘాట్‌లో ఆమె విగ్రహానికి పలువురు పులమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ జోన్ ఎలక్ట్రికల్ విభాగం డిప్యూటీ ఈఈ ఏఎం.సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్, ప్రతినిధులు షేక్ ఇమాం, వెంకటేష్, మల్లేష్, నర్సింహ, ప్రభాకర్ తదితరులు నివాళ్లు అర్పించడం జరిగింది.

**ఐలమ్మ సేవలు చిరస్మరణీయం**

**చాంద్రాయణగుట్ట:** పెత్తందారి విధానాలపై విరోచితంగా పోరాడి తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడిన తెలంగాణ ఉద్యమకారిణి, వీరనారి ఐలమ్మ అందిచిన సేవలు చిరస్మరణీయమని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ కొనియాడారు. శనివారం ఐలమ్మ జయంతి పురస్కరించుకుని జెడ్‌సి కార్యాలయంలో ఆయన నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జోనల్ టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ సంతోష్ కుమార్, యాకుత్‌పురా సర్కిల్ ఇంచార్జి ఎఎంసి షాబుద్దీన్, జోనల్ కమిషనర్ సీ సీ గుంటు గిరి బాబు, ఉద్యోగులు బాల్‌రెడ్డి, రహీం, వినయ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా ఎస్‌టిపిలు పూర్తి చేయాలి: ఎండి అశోక్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు పటిష్ఠ కార్యాచరణతో ముందుకు సాగాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీల నిర్మాణం, అనుబంధ మౌలిక వసతుల పనుల పురోగతిపై శనివారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో ఎస్టీపీ ప్రస్తుత స్థితి, పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, నాణ్యత, ఎలక్ట్రోమెకానికల్ పనులు తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు.ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించిన పనులను మరింత వేగవంతం చేయాలని, జాప్యంలో ఉన్న పనులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎండీ స్పష్టం చేశారు.ప్రతి ఎస్టీపీకి దశలవారీ లక్ష్యాలు, వాటిని చేరుకోవాల్సిన తేదీలు నిర్దేశించాలని ఆదేశించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతి, నిర్ణీత కాలపట్టికతో పోలిస్తే ముందంజ లేదా వెనుకబాటు, జాప్యానికి కారణాలు, చేపట్టాల్సిన తదుపరి చర్యలు, సవరించిన లక్ష్య తేదీ తదితర వివరాలతో సమగ్ర పురోగతి నివేదిక రూపొందించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆపరేషన్ డైరెక్టర్ వాస సత్యనారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.మహేష్ కుమార్, సీజీఎంలు పద్మజ, సుజాత, ఎస్టీపీ విభాగం జీఎంలు, సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫారం–6లో చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు

- సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి
- సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను జవాబుదారీగా చేయాలి
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఓటరు నమోదు ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) చేసిన మార్పుల వల్ల తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించింది. సిఇసి జ్ఞానేష్ కుమార్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని, రాజ్యాంగ పద్ధతులను ఉల్లంఘించి ఫారం–6ను ఏకపక్షంగా మార్చారని విమర్శించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, ఆయనను జవాబుదారీగా చేయాలని కోరింది. యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలన్న ఇసి నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించి, ఈ మేరకు ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఆందోళనకు గురైన ఎన్నికల సంఘం యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. సోషల్ మీడియా ద్వారా ఓటర్ ప్రత్యేక నమోదు శిబిరాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించింది. కానీ స్వయంగా సిఇసియే ఫారం–6లో స్పష్టంగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేసి, యువ ఓటర్లను చేర్చడాన్ని దాదాపు అసాధ్యం చేశారు. దరఖాస్తుదారుడి తల్లిదండ్రులు లేదా తాతలు గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఉన్నారా? లేదా? అనే వివరాలను కోరుతూ ఫారం –6లో ఒక కొత్త తప్పనిసరి విభాగాన్ని చేర్చారు. ఇది తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు అడ్డంకిగా మారింది. ఈ మార్పు పూర్తిగా చట్టవిరుద్ధం' అని జైరాం రమేశ్ అన్నారు. 2026 జులై ప్రారంభంలో ఎలాంటి అధికారిక ప్రకటన లేకుండా ఫారం6ను దొంగ చాటుగా మార్చారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఇసి మొదటి ఉల్లంఘన అని పేర్కొన్నారు. 'ఉల్లంఘన 2: ఫారం –6ను సవరించే అధికారం ఇసిఐకి లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ఈ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఇది ఎన్నికల సంఘం స్పష్టమైన అతిక్రమణ. ఉల్లంఘన 3: ఓటర్ల నమోదు నిబంధనలు 1960 ప్రకారం ఎలాంటి సవరణ చేయకుండా ఫారం –6ను మార్చారు. పార్లమెంటుకు సరైన సమాచారం ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మాత్రమే అలా చేయగలదు. ఒక శాసన బద్ధమైన ఫారంను, కలవరపడిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వయం ఆదేశాల మేరకు సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా మార్చారు. సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా కేసును స్వీకరించి, ఈ విషయానికి సిఇసిని జవాబుదారీగా చేయాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారడం ద్వారా తన తప్పును సరిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా భారత యువత అటువంటి చర్యను ఆమోదిస్తుంది అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. యువ, తొలిసారి ఓటు వేసేవారు ఎలాంటి వేధింపులు లేకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోగలిగేలా ఫారం–6కు సంబంధించిన చట్టవిరుద్ధమైన, అనధికారిక మార్పులను వెనక్కి తీసుకోవాలని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కోరారని పేర్కొన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగ సంప్రదాయాలు, పద్ధతులను ఉల్లంఘించడమే కాకుండా పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కూడా ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆయన పదవిలో కొనసాగడం భారత ప్రజలను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌ను స్మరించుకున్న యావత్ భారత్



**న్యూఢిల్లీ :** భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా యాతవ్ దేశం శనివారం ఆయనను స్మరించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేతలు ఘన నివాళి అర్పించారు. ప్రజా జీవితంలో మన్మోహన్‌జీ గడిపిన సుదీర్ఘ కాలం, దేశానికి అంకితభావంతో అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. అదే విధంగా భారతదేశ ఆర్థిక ప్రగతి, అభివృద్ధికి దోహదపడిన రాజనీతిజ్ఞుడిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కాంగ్రెస్ శనివారం స్మరించుకుంది. ఆయన జయంతి సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీ అక్బర్ రోడ్‌లోని ఎఐసిసి కార్యాలయం వద్ద మన్మోహన్‌సింగ్‌కు పుష్పాంజలి ఘటించారు. పలువురు సీనియర్ పార్టీ నాయకులు కూడా ఎఐసిసి కార్యాలయం వద్ద సింగ్‌కు నివాళులర్పించారు. మాజీ ప్రధాని నివాసంలో సింగ్ కుటుంబ సభ్యులు ప్రార్థనా సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరయ్యారు. 'ఆయన తన వినయం, నిజాయితీ, దూరదృష్టితో దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాజిక న్యాయానికి కొత్త దిశానిర్దేశం చేశారు. భారతదేశ నిర్మాణానికి ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు, అమూల్యమైన సేవలు మనకు ఎప్పటికీ మార్గదర్శకంగా ఉంటాయి' అని ప్రతిపక్ష నాయకుడు ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాజీ ప్రధానిని ఒక దార్శనిక రాజనీతిజ్ఞుడిగా స్మరించుకున్నారు. ఆయన చేపట్టిన చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలు భారతదేశ రూపాంతరాన్ని చూపాయన్నారు. మన్మోహన్ వినయం, నిజాయితీ, వివేకం సింగ్ వ్యక్తిత్వానికి నిర్వచనాలని, ఆయన నిశ్శబ్దమైన హుందాతో, కరుణతో నాయకత్వం వహించారని పేర్కొన్నారు. 'మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్నాము. ప్రముఖ ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడైన ఆయన ప్రస్థానాన్ని ఆయన వినమ్రత, నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకిత భావం ప్రత్యేకంగా నిలిపాయి' అని కాంగ్రెస్ ఎక్స్‌లో పేర్కొంది. 'భారతదేశ ఆర్థిక పురోగతి, అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని ఆ పార్టీ పేర్కొంది. డాక్టర్ మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న 'గాహ్'లో జన్మించారు. 2024 డిసెంబర్ 26న కన్నుమూశారు. సింగ్ 2004 నుండి 2014 వరకు వరుసగా రెండు పర్యాయాలు భారతదేశ ప్రధానమంత్రిగా పనిచేశారు.

## రాజకీయ ప్రయోజనాలకోసం 'సర్'ను వాడొద్దు

కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్



**బెంగళూరు :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియపై తనకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, అయితే దీనిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించకూడదని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన పౌరులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, 'ఇది ప్రజాస్వామ్య దేశం, నియంతృత్వ పాలన కాదు' అని ఆయన పేర్కొన్నారు. ముగ్గురు సభ్యులున్న ఎన్నికల సంఘంలో నిర్ణయాలు మెజారిటీ ప్రాతిపదికన తీసుకోవడం లేదన్న విషయం స్పష్టమైందని, ప్రస్తుత పరిస్థితి పట్ల ఎవరూ సంతృప్తిగా లేరని ఆయన అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞనేష్ కుమార్ తొలగింపు డిమాండ్‌కు మద్దతు తెలుపుతూ, 'తమ ఆందోళనలను వ్యక్తం చేసే పూర్తి హక్కు ప్రతిపక్ష పార్టీలకు ఉంది''అని శివకుమార్ అన్నారు. కేంద్రం నుంచి ముందస్తు ఆర్థిక సహాయం కోరినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ, ఇతర రాష్ట్రాలకు కేంద్రం ముందస్తు నిధులను విడుదల చేసిందో లేదో స్పష్టం చేయాలని శివకుమార్ కోరారు. వారు ఏమనుకున్నా పర్వాలేదు. తమ బాధ్యత ఏమిటో వారు అర్థం చేసుకోవాలి అని ఆయన అన్నారు. 'వారు ఇతర రాష్ట్రాలకు ముందస్తు నిధులు ఇవ్వలేదా? వారు ఒక బృందాన్ని పంపమనండి... అఖిలపక్ష ప్రతినిధి బృందంతో కలిసి వెళ్లేందుకు మేము ప్రధాన మంత్రి (నరేంద్ర మోదీ) అపాయింట్‌మెంట్ కోరాము. మాకు సమయం దొరికినప్పుడు జోషి కూడా రావాలి, అందరూ రావాలి' అని ఆయన జోడించారు.

## విచారణకు భయపడను

సిఎంఆర్‌ఎల్ విషయంలో కేరళం ప్రతిపక్షనేత విజయన్



**అలప్పుజ :** సిఎంఆర్‌ఎల్ చెల్లింపుల వ్యవహారానికి సంబంధించిన విచారణకు తాను భయపడటం లేదని కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ పేర్కొన్నారు. బిజెపి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఎల్‌డిఎఫ్‌ను లక్ష్యంగా చేసుకోవడానికే ఈ విచారణ జరుగుతోందని ఆయన ఆరోపించారు. అలప్పుజలో జరిగిన విస్తృత స్థాయి సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని ప్రారంభిస్తూ, తన ద్వారా పార్టీని, లెఫ్ట్ ఫ్రంట్‌ను లక్ష్యంగా చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ బిజెపబబితో చేతులు కలిపిందని విజయన్ పేర్కొన్నారు. సిఎంఆర్‌ఎల్ లంచం కేసులో మాజీ ముఖ్యమంత్రి, ఆయన కుమార్తె వీణా టి, ఆమె భర్త, ఎమ్మెల్యే పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై విచారణ జరపాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రాష్ట్ర పోలీసు చీఫ్‌కు లేఖ రాసింది. దీని ఆధారంగా కేరళంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం ఇటీవల పోలీసు విచారణకు ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద జరిపిన సోదాలు, విచారణలో సేకరించిన సాక్ష్యాల ఆధారంగా కేసు నమోదు చేయాలని ఇడి కోరింది. ఐటి కన్సల్టెన్సీ సేవల ముసుగులో 'కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్‌ఎల్), వీణకు చెందిన 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్' (ప్రస్తుతం మూతపడిన సంస్థ)కు రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఆ సంస్థ ఆరోపించింది. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎక్సలాజిక్, సిఎంఆర్‌ఎల్ మధ్య ఒప్పందం కుదిరిందని, చట్టప్రకారమే సేవలు అందించబడ్డాయని విజయన్ చెప్పారు. 'చట్టప్రకారం ఒక సంస్థ మరొక సంస్థకు సేవలను అందించింది, ఆ సేవలకు ప్రతిఫలం కూడా చట్టప్రకారమే స్వీకరించబడింది. ఇదంతా రికార్డుల్లో ఉంది. దీనికి సంబంధించిన అవసరమైన పన్నులన్నీ చెల్లించబడ్డాయి' అని ఆయన అన్నారు. అందులో నేరం ఏముంది? అని విజయన్ ప్రశ్నించారు. విచారణకు తాను భయపడటం లేదని విజయన్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫిర్యాదులను సుప్రీంకోర్టుతో సహా కేరళంలోని వివిధ న్యాయస్థానాలు పరిశీలించాయని విజయన్ చెప్పారు.


## నాగాలండ్‌లో కల్తీ మద్యం సేవించి 19 మంది మృత్యువాత

**మోకోక్‌చుంగ్ :** మద్యపాన నిషేధిత రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా కల్తీ మద్యం సేవించి పలువురు మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి కేసులు బిహార్‌లో తరుచూ నమోదవుతుండగా, తాజాగా నాగాలండ్‌లో కూడా బయటపడ్డాయి. 1990 నుంచి మద్యపాన నిషేధ చట్టం అమల్లో ఉన్న నాగాలాండ్‌లో, కల్తీ మద్యం సేవించడం వల్ల కనీసం 19 మంది మరణించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ రాష్ట్రంలో కల్తీ మద్యం సరఫరా గొలుసును గుర్తించేందుకు పోలీసులు ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల్లో అనుమానిత కల్తీ మద్యం సేవించడం వల్ల మోకోక్‌చుంగ్ జిల్లాలో ఎనిమిది, టుయెన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మరణాలపై దర్యాప్తు చేయడానికి, అనుమానిత కల్తీ మద్యం మూలం, సరఫరా గొలుసును గుర్తించడానికి, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్–I బుంగ్లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సిట్ ఏర్పాటు చేసినట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, వేసుప్ర కెజో శనివారం తెలిపారు. మరణాలకు కారణాలను నిర్ధారించడానికి ఫోరెన్సిక్ పరీక్ష కోసం నమూనాలను గౌహతికి పంపినట్లు ఆయన చెప్పారు. కొన్ని ఆధారాలు లభించాయి, కానీ వివరాలను వెల్లడించడం తొందరపాటు అవుతుందన్నారు. మరణాల అనంతరం, పోలీసులు పలుచోట్ల దాడులు నిర్వహించి 19 మందిని అరెస్టు చేయడంతో పాటు, దాదాపు 3,000 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గుర్తించని, లేబుల్ లేని లేదా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అనుమానిస్తున్న మద్యాన్ని సేవించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. అలాగే, మద్యం సేవించిన తర్వాత తల తిరగడం, దృష్టి మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే వైద్య సంరక్షణ పొందాలని కోరారు.

## మహారాష్ట్రలో 265 తాలూకాల్లో కరువు

**ముంబయి :** ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది దేశ వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో 358 తాలూకాలలో 265 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. అలాగే పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, భూమి శిస్తు రాయితీలు, విద్యుత్ బిల్లు సబ్సిడీలతో సహా అనేక సహాయక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ జిల్లా కలెక్టర్లను పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కరువు పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టే సహాయక చర్యలలో రైతులే ప్రధాన కేంద్రంగా ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 32 జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ 265 తాలూకాలు రాష్ట్ర విస్తీర్ణంలో 74 శాతం భాగాన్ని ఆక్రమించి ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసిన తర్వాత రైతులకు అందించే వాస్తవ ఆర్థిక సహాయంపై నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ తెలిపారు. కరువు పరిస్థితులను ప్రకటించడానికి, సహాయక చర్యలను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'కరువు నిర్వహణ నియమావళి 2016' (2020లో సవరించబడింది) కింద 'ట్రిగ్గర్–1' విధానాన్ని అమలులోకి తెచ్చింది. 'ట్రిగ్గర్–1' అనేది రాష్ట్ర కరువు నిర్వహణ విధానంలో మొదటి దశ. వర్షపాతం 25 శాతం కంటే తక్కువగా నమోదు కావడం, 21 రోజుల పాటు వర్షం లేని పొడి వాతావరణం కొనసాగడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇది అమలు చేయబడుతుంది. జూన్ నుండి తక్కువ వర్షపాతం, ఇతర కారణాల వల్ల 32 జిల్లాల్లోని 265 తాలూకాలలో కరువు వంటి పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ కమిషనర్ సమర్పించిన నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం, ఛత్రపతి శంభాజీనగర్ విభాగంలో అత్యధికంగా 74 కరువు పీడిత తాలూకాలు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో అమరావతి (56), నాసిక్ (49), నాగ్‌పూర్ (39), పూణే (35) మరియు థానే (12) విభాగాలు ఉన్నాయి. ప్రభావిత తాలూకాలలో పంట నష్ట అంచనాలను ప్రారంభించాలని, పంట పరిస్థితులను నమోదు చేయడానికి సర్వే చేసిన ప్రాంతాల ఫోటోలు, జిపిఎస్ కోఆర్డినేట్‌లను సేకరించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ నివేదికలను వ్యవసాయ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు సహాయక చర్యల అమలుపై దృష్టి సారించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చూడాలని శివసేన (యుబిటి) నాయకుడు ఆదిత్య థాకరే అన్నారు. మరాఠ్వాడాలోని కరువు పీడిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న థాక్రే, తమ పార్టీ కొంతకాలంగా కరువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తోందని, ఈ నిర్ణయం ముందే తీసుకోవాల్సిందని అన్నారు. నష్టపోయిన రైతులకు ప్రత్యక్ష సహాయం అందించడానికి ప్రభుత్వ ఉత్తర్వులో తగిన చర్యలు లేవని కిసాన్ సభ పేర్కొంది. వరుసగా రెండు ఖరీఫ్ సీజన్లు విఫలమవడం వల్ల నష్టపోయిన రైతులకు రుణమాఫీ, పంట బీమా కవరేజీ ఆధారంగా నష్టపరిహారంతో సహా పటిష్టమైన ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 'ఎల్ నినో' ప్రభావం మధ్య జూన్ నుండి సెప్టెంబర్ 18 వరకు రాష్ట్రంలో 18.8 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ కాలంలో సగటున 932.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, వాస్తవానికి 755.9 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది.

## నాగ్‌పూర్-ముంబయి దురంతో రైలుపై రాళ్ల దాడి



**నాగ్‌పూర్:** నాగ్‌పూర్–ముంబయి దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు మూడు బోగీలపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. నాగ్‌పూర్–వార్ధా మార్గంలోని బోర్ఖేడి–సింధి స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి 8:30 గంటలకు ఈ ఘటన జరిగిందని సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. దుండగులు ఒక 2ఎసి,రెండు 3ఎసి బోగీలపై రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనపై రైల్వే పోలీసులు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారని వారు వెల్లడించారు.

## 'సుప్రీం' పర్యవేక్షణలో నిష్పక్షపాత, పారదర్శక విచారణతోనే నిజాలు వెలుగులోకి...



- రామమందిరంలో విరాళాల చోరీ కేసులో సిట్ దర్యాప్తుపై పలు ప్రశ్నలు లేవనెత్తిన కాంగ్రెస్
- ఇంకా ప్రధాని మౌనం వీడడం లేదని ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల దొంగతనానికి సంబంధించి సిట్ జరుపుతున్న దర్యాప్తుపై కాంగ్రెస్ శనివారం పలు ప్రశ్నలు లేవనెత్తింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగే నిష్పక్షపాత, పారదర్శక విచారణ మాత్రమే నిజాన్ని బయట పెట్టగలదని పేర్కొంది. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనాన్ని కూడా ఆ పార్టీ ప్రశ్నించింది. దొంగలు ఆయన రక్షణలో ఉన్నారని ఈ చర్య సూచిస్తోందని పేర్కొంది. అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల దొంగతనం భక్తుల విశ్వాసానికి సంబంధించిన ఒక తీవ్రమైన విషయమని, ఈ వ్యవస్థను పర్యవేక్షించే, నిర్వహించే బాధ్యుల పాత్రపై దర్యాప్తు చేయకుండా అసలు నిజం బయటకు రాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఈ మొత్తం కేసు మూలాలు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అగ్ర నాయకత్వం వరకు ఉన్నాయా అని కూడా ఆయన ప్రశ్నించారు. ఈ దొంగతనానికి అసలు బాధ్యత ఎవరనేది తేలే వరకు ఈ విషయాన్ని ముగిసినట్లుగా భావించలేమని అన్నారు. 'చందా చోరీ, ఆస్థా ధోకా' అనే శీర్షికతో ఎక్స్ ఛానెల్‌లో హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో రమేష్ అయోధ్య ఆలయంలో కానుకల దొంగతనంపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం నియమించిన సిట్‌పై దేశ ప్రజలకు విశ్వాసం లేదు అని కాంగ్రెస్ మొదటి రోజు నుంచే చెబుతోందన్నారు. ఇప్పుడు, ఛార్జిషీట్ నుండి వెలువడుతున్న వాస్తవాలు ఈ విచారణపైనా, ప్రభుత్వం చేస్తున్న కప్పిపుచ్చే ప్రయత్నాలపైనా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయన్నారు. ఛార్జిషీట్ ప్రకారం, జూన్ 4న బాత్రూంలో రూ. 2.25 లక్షలు దొరికిన వీడియోను చంపత్ రాయ్‌కు పంపారని, జూన్ 5న ఆయనకు సిసిటివి ఫుటేజీని కూడా చూపించారని ఆయన తెలిపారు. 'అయినప్పటికీ, జూన్ 25న ఎఫ్ఐఆర్‌నమోదు చేశారు. సిసిటివి ఫుటేజ్, స్వాధీనం చేసుకున్న సొత్తు, అనుమానిత ఉద్యోగుల గుర్తింపు వంటి వివరాలు అప్పటికే వెలుగులోకి వచ్చినప్పుడు, క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఇంత జాప్యం జరిగింది? ఈ 21 రోజుల్లో ఎవరికి రక్షణ లభించింది, అసలు ఏం దాచారు? అని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో ప్రశ్నించారు. కానుకలను తొలగించిన 105 సందర్భాలు సిసిటివి ఫుటేజ్‌లో బయటపడ్డాయని, ఒక నిందితుడు 85 సార్లు డబ్బును తొలగించడం కనిపించిందని, అలాగే ఇతర నిందితుల ప్రమేయం కూడా పదేపదే వెలుగులోకి వచ్చిందని రమేశ్ పేర్కొన్నారు.

అన్ని విషయాలు వెలుగులోకి వచ్చిన మూడు రోజుల తర్వాత కూడా, కానుకల చోరీని చంపత్ రాయ్ ఖండించారన్న విషయం సిట్‌కు తెలుసునని ఆయన ఆరోపించారు. 'అయినప్పటికీ, చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావులను ఎందుకు నిందితులుగా చేర్చలేదు? వారు కేవలం సాక్షులుగా ఎందుకు ఉన్నారు? ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినప్పటికీ, వారు ఇంకా ట్రస్ట్‌లో ఎందుకు కొనసాగుతున్నారు? వ్యవస్థ పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యత కలిగిన వారి పాత్రను విచారించకుండా, కానుకల చోరీకి సంబంధించిన పూర్తి నిజం బయటకు వస్తుందా? అని రమేష్ ప్రశ్నించారు. 70 నుండి 105 వరకు ఘటనలు వెలుగులోకి వచ్చాయని, వేలాది డిజిటల్ సందేశాలను పరిశీలించారని, అలాగే బ్యాంక్ ఖాతాలు, ఆస్తుల పరిశీలన జరిగిందని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'అయినప్పటికీ, విచారణ పరిధిని కేవలం ఎనిమిది మంది నిందితులకు మాత్రమే ఎందుకు పరిమితం చేశారు? 'ఈ మొత్తం వ్యవస్థకు సంబంధించి సిట్ బాధ్యతను నిర్ధారించిందా లేక కేవలం చిన్న స్థాయి వ్యక్తులకే ఈ వ్యవహారాన్ని పరిమితం చేసిందా? అన్నిటికంటే పెద్ద ప్రశ్న ఏమిటంటే: ఈ మొత్తం కేసు మూలాలు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అగ్రనాయకత్వం వరకు వెళ్తాయా? అని ఆయన అన్నారు. 'ప్రధానమంత్రి గారూ, మీ మౌనాన్ని వీడండి... లేకపోతే, ఆ దొంగలకు మీ రక్షణ ఉందని అర్థం వస్తుంది' అని రమేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## విద్యార్థుల ప్రాథమిక హక్కు పరిరక్షణకు... న్యాయవ్యవస్థ కట్టుబడి ఉంది

సిజెఐ సూర్యకాంత్

**పాట్నా :** శాంతియుత నిరసనలు చేపట్టే విద్యార్థుల ప్రాథమిక హక్కును 'పరిరక్షించడానికి' న్యాయవ్యవస్థ కట్టుబడి ఉందని, ఆ హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు న్యాయస్థానాలు చూసీచూడనట్లు ఊరుకోబోవని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ స్పష్టంచేశారు. శనివారం ఆయన పాట్నాలోని చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ (సిఎన్‌ఎల్‌యు) విద్యార్థులతో 'నిష్కపటమైన సంభాషణ'లో పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి తాను స్వేచ్ఛాయుతమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ఇష్టపడతానని స్పష్టంచేస్తూ ఈ ప్రకటన చేశారు. సిఎన్‌ఎల్‌యు ప్రకటన ప్రకారం...'శాంతియుత విద్యార్థుల నిరసనలపై పోలీసుల స్పందన' గురించి ఒక జిఐఆర్ విద్యార్థి ప్రశ్నించారు. ఆ ప్రస్తావన 'నీట్ పరీక్ష పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించినది. యాదృచ్ఛికంగా, ఈ నిరసనలు సుప్రీంకోర్టులో సిజెఐ చేసిన ఒక వ్యాఖ్యకు వ్యతిరేకంగా ఒక ఒక వ్యంగాత్మక ఆన్‌లైన్ ప్రచారంగా ప్రారంభమయ్యాయి. అయితే, ఆ తర్వాత ఆయన తన వ్యాఖ్యలను సందర్భం లేకుండా ప్రచురించారని వాదించారు. పోలీసులచే క్రూరమైన అణచివేత ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసుల విషయంలో న్యాయస్థానాలు చూసీచూడనట్లు వ్యవహరించబోవని, ప్రశ్నించిన వ్యక్తికి సిజెఐ తెలిపారు. 'విద్యార్థుల శాంతియుత నిరసన హక్కును పరిరక్షించడానికి న్యాయ వ్యవస్థ నిస్సందేహంగా కట్టుబడి ఉంది' అని పునరుద్ఘాటించారు. మరొక విద్యార్థి మాట్లాడుతూ 'కొలిజీయం అంతర్గత భిన్నాభిప్రాయాలను ఎందుకు నమోదు చేస్తారో కానీ, ఎప్పుడూ బహిర్గతం చేయరు?' అనే విషయాన్ని మరో విద్యార్థి తెలుసుకోవాలనుకుంటున్నాడు' అని అన్నారు. 'సమాచారాన్ని వెల్లడించడం, ఉద్దేశం ఎంత సదుద్దేశంతో చేసినది చేసినటప్పటికీ, సదరు వ్యక్తిని నిలకడలేని స్థితిలోకి నెట్టివేసే ప్రమాదం ఉంది అని సిజెఐ అన్నారు. వ్యక్తిగత గౌరవానికి ముప్పు వాటిల్లినప్పుడు, పారదర్శకతకు పరిమితులు ఉంటాయని పేర్కొంటూ, 'ఒక ప్రధాన న్యాయమూర్తి లేదా న్యాయమూర్తిపై ప్రతికూల వ్యాఖ్య కొలీజియం మినిట్స్‌లో చేర్చబడితే వారు ఎలా పనికొనసాగించగలరు' అని సిజెఐ ప్రశ్నించారు. సిఎన్‌ఎల్‌యు ప్రకటన ప్రకారం, సిజెఐ సూర్యకాంత్‌తో పాటు పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, యూనివర్సిటీ ఛాన్స్‌లర్ కూడా అయిన వి.కామేశ్వర్‌రావుతో కలిసి క్యాంపస్‌ను సందర్శించారు. 'హైదరాబాద్‌లోని నల్సార్, బెంగళూరులోని ఎన్‌ఎల్‌ఎస్ఐయులో సిజెఐకి ఇటీవల ఎదురైన వ్యతిరేకత నేపథ్యంలో ఈ కార్యక్రమానికి గొప్ప ప్రాముఖ్యత ఉంది' అని సిఎన్‌ఎల్‌యు ప్రకటన తెలిపింది. సిఎన్‌ఎల్‌యు వైస్ ఛాన్స్‌లర్, ప్రముఖ న్యాయకోవిదుడు ఫైజాన్ ముస్తాఫా ప్రతిపాదించిన 'ఐదేళ్ల లా డిగ్రీని, నాలుగేళ్ల విద్యాభ్యాసంగా, చివరి సంవత్సరంలో తప్పనిసరి కోర్టు అప్రెంటిస్‌షిప్‌గా కుదించాలన్న ప్రతిపాదనను 'సిజెఐ 'ఒక కొత్త స్వాగతించదగిన ఆలోచన'గా ప్రశంసించారు. దీనివల్ల జ్యుడీషియల్ సర్వీస్ పరీక్షలకు ఉండే ప్రత్యేక ఏడాది ప్రాక్టీస్ అవసరాన్ని తొలగించవచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు... నిరంతర అప్రమత్తత అవసరం

ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ ఉద్బోధ

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్‌లలో తలెత్తుతున్న ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవాలంటే నిరంతర అప్రమత్తత, మరింత పదునైన నిఘా ఆధారిత ఆపరేషన్లు అవసరమని ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ నొక్కిచెప్పారు. శుక్రవారం ఆయన కుప్వారా, బుద్గామ్‌తో సహా నార్త్, సెంట్రల్ కశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలను సందర్శించిన జనరల్ సేథ్, ఆ ప్రాంతంలో మోహరించిన బలగాల కార్యచరణ సంసిద్ధతను సమీక్షించారు. జనరల్ సేథ్ శ్రీనగర్ కేంద్రంగా పనిచేస్తున్న చినార్ కార్ప్స్ పరిధిలోని రాష్ట్రీయ రైఫిల్స్ సెక్టార్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కోసం కార్యాచరణ సన్నద్ధతను సమీక్షించారు' అని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ (ఏడిజిపిఐ) 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో తెలిపింది.ప్రస్తుత భద్రతా పరిస్థితి,ఉగ్రవాద బెదిరింపులను 'గుర్తించడం,నిరోధించడం, నిర్ణయాత్మకంగా ఎదుర్కోవడానికి చేపట్టిన చర్యల గురించి సైనికాధిపతికి వివరించారు. అన్ని స్థాయిల వారి వృత్తి నైపుణ్యం, నిబద్ధత, ఉన్నత ప్రమాణాల కార్యాచరణ సంసిద్ధతను ప్రశంసిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిఘా ఆధారిత కార్యకలాపాలను పదును పెట్టాలని, తలెత్తుతున్న ముప్పులకు వేగంగా, కచ్చితంగా స్పందించే సామర్థ్యాన్ని నిలుపుకోవాలని జనరల్ సేథ్ వారికి ఉద్బోదించారు. పరిస్థితిపై అవగాహనను పెంచుకోవడానికి, మొత్తం ఉగ్రవాద నిరోధక ప్రతిస్పందనను బలోపేతం చేయడానికి భాగస్వాములందరితో సజావైన సమన్వయం, సన్నిహిత సహకారం ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కిచెప్పారని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన ఈ పర్యటన సందర్భంగా, ఉగ్రవాద వ్యతిరే క కార్యకలాపాలకు తమ శౌర్యం, సహకారాన్ని అందించిన అర్హులైన సైనికులకు, వారి శౌర్యం, ఆదర్శప్రాయమైన సేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. స్థానిక ప్రజల భద్రతను కాపాడుతూనే, ముప్పు కంటే ముందుండాలని, నిరంతర కార్యాచరణ దృష్టిని కొనసాగించాలని, సమన్వయంతో, ముందు చూపుతో స్పందించాలని జనరల్ ధీరజ్ సేథ్ నొక్కిచెప్పారు. 'జై సే విజయ్' స్ఫూర్తికి అనుగుణంగా భారత సైన్యం ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, సమన్వయాన్ని బలోపేతం చేయడంలో, ప్రజలను రక్షించడంలో, సురక్షితమైన వాతావరణాన్ని కాపాడటంలో దృఢంగా నిలుస్తుంది' అని ఏడిజిపిఐ జోడించారు. సెంట్రల్, నార్త్ కశ్మీర్ వ్యాప్తంగా, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఆర్మీ చీఫ్ భద్రతా సమీక్ష జరిగింది. ఈ నెల ప్రారంభంలో, బుద్గాం జిల్లాలోని యుస్మార్గ్ దట్టమైన అటవీ ప్రాంతంలో జరిపిన ఒక ఆపరేషన్‌లో, యాసిర్ అనే పాకిస్తానీ జాతీయుడైన లష్కర్–ఏ–తొయిబా (ఎల్ఓటి) అగ్రశ్రేణి కమాండర్‌ను సైన్యం హతమార్చిన విషయం తెలిసిందే. పీర్ పంజాల్ పర్వత శ్రేణి, దానిని ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాలలో ఉగ్రవాద స్థావరాలను నిర్వీర్యం చేయడానికి,చొరబాటు ప్రయత్నాలను అడ్డుకోవడానికి, బలగాలు నిరంతర కార్యాచరణ దృష్టిని కొనసాగించాయి.

## ప్రకృతి విలయ నియంత్రణకు భారత్–చైనా–నేపాల్ ఉమ్మడి యంత్రాంగం

- జనరల్ అసెంబ్లీలో బాలేంద్ర షా ప్రతిపాదన
- జనరల్ అసెంబ్లీలో భారత్ హెచ్చరిక
- సహాయక పునరావాసానికి అంతర్జాతీయ మద్దతుకు విజ్ఞప్తి



**న్యూయార్క్:** భారత్–చైనా–నేపాల్ దేశాలతో ఒక ఉమ్మడి వాతావరణ నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా ప్రతిపాదించారు. శుక్రవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (81వ సెషన్)లో మొట్టమొదటిసారిగా ఆయన ప్రసంగించారు. ఆగస్టు 26వ తేదీన నేపాల్‌లో భయంకరమైన ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో ఇప్పటివరకూ 1,453 మంది మృతదేహాలు గాలింపు చర్యల్లో వెలికితీశారు. మరో 5,300 మంది ఇప్పటికీ జాడ తెలియకుండా పోయారు. వీరిలో విదేశీయులు ఎక్కువమంది ఉన్నారు. ఈ పరిస్థితుల మధ్య బాలేంద్రషా జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగిస్తూ,ప్రపంచ పారిశ్రామికీకరణలో నేపాల్ వాటా రవ్వంత కూడా లేకపోయినప్పటికీ అపారమైన నష్టాలను ఎదుర్కొంటున్నదన్నారు.

వాతావరణ న్యాయం అనేది అందమైన పదబంధంగా కాగితాలకే పరిమితం కాకూడదన్నారు.శాశ్వతమైన మంచుకొండలు కరిగిపోవడం,కొండవాలలు విరిగి పడిపోవడం,హిమానీ నదాలు కరగడం వంటివన్నీ ప్రపంచ ప్రమాదాలకు గుర్తులుగా చూడాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలకు సరిహద్దులు,ఎల్లలు,పాస్‌పోర్టులు ఉండవని, సరిహద్దులు గమనించకుండా ప్రకృతి ఎవరిమీదా విరుచుకుపడదని,అందువల్ల రాబోయేకాలంలో హిమానీనద ఉత్పాతాల నియంత్రణకు ఉమ్మడి యంత్రాంగాన్ని ఈ ప్రాంత దేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటూ ప్రతిపాదించారు.ఉపగ్రహ డేటా ద్వారా ఈ మూడు దేశాల హిమానీ నదాల ఉష్ణదవాలకు సంబంధించిన డేటాను పంచుకోవడం ద్వారా విపత్తు నియంత్రణ హెచ్చరికలు,ముందస్తు జాగ్రత్తలు పాటించవచ్చునని,విపత్తు ప్రతిస్పందనలో సమన్వయ చర్యలపై దృష్టి సారించవచ్చునన్నారు. ప్రపంచ గ్రీన్ హౌస్ ఉద్గారాలలో నేపాల్ 01 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉన్నప్పటికీ, తీవ్రమైన వాతావరణ ప్రభావాలను ఎదుర్కొంటోందని అన్నారు.భయంకరమైన ప్రకృతి విపత్తు నుండి బయటపడేందుకు,పునర్నిర్మాణం,అనంతరకాలాలకు అంతర్జాతీయ సహాయం అందించాలని కోరారు. వాగ్దానాలు,ప్రకటనలకు అతీతంగా వాతావరణ న్యాయం జరగాలని కోరారు.

నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో నెలరోజులక్రితం జరిగిన భయానక ఉత్పాతం నుండి 13,795 మందిని సహాయ బృందాలు రక్షించాయి. ఈ ప్రమాదంలో నువాకోట్,రసువా,ధాడింగ్ జిల్లాలు బాగా నష్టపోయాయి.

# అమెరికాకు ఇరాన్ బంపర్ ఆఫర్

- హోర్ముజ్ తెరిచేందుకు 7రోజులు ప్రణాళిక
- షరతులు ఒప్పుకుంటే కౌంట్‌డౌన్ ప్రారంభం
- ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది మీరే
- న్యూయార్క్‌లో ఇరాన్ విదేశాంగమంత్రి అరాఘ్చి ప్రకటన



**న్యూయార్క్:** యుద్ధ ఒప్పందంపై ఇన్నాళ్ళుగా హెచ్చరికలు,గడువు తేదీలు విధిస్తూ వచ్చిన అమెరికాకు ఇప్పుడు ఇరాన్ స్వయంగా బంపర్ ఆఫర్ ఇచ్చింది. హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు ఏడు రోజుల ప్రణాళికను ప్రకటించింది. తాము విధించిన షరతులు అంగీకరిస్తే ఏడు రోజుల్లో జలసంధి తెరుస్తామని, తమ ఆఫర్ అంగీకరించిన మరుక్షణం నుండే కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని,ఈ గడువును ఐదు రోజులలోపే ముగించి ఆరో రోజు హోర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకల నిమిత్తం యథాతథంగా తెరుస్తామని,ఏడవ రోజు నుండీ తుది ఒప్పందం కోసం అమెరికాతో చర్చలు ప్రారంభమవుతాయని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి శనివారం న్యూయార్క్ పత్రికాగోష్ఠిలో ప్రకటించారు.మధ్యవర్తి ఖతార్ ద్వారా వారికి ఈ విషయం తెలియజేశామని చెప్పారు.జలసంధిని వారం రోజుల్లో తెరిచేట్టు చేసేందుకు అమెరికాకు ఒక ఒప్పంద ప్రతిపాదన చేశామని ఆయన చెప్పారు.ఈ షరతులు కొత్తవేమీ కాదని, జూన్ 17న కుదిరిన "ఇస్లామాబాద్ ఒప్పందం"లో ఈ షరతులు ఉన్నాయని చెప్పారు.

ఏడు షరతులను అంగీకరిస్తే తక్షణం జలసంధి తెరుస్తామని వారం రోజుల క్రితం కూడా ఇరాన్ ప్రకటించింది.షరతులు అంగీకరించి వాటిని నెరవేర్చే విషయంలో అమెరికా చిత్తశుద్ధి ప్రకటిస్తే ఖచ్చితంగా ఏడో రోజు జలసంధి తెరుచుకుంటుందని అబ్బాస్ అరాఘ్చి చెప్పారు.మధ్యవర్తిదేశం ఖతార్ ద్వారా అమెరికా–ఇరాన్ ప్రతినిధులు న్యూయార్క్‌లో మూడు గంటలసేపు సమావేశం జరిగిన తర్వాత నాలుగు రోజులపాటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ముమ్మరస్థాయిలో దౌత్య కార్యకలాపాలు కొనసాగించి ప్రపంచదేశాలకు ఇరాన్ వైఖరిని బాగా తెలిసేట్టు చేశారు. టెహ్రాన్‌కు బయలుదేరి వెళ్ళేముందు పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడు రోజుల్లో జలసంధిని తిరిగి తెరిపించే అవకాశం పూర్తిగా అమెరికా చేతుల్లోనే ఉందన్నారు.

పశ్చిమాసియా నుండి అమెరికా సేనలను వెనక్కు మళ్ళించడం,ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలు తొలగించడం,ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, స్తంభింపజేసిన 12 బిలియన్ డాలర్ల ఆస్తులను తక్షణం విడుదల చేయడం,లెబనాన్ దక్షిణ ప్రాంతం నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగడం ప్రధాన షరతులలో అతిముఖ్యమైనవి. ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీ నుండి ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైనికబలగాలు సెంట్ కామ్ దిగ్బంధనాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికీ ఈ దిగ్బంధనం కొనసాగుతోంది.

జలసంధిలో ఇరాన్ నిర్దేశించిన ప్రధాన రహదారిలో వాణిజ్యనౌకలన్నీ ప్రయాణం చేయాలని,వాణిజ్య నౌకల నుండి నిర్వహణా ఛార్జీలు వసూలు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ ప్రకటనకు విరుద్ధంగా దొడ్డిదారిన నౌకల రాకపోకలకు అమెరికా వత్తాసు పలకడంతో ఘర్షణ మళ్ళీ మొదటికి రావడంతో జూన్‌లో కుదిరిన ఒప్పందాన్ని రద్దుచేసుకున్నట్లు మొదట అమెరికా,ఆ తర్వాత ఇరాన్ ప్రకటించాయి. అప్పటినుండి హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో క్షీణించిపోగా హౌతీల సమస్య తెరమీదకు వచ్చింది.ఇరాన్ ప్రోత్సాహంతో బాబ్ ఎల్ మందాబ్ జల సంధిలో సౌదీ అరేబియా చమురు నౌకలను హౌతీలు అడ్డుకోవడం,సౌదీపై దాడులు ఉధృతం చేయడంతో చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ దశలో ట్రంప్ అడకత్తెరలో పోకచెక్కలా ఇరుక్కుపోయారు. చాలా విరామం తర్వాత ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈనెల 22న అమెరికా–ఇరాన్ మధ్య తాజా విడత మధ్యవర్తుల ద్వారా చర్చలు జరిగాయి. ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది డోనాల్డ్ ట్రంప్ మాత్రమే. ఐతే ఆయన ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని తిరస్కరించారు.

### ఇరాన్ ప్రతిపాదనకు ట్రంప్ తిరస్కృతి

ఇరాన్ ప్రతిపాదించిన ఒప్పందాన్ని ట్రంప్ తిరస్కరించారు.పేరు చెప్పడానికి ఇష్టపడని ఉన్నతాధికారులు ఈ విషయం వెల్లడించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ శనివారం ప్రకటించింది. అబ్బాస్ అరాఘ్చి పత్రికాగోష్ఠి ముగిసిన కొద్ది గంటలకే వైట్‌హౌస్ నుండి ఈ అనధికారిక ప్రకటన వచ్చింది.అరాఘ్చి డీల్‌ను ట్రంప్ తోసిపుచ్చారని సమాచారం.ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో కొత్త సంవత్సరం కార్యకలాపాలకు సంబంధించి సెప్టెంబరు 22న కీలక ప్రసంగం చేస్తూ, ఇరాన్ ఒక ఒప్పందానికి రాకపోతే భవిష్యత్ తరాలకు అవకాశం లేకుండా సర్వనాశనం చేస్తామని ప్రకటించారు. ఇరాన్‌ను పశ్చిమాసియాలో లేదా ప్రపంచంలోనే అత్యుత్తమమైన దేశంగా తీర్చిదిద్దాలా?లేక సర్వనాశనం చేయాలా? అనే విషయంలో ఇంకా తాను ఒక "పెద్ద నిర్ణయం" తీసుకోవాల్సి ఉందని ట్రంప్ ప్రకటించిన నాలుగు రోజులకే ఆ దేశ పాలకుల శాంతి ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు.తన డిమాండ్లను ఇరాన్ నెరవేరుస్తుందా? అనే విషయంలో ట్రంప్ వ్యక్తిగతంగా చాలా సందేహాలతో ఉన్నారు. బాంబు దాడులు చేస్తామన్న ప్రచారాన్ని పునఃప్రారంభించే అవకాశం ఉందని ట్రంప్ తన సహాయకులతో చెప్పారట.

జూన్ 17 నాటి విఫలమైన "ఇస్లామాబాద్ ఒప్పందం"లోని అంశాలను నెరవేర్చాలని అరాఘ్చి కోరారు. స్తంభింపజేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను పునరుద్ధరణ,ఇరాన్‌పై చమురు ఆంక్షలు ఎత్తివేత,ఇరాన్ ఓడరేవులపై నౌకా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ఏడు షరతులను అబ్బాస్ అరాఘ్చి శాంతి ఒప్పందం కింద ప్రతిపాదించారు. వీటిని నెరవేరిస్తే హోర్ముజ్ జలసంధిని ఏడు రోజుల్లో తిరిగి తెరిచేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఇదిలా ఉండగా, శనివారం తెల్లవారుజామున డోనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా "ట్రంప్ జలసంధి" అనే పేరుతో ఒక మ్యాప్‌ను పోస్టింగ్ చేశారు. హోర్ముజ్ జలసంధికే ఆయన ఈ కొత్త నామకరణం చేశారు.హోర్ముజ్ జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలోనే ఉందని ప్రకటించారు.

# అణ్వస్త్రం దిశగా సౌదీఅరేబియా

### అమెరికాకు నివేదిక



**దుబాయ్:** శత్రువులు చుట్టుముడుతున్న దశలో సౌదీ అరేబియా అణ్వస్త్రం తయా రు చేసేదిశగా అడుగులు వేస్తోందని అమెరికా గూఢచారి సంస్థ నివేదిక వెల్లడించిందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ప్రకటించిం ది. సౌదీ అరేబియా చర్యలకు అమెరికా ఆశీర్వాదాలు కూ డా ఉన్నాయి. పౌర అణు ఇంధన కార్యక్రమం కింద సౌదీఅరేబియా యురేనియం శుద్ధికి అమెరికాతో గత జులైనెలలో ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో ఈ వార్త బయటకు వచ్చింది. సౌదీఅరేబియాతో అమెరికా చేసుకున్న పౌర అణు ఇంధన ఒప్పందం చాలా మంది అమెరికా చట్టసభ్యులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పౌర అణు ఇంధన సాంకేతికతను అంతిమంగా సౌదీ అరేబియా అణ్వస్త్ర తయారీకి ఉపయోగించుకుంటుందని ఇజ్రాయెలీ అధికారులు కూడా వ్యాఖ్యానించారు. ఐతే రిపబ్లికన్ల చేతుల్లో ఉన్న చట్టసభ మాత్రం ఈ ఒప్పందాన్ని అమలు కాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేసే అవకాశం లేదు. మసాచ్యుసెట్స్ సెనేటర్ ఎడ్ మార్కీ, ఓరెగాన్ సెనేటర్ జెఫ్ మార్కీల నాయకత్వంలో చట్టసభ్యుల బృందం ఒకటి అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోకు శనివారం ఒకలేఖ రాసింది. ఆ లేఖలో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీఅరేబియాను యురేనియంను అణ్వస్త్రంకోసం శుద్ధిచేసేస్థాయికి వెళ్ళకుండా అడ్డుకోవాలని కోరారు. ఐతే పశ్చిమాసియాలో ఇరాన్, దాని మద్దతుగల హౌతీల నుండి తీవ్రస్థాయిలో సౌదీ అరేబియా యుద్ధ బెదిరింపులు ఎదుర్కొంటున్నది. ఇప్పటికీ యుద్ధం వల్ల, హౌతీల దాడులవల్ల ఆర్థికంగా చాలా నష్టపోయింది.

# ఆస్ట్రేలియాకు పెద్ద నష్టం

### డీజిల్ ఎగుమతులపై ట్రంప్ నిషేధం

**సిడ్నీ:** ముడి చమురు సరఫరా లోటు,ధరల పెరుగుదలవల్ల సమస్యలు రావడంతో డీజిలు ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిషేధం విధించారు. దీనివల్ల ఆస్ట్రేలియాకు పెద్ద నష్టం వాటిల్లుతుంది.నవంబరులో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశంలో చమురు ధరల నియంత్రణ,కొరత నివారణ చర్యలవల్ల ఓటర్లు కొంత శాంతించి మేలు చేసే అవకాశం ఉందని ట్రంప్ బలంగా నమ్ముతున్నారు. నవంబరులో ద్వైవార్షిక ఎన్నికలు ట్రంప్‌కు ఎంతో కీలకమైనవి.ఆయన అధికారాన్ని, ఆధిపత్యాన్ని ఈ ఎన్నికలు ప్రభావితం చేస్తాయి.పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు,కనిష్ఠస్థాయికి చేరుకుంటున్న చమురు నిల్వలు కారణంగా ఎగుమతులపై ట్రంప్ నిషేధంవల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థకు, చిన్న దేశాలకు దెబ్బ తగిలే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ,ఇంధన ధరలు తగ్గించడం,యుద్ధాలు ముగించడం వంటి నినాదాలతో గత ఏడాది ట్రంప్ అధికారంలోకి వచ్చారు. కానీ అందుకు విరుద్ధంగా ప్రవర్తించడంతో అమెరికాలో ఆయనపై వ్యతిరేకత పెరిగింది. మరో ఆరు వారాల్లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి. తన వాగ్దానాల నుండి ట్రంప్ వెనుకడుగు వేస్తున్నారు. ద్రవ్యోల్బణం 3.4 శాతానికి చేరింది. ఫెడరల్ రిజర్వు రేటు రెండు శాతం లక్ష్యానికి విరుద్ధంగా చాలా ఎక్కువగా నమోదైంది. దీంతో గృహ నిర్మాణం,చిన్న వ్యాపారులపై పెనుభారాలు పడ్డాయి. ఇరాన్‌పై అమెరికా యుద్ధం మొదలైనప్పటినుండీ ఇంధనం ధరలు యాభైశాతం పెరిగాయి. ట్రంప్‌కు ప్రజల్లో ఆదరణ రేటింగ్ కూడా అత్యంత కనిష్ఠంగా 32 శాతానికి ఊణించింది.

## పోటీ చేయమన్నారు..

(మొదటి పేజీ తరువాయి)

విమాన ప్రయాణంలో ఈ సంభాషణ జరిగిందని జిజి థామ్సన్ చెప్పారు. అయితే, తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు కూడా ఆయన స్పష్టం చేశారు. జిజి థామ్సన్ 1980 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ కేరళ కేడర్ ఐఏఎస్ అధికారి. ఊమెన్ చాందీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో 2015–16 కాలంలో ఆయన కేరళ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 'మా మధ్య మంచి స్నేహం ఉండేది. పదవీ విరమణ తర్వాత నా ప్రణాళిక ఏమిటని ఆయన అడిగారు, దానికి నేను పెద్దగా ఏమీ లేదని చెప్పాను. అప్పుడు, 2019 ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఎంపిగా, ఆపై క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఉత్తమమని ఆయన నాకు సలహా ఇచ్చారు' అని జిజి థామ్సన్ చెప్పారు. జ్ఞానేశ్ కుమార్ తనను ఒప్పించడానికి చాలా గట్టిగా ప్రయత్నించారని థామ్సన్ ఆ ఇంటర్వ్యూలో అన్నారు. బిజెపి టికెట్ ప్రతిపాదనను తాను తిరస్కరించినప్పటికీ, రాజకీయాల్లోకి రావాలని జ్ఞానేశ్ తనను ఒప్పించడానికి మరింత ప్రయత్నించారని ఆయన చెప్పారు.

## అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బిర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) సర్ ప్రక్రియ, కమిషన్ తీసుకునే నిర్ణయాలు, ఫారం 6 సహా పలు అంశాలపై వివరణ ఇచ్చింది. దేశవ్యాప్తంగా చేపట్టిన సర్‌కు సంబంధించిన అన్ని ఉత్తర్వులు ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయని ఇసి స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు సంధు, జోషి కేబినెట్ సెక్రటరీకి పంపిన లేఖలు పోల్ ప్యానెల్ లేదా ఐటీ విభాగానికి సంబంధించిన విధానపరమైన నిర్ణయం కాదని ఎన్నికల సంఘం వివరించింది. ఆ లేఖలు కేవలం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఒక అధికారి పనితీరు, విధుల కేటాయింపునకు సంబంధించినవని క్లారిటీ ఇచ్చింది.

**సర్ ఉత్తర్వులపై ఇసి వివరణ :** దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ నిర్వహించడానికి 2025 జూన్ 24న జారీ చేసిన ఉత్తర్వులకు కమిషన్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని ఇసి పేర్కొంది. బిహార్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియను బెంగాల్‌తో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించినట్లు తెలిపింది. ఈ సర్ ఉత్తర్వులను 2026, మే 27న సుప్రీంకోర్టు సమర్థించిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలానే 2025 అక్టోబర్ 27న 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు, 2026 మే 14న మరో 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సర్ షెడ్యూల్ జారీ చేసినప్పటికీ అవన్నీ కూడా ఇసి ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని తెలిపింది. మూడో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తుది ఓటర్ల జాబితా వచ్చాకే మొత్తం ఓటర్ల సంఖ్యపై స్పష్టత వస్తుందని ఇసి వెల్లడించింది.

## పర్యాటకాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మాదాపూర్ శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ టూ రెడిజైన్ టూరిజం " ప్రధాన అంశంగా కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకుని పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు రూపొందించిన వెబ్‌సైట్, కాఫీ బుక్ తదితర కార్యక్రమాలను ఆయన అభినందించారు. తెలంగాణలో నదులు, అద్భుతమైన అడవులు, జలపాతాలు,ప్రాచీన దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, గిరిజన సంస్కృతి, గ్రామీణ జీవన విధానం వంటి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లతో పాటు రాష్ట్రంలోని ప్రకృతి సంపదను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం ద్వారా దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని చెప్పారు. అంతేకాకుండా టెంపుల్ టూరిజం, విలేజ్ టూరిజం, ఎకో టూరిజం,వెల్‌నెస్ టూరిజం తదితర రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకుల ఆకర్షణకు భద్రత, సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

### తెలంగాణకు ప్రపంచస్థాయి ప్రత్యేక చరిత్ర –మంత్రి జూపల్లి

అంతకుముందు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,పర్యాటక రంగంలో తెలంగాణకు ప్రపంచస్థాయి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు.పర్యాటకం కేవలం వినోదానికే పరిమితం కాకుండా శాంతి,పరస్పర అవగాహన,ఆర్థికాభివృద్ధి,ఉపాధి కల్పనకు శక్తివంతమైన సాధనమని అన్నారు. తెలంగాణకు ఘనమైన చరిత్ర, వారసత్వ సంపద,ఆధ్యాత్మికత, సంస్కృతి,ప్రకృతి,వన్యప్రాణులు, ప్రత్యేక వంటకాలు,ఆధునిక నగర ఆకర్షణలతో విశిష్టమైన పర్యాటక సామర్థం ఉందన్నారు. రామప్ప దేవాలయం, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, గోల్కొండ తదితర ప్రాంతాలను దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025–2030 మధ్య పర్యాటక రంగంలో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, దాదాపు 5.10 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త టూరిజం పాలసీ ద్వారా వివిధ ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.డిజిటల్ సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో తెలంగాణ పర్యాటక రంగాన్ని ఆధునికీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. పర్యాటక ప్రాంతాలు, రవాణా, వసతి తదితర వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చేలా టూరిజం వెబ్‌సైట్‌ను పునరుద్ధరించినట్లు చెప్పారు. హోమ్‌స్టేలు, టూరిస్ట్ గైడ్‌లు, భాషా అనువాదకులకు శిక్షణ వంటి కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని వివరించారు.

## భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ఎంపిలకు సూచించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని, ఆయన సేవలు, ఆలోచనలు, దేశ అభివృద్ధికి చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

పదవులకు వన్నె తెచ్చిన డాక్టర్ మన్మోహన్ సింగ్ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆ పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. 1991లో పివి నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే విధంగా కీలక ఆర్థిక సంస్కరణలు అమలు చేశారని గుర్తు చేశారు. సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు డాక్టర్ మన్మోహన్ సింగ్ బాటలు వేశారని సిఎం అన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన అనేక సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని, అలాంటి ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని సిఎం పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసి స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణానికి పునాది వేసిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాత్రను సిఎం గుర్తు చేశారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను రాష్ట్ర ఏర్పాటుతో సాకారం చేసిన ఘనత సోనియాగాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సంతకాన్ని విగ్రహం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో అనేక కీలక సామాజిక, ఆర్థిక విధానాలు అమలయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ–పునరావాస చట్టం తదితర చట్టాలు తీసుకురావడంలో సోనియాగాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని అన్నారు. భూసేకరణ, పునరావాస చట్టం ద్వారా భూమిలేని పేదలకు కూడా పరిహారం పొందే హక్కు కల్పించారని సిఎం గుర్తు చేశారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించిన గొప్ప వ్యక్తి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని సిఎం తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## తీవ్ర ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ కె.హరగోపాల్ , కె.రమ (సిపిఐఎంఎల్ మాస్‌లైన్), అనురాధ (సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ), ప్రసాద్ (సిపిఐఎంఎల్), చంద్రశేఖర్ (ఎంసిపిఐ), సి.హెచ్.మురహరి(ఎస్‌యుసిఐ), జానకి రాములు (ఆర్‌ఎస్‌పి), మామిండ్ల రమేశ్‌రాజా (సిపిఐ ఎంఎల్ లిబరేషన్) లతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలను హస్తగతం చేసుకునేందుకే కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియకు తెర లేపిందని ఆరోపించారు. అందులో భాగంగానే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నమ్మిన బంట్‌గా ఉన్న జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషన్‌గా నియమించారన్నారు. గతంలో మతం పేరుతో ఆ తర్వాత సిబిఐ, ఈడిలను అడ్డం పెట్టుకుని గద్దెనెక్కిన బిజెపి ఇప్పుడు మరింత ప్రజాదరణ కోల్పోవడంతో ఈసారి మళ్లీ బిజెపిని గెలిపించేందుకూ ఈసి చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్రకు తెరలేపారని విమర్శించారు. అందుకే ఏ రాష్ట్రంలో ఎన్నికల జరిగినా అంతకు ముందు ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని గుర్తు చేశారు. అంతేకాకుండా భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవి కాలంలో తీసుకున్న నిర్ణయాలను ఆ తర్వాత ఎవరూ పునర్ సమిక్షించకుండా చట్టం తేవడం ప్రజాస్వామ్యానికే విఘాతమని, ఇకా ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఏలా మనజాలతుందని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటంతోపాటు ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసంవామపక్షాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా ప్రజాస్వామ్యవాద శక్తులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో నియతృత్వాన్ని అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి ముప్పుఅని ఇందుకు పాల్పడుతున్న ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన కమిషనర్ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మిగిలిన ఇద్దరు కమిషనర్లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్ణయాలపై పారదర్శకత అవసరమన్నారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసేంత వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్ ప్రధాన కమిషనర్‌గా నియమించిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ ప్రచార యాత్రకు అనుగుణంగా వివిధ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం గమన్హారమన్నారు. చిన్న రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లో 6 దపాలుగా ఎన్నికల నిర్వహిస్తే అదే అతిపెద్ద రాష్ట్రాలైన మధ్య ప్రదేశ్‌లో ఒకే దపా, ఉత్తరప్రదేశ్‌లో రెండు దపాల్లోనే ఎన్నికల పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చివరికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి అధికారులను కూడ కేంద్ర ఎన్నికల సంఘం లాగేసుకుందని, ఓటర్ జాబితాను కూడ ఇవ్వలేని పరిస్థితిని కల్పించారని తెలిపారు. ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాన కమిషనర్ టి.ఎన్.శేషన్ ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన ఈ వ్యవస్థను బిజెపి అధికారం చేపట్టిన తర్వాత పూర్తిగా భ్రష్టి పట్టించిందని , ఇందుకు కాంగ్రెస్ నాయకురాలు మినాక్షి నటరాజన్ ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో దేశంలో దాదాపు 13 కోట్ల మంది అర్హులైన ఓటర్లను తొలగించారని, తనకు నచ్చని వారి ఓట్లను తొలగించడం జ్ఞానేశ్ కుమార్‌కు అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఓటరు హక్కు కోసం తండ్రి, తాతల సమాచారం, పాత రికార్డులు అడగడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ చదువు, ఆస్తి లేని పేదలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల ఓట్లను కావాలని తొలగిస్తున్నారని ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## పునరుద్ధరణ పనులు

(మొదటి పేజీ తరువాయి)

డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసిందని ఆయన వెల్లడించారు. పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్త కట్‌ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే వ్యవస్థల్లోని లోపాలను సరిచేయడం, బ్యారేజీల పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చొరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఎన్‌డిఎస్‌ఎతో పాటు వివిధ నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని చేపడతాం అని స్పష్టం చేశారు.ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఖ రారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు వెల్లడించారు. కమిటీ నిపుణులు డిజైన్లను పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫార్సులు చేస్తారని తెలిపారు.

### ఎన్నికల సంఘంపై అనుమానాలు ప్రజాస్వామ్యానికి ముప్పు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ఎన్నికలను నిర్వహించే రిఫరీపైనే అనుమానాలు తలెత్తితే ఇక ఎన్నికల నిష్పాక్షికతపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందని నీటిపారుదలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై వెలుగులోకి వస్తున్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఈసి దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదని, ఓటు అధికార పార్టీ సొత్తు కాదని.. అది ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ కమిషనర్లు సంధు, జోషి పేరుతో వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ బహిరంగంగా సమాధానం చెప్పాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. వివాదాస్పద నిర్ణయాలకు బాధ్యులెవరో వెల్లడించడంతోపాటు, అర్హులైన ఓటర్లు సాంకేతిక, పరిపాలనా కారణాలతో జాబితా నుంచి తొలగిపోకుండ తీసుకుంటున్న చర్యలను దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల నిర్వహణకు ఉపయోగిస్తున్న సాంకేతిక వ్యవస్థల పనితీరుపైనా, వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలపైనా నిష్పాక్షిక విచారణ జరపాలని కోరారు. రాజ్యాంగ పదవికి గౌరవం కుర్చీ వల్ల రాదు.. ప్రజల విశ్వాసం వల్ల వస్తుందని, ఆ విశ్వాసం దెబ్బతిన్నప్పుడు బాధ్యత వహించి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాల్సిందేనన్నారు. అదేవిధంగా వెలుగులోకి వచ్చిన అంశాలన్నింటిపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లన్నింటినీ ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందన్నారు.డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.డిజైన్ల పరిశీలన నుంచి టెండర్లు, పనుల అమలు, తుది భద్రతా ధృవీకరణ వరకు ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖా కార్యదర్శి ఇ శ్రీధర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్,ఇ ఎన్ సిలు రమేష్ బాబు,శ్రీనివాస్ ,మధుసూదన్, నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ బొనాంజా

## తొమ్మిదోసారి విజేతగా భారత్

### 'మెన్ ఇన్ బ్లూ' విజయంతో పుత్తడిని కొల్లగొట్టిన పురుషుల జట్టు



ఆసియా క్రీడల కబడ్డీలో భారత జట్టు పసిడి పతకంతో గర్జించింది. మహిళలు స్వర్ణంతో మురిసిన కాసేపటికే పురుషుల జట్టు సైతం కనకంతో యావత్ భారతావనిని పులకింపజేసింది. ఈ మెగా టోర్నీలో ఇప్పటికే ఎనిమిది సార్లు గోల్ మెడల్ సాధించిన 'మెన్ ఇన్ బ్లూ' మరో విజయంతో తొమ్మిదో పుత్తడిని కొల్లగొట్టింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో ఇరాన్‌ను చిత్తు చేసిన అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాన్ని చేబూని మ్యాట్‌పై పరుగెట్టారు. విజయానందంలో జట్టు సభ్యులు, కోచ్‌లు కేరింతలు కొట్టారు. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు పంజా విసిరాయి. కబడ్డీ కూతలో.. ఉడుం పట్టులో తమకు తిరుగులేదని చాటుతూ మహిళలు, పురుషుల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకున్నాయి. శనివారం ఫైనల్లో ఇరాన్‌ను చిత్తు చేసి మహిళల జట్టు గోల్డ్ మెడల్ అందుకోగా.. కాసేపట్లోనే పురుషుల జట్టు సైతం పసిడిని ఒడిసిపట్టింది. ఫైనల్లో 40–34తో ఇరాన్‌ను ఓడించిన మెన్ ఇన్ బ్లూ గోల్డ్ మెడల్ అందుకుంది. తొలి అర్థ భాగంలో 17–18తో వెనకడిన భారత్.. అనంతరం మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తీసుకుంది. కెప్టెన్, రైడర్ సునీల్ కుమార్ ఇరాన్ డిఫెన్స్‌ను ఛేదిస్తూ పాయింట్లు తీసుకొచ్చాడు. దాంతో.. ఇప్పటికే ఎనిమిది సార్లు ఆసియాడ్‌లో విజేతగా నిలిచినరికార్డు స్థాయిలో తొమ్మిదోసారి స్వర్ణాన్ని పట్టేసింది. అంతే.. భారత ఆటగాళ్లు మువ్వన్నెల జెండాను పట్టుకొని.. మ్యాట్‌పై ప రుగులు తీసి ఈ థ్రిల్లింగ్ విజయాన్ని ఆస్వాదించారు. తొలిసారి బీజింగ్ (1990)లో గోల్డ్ మెడల్ సాధించిన భారత పురుషుల జట్టు.. 1994(హిరోషి యా), 1998(బ్యాంకాక్), 2002(బుసాన్), 2006(దోహా), 2010(గంగ్జౌ), 2014(ఇంచియాన్), 2023(హాంగ్జౌ), ఇప్పుడు నగోయలో పసిడి కాంతులు వి రజిమ్మింది. అంతకు ముందు పుష్ప రానా సారథ్యంలోని మహిళల జట్టు ఇరాన్‌ను 3734తో ఓడించింది. తద్వారా ఆసియా క్రీడల్లో నాలుగో స్వర్ణం సొంతం చేసుకుంది.

## ఇరాన్‌తో థ్రిల్లింగ్ ఫైనల్..

### భారత మహిళల కబడ్డీ జట్టుకు గోల్డ్ మెడల్



**నగోయా:** ఏషియన్ గేమ్స్ మహిళల కబడ్డీ ఈవెంట్‌లో భారత జట్టుకు స్వర్ణ పతకం దక్కింది. జపాన్‌లో జరుగుతున్న 2026 ఏషియన్ గేమ్స్‌లో భారత మహిళలు దుమ్మురేపారు. తాజా గేమ్స్‌లో ఇండియాకు ఇది మూడో గోల్డ్ మెడల్ కాగా, ఏషియన్ గేమ్స్‌లో నాలుగోసారి భారత్‌కు స్వర్ణ పతకం దక్కింది. టోకాయి సిటిజన్ జిమ్నాజియంలో ఇవాళ జరిగిన ఫైనల్‌లో ఇరాన్ తీవ్ర పోటీ ఇచ్చింది. హోరాహోరీగా సాగిన తుదిపోట్‌లో భారత మహిళల జట్టు 37–34 పాయింట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఆఖరి నిమిషం వరకు ఇరాన్ తన పోరాట పటిమను ప్రదర్శించింది. చివరకు కబడ్డీ ఫైనల్లో ఇండియా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నది. ఏషియన్ గేమ్స్‌లో ఇండియన్ మహిళల జట్టు అయిదు సార్లు ఫైనల్స్‌లో ప్రవేశించగా, నాలుగు సార్లు స్వర్ణ పతకం గెలుచుకున్నది. ఫస్ట్ హాఫ్ టైంలో ఇండియా 22–16 స్కోరుతో ఆధిక్యాన్ని చాటింది. కానీ సెకెండ్ హాఫ్‌లో ఇరాన్ అత్యుత్తమ ఆటను ప్రదర్శించింది. సెకెండ్ హాఫ్‌లో 18–15 స్కోరుతో ఇరాన్ ఆధిక్యాన్ని ప్రదర్శించినా.. ఫస్ట్ హాఫ్ లీడ్ వల్ల భారత్‌కు విజయం ఈజీ అయ్యింది. మ్యాచ్ గెలిచిన తర్వాత భారత మహిళల బృందం విక్టరీ ల్యాప్ నిర్వహించింది. జాతీయ గీతం వందేమాతరాన్ని ఆలపించారు. జాతీయ జెండాతో భారత ప్లేయర్లు కోర్టులో పరుగులు తీశారు. ఇప్పటి వరకు ఏషియన్ గేమ్స్‌లో ఇండియాకు మహిళల కబడ్డీలో స్వర్ణ పతకం దక్కింది. కేవలం 2018లో మాత్రం భారత జట్టు సిల్వర్ మెడల్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.

## ప్రచీ చౌదరీ కాంస్య గర్జన..

## క్వార్టర్ ఫైనల్లో సింధు..!

ఆసియా క్రీడల ఏడో రోజు భారత బృందం అదరగొట్టింది. కబడ్డీలో రెండు స్వర్ణాలు, షాట్‌పుట్‌లో తజిందర్ సింగ్ రజతం పట్టేయగా.. మహిళల 400 మీటర్ల పరుగులోలో ప్రచీ చౌదరీ కాంస్యంతో గర్జించింది. ఆసియాడ్‌లో ఆమెకు ఇదే మొదటి పతకం కాగా బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొమొక మియజాకి(జపాన్)తో జరిగిన ప్రీక్వార్టర్స్‌లో చెలరేగిన తెలుగు తేజం అలవోకగా ముందంజ



వేసింది. నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో పీవీ సింధు సత్తా చాటుతోంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సింధు మహిళల ప్రీ క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ తొమొక మియజాకిను చిత్తు చేసింది. వరస సెట్లలో జోరు చూపించిన ఒలింపిక్ విజేత.. 21–9, 21–13తో క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. అంతకుముందు.. మహిళల 400 మీటర్ల పరుగులో ప్రచీ చౌదరీ కంచు మోత మోగించింది. ఆసియా క్రీడల్లో ఆమెకిది మొట్టమొదటి మెడల్ కావడం విశేషం. శనివారం జరిగిన ఫైనల్లో ప్రచీ 53.21 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. తద్వారా తన కలల పతకాన్ని సొంతం చేసుకుంది. ఇక మహిళల 1,500 మీటర్ల పరుగులో అంచనాలు అందుకుంటూ పరుల్ చౌదరీ ఫైనల్‌కు అర్హత సాధించింది.

## బిజినెస్



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 74,781.76 పాయింట్లు. ముగింపు 73,895.74 పాయింట్లు. నష్టం 886,02 పాయింట్లు.

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 23,398.10 పాయింట్లు. ముగింపు 23,140.50 పాయింట్లు. నష్టం 257.60 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా ఆరో వారం కూడా నష్టాలను ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా 'బేర్' జోరు కొనసాగింది. స్టాక్ మార్కెట్లు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి)

## 14.89 బిలియన్ డాలర్లు తగ్గిన భారత్ విదేశీ మారక నిల్వలు

భారత్ విదేశీ మారక నిల్వలు, సెప్టెంబర్ 18తో ముగిసిన వారంలో 14.881 బిలియన్ డాలర్లు తగ్గి 765.901 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఎఫ్‌సిఎ) గణనీయంగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతకుముందు వారంలో కూడా విదేశీ మారక నిల్వలు 4.924 బిలియన్ డాలర్లు తగ్గి 780.782 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 18తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన ఎఎఫ్‌సిఎ 14.816 బిలియన్ డాలర్లు తగ్గి 630.980 బిలియన్ డాలర్లకు చేరుకుంది. డాలర్లలో లెక్కించే ఎఫ్‌సిఎ విలువపై యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికా డాలర్ మినహా ఇతర కరెన్సీల విలువల్లో వచ్చే పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో భారత్ బంగారం నిల్వల విలువ 68 మిలియన్ డాలర్లు పెరిగి 111.292 బిలియన్ డాలర్లకు చేరింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారత్‌కు ఉన్న స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 106 మిలియన్ డాలర్లు తగ్గి 18.739 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ 4.89 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

## ట్రాయ్ డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ భవనాల్లో మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీని అంచనా వేసి ధ్రువీకరించేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) శుక్రవారం సమగ్ర డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ (డిసిఆర్) ప్లాట్‌ఫామ్‌తో పాటు ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. భవనం లోపల నెట్‌వర్క్ పనితీరును ఒకే ప్రమాణాలతో అంచనా వేసేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ఇల్లు లేదా కార్యాలయాన్ని కొనుగోలు చేసే, అద్దెకు తీసుకునే ముందు అక్కడి డిజిటల్ కనెక్టివిటీ పరిస్థితిని తెలుసుకునే అవకాశం వినియోగదారులకు లభిస్తుంది. ప్రాపర్టీ మేనేజర్లు, డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్ ఏజెన్సీలు, వినియోగదారులను ఒకే డిజిటల్ వేదికపైకి ఈ ప్లాట్‌ఫామ్ తీసుకొస్తుంది. ఫైబర్ సౌకర్యం, మొబైల్ నెట్వర్క్ లభ్యత, భవనంలో ఏర్పాటు చేసిన కనెక్టివిటీ వ్యవస్థలు, వైఫై మౌలిక వసతులు వంటి అంశాలను రేటింగ్స్‌లో పరిగణిస్తారు. భవనంలో పనిచేస్తున్న వివిధ టెలికాం సంస్థల నెట్‌వర్క్




లభ్యత, సిగ్నల్ సామర్థ్యానికి నిర్దిష్ట వెయిటేజీ ఇస్తారు. వినియోగదారులు ఆస్తి పేరు, సర్టిఫికెట్ ఐడి లేదా ప్రాంతం ఆధారంగా రేటింగ్ పొందిన భవనాలను వెతికి, వాటిని పోల్చి చూడవచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ సంతకం చేసిన రేటింగ్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరించవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవస్థను స్వచ్ఛంద ప్రాతిపదికన అమలు చేస్తున్నారు. భవన నిర్మాణ దశలోనే మెరుగైన డిజిటల్ మౌలిక వసతులను ఏర్పాటు చేసేలా డెవలపర్లను ఈ రేటింగ్ ప్రోత్సహిస్తుంది. ప్రస్తుతం 23 గుర్తింపు పొందిన రేటింగ్ ఏజెన్సీలు, 11 ప్రాపర్టీ మేనేజర్లు, 7 ప్రాపర్టీలు ప్లాట్‌ఫామ్‌లో నమోదయ్యాయి.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నుంచి 'జీరో ఫారెక్స్ మార్కప్'




ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తన క్రెడిట్ కార్డులపై 'జీరో ఫారెక్స్ మార్కప్' సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఉన్న కార్డులతో పాటు కొత్తగా జారీ చేసే అన్ని క్రెడిట్ కార్డులకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ఇందుకోసం వినియోగదారులు కొత్త కార్డు తీసుకోవాల్సిన అవసరం లేదు, కార్డు అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం కూడా లేదు. అలాగే నిర్దిష్ట మొత్తంలో ఖర్చు చేయాలనే షరతు కూడా లేదు. ఈ సదుపాయం కార్డుదారులకు ఆటోమేటిక్‌గా వర్తిస్తుంది. విదేశాల్లో కార్డుతో చెల్లింపులు చేసినప్పుడు సాధారణంగా బ్యాంకులు ఫారెక్స్ మార్కప్ రుసుమును వసూలు చేస్తాయి. ఉదాహరణకు రూ.1 లక్ష విలువైన అంతర్జాతీయ లావాదేవీపై 3.5 శాతం మార్కప్, దానిపై జిఎస్‌టి కలిపి సుమారు రూ.4,130 అదనంగా చెల్లించాల్సి రావచ్చు. 'జీరో ఫారెక్స్ మార్కప్' వల్ల ఈ అదనపు వ్యయం ఉండదు. విదేశీ ప్రయాణాల్లోనే కాకుండా అంతర్జాతీయ ఆన్‌లైన్ కొనుగోళ్లు, సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్లు, స్ట్రీమింగ్ సేవలు, విద్యా చెల్లింపులు, వ్యాపార ఖర్చులకు కూడా ఈ సదుపాయం ఉపయోగపడుతుంది. సంబంధిత కార్డుకు వర్తించే రివార్డు పాయింట్లు లేదా క్యాష్‌బ్యాక్‌కు వినియోగదారులు కొనసాగించవచ్చు. ఫారెక్స్ మార్కప్ తప్పించుకోవడానికి ప్రత్యేకంగా ఫారెక్స్ కార్డు తీసుకోవాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,52,420
22 క్యారెట్లు: రూ. 1,49,600
18 క్యారెట్లు: రూ. 1,14,300
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).





హనుమకొండ జిల్లా బాలసముద్రంలో...

## వీర వనిత ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలి

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

ప్రజాపక్షం/హనుమకొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు సమాజం ప్రోత్సహించాలని, మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మ ణ్, జక్కు రాజు గౌడ్, నకీర్త ఓదెలు, వేల్పుల సారంగపాణి, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, కొట్టె వెంకటేశ్, మాలోతు మంగ, నోముల కిషోర్, గోకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### నాటి అమరుల త్యాగాలతోనే స్వేచ్ఛ : ఎస్‌కె. సాబీర్ పాషా

భద్రాద్రికొత్తగూడెం : నాటి సాయుధ పోరాట అమరులత్యాగాల పునాదులపైనే నేటి స్వేచ్ఛా తెలంగాణ ఆవిష్కృతమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు నేరెళ్ల రమేష్, బోయిన విజయ్‌కుమార్ ధనరాజ్ అన్నం లక్ష్మీ నారాయణ సుంకర అజిత్ భూస రాజు చింతాల రాజు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం : వివిఎస్.బోస్

హైదరాబాద్: చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు, పేదలు, రైతుల హక్కుల కోసం భూస్వామ్య దోపిడికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ జీవితం తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చెరగని అధ్యాయమని అన్నారు. భూమి, భుక్తి విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిని వర్గాలపై జరుగుతున్న దోపిడి అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలకు సంఘటితం చేస్తూ పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి దామోదర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్,సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండలో సిపిఐ భారీ ర్యాలీ, అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

ప్రజాపక్షం/హనుమకొండ : ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే సిఇసి పదవి నుండి తొలగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగిం ది. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో, ధర్నాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ప్రధాన వక్తగా మాట్లాడుతూ సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన ఓటర్లందరి పేర్లను వెంటనే పునరుద్ధరించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఎన్నిక ల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు హ క్కును కాలరాస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓట్లను తొలగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వరకు సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఇసి ని పదవి నుండి తొలగించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మ ణ్, జక్కు రాజు గౌడ్, నకీర్త ఓదెలు, వేల్పుల సారంగపా ణి, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, కొట్టె వెంకటేశ్, మాలో తు మంగ, నోముల కిషోర్, గోకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




### తక్షణమే రాజీనామా చేయాలి : షేక్ బాష్ మియా

వరంగల్ : సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణ మే రాజీనా మా చేయాలని, ప్రజల ఓటు హక్కును పరిరక్షించి.. ప్రతి అర్హుడికి ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. శనివారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఎస్ఐఆర్‌ను వెంటనే రద్దు చేసి సిఇసి జ్ఞానేశ్వ ర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును స్వేచ్ఛగా ఎలాంటి ఆటంకాలు లేకుండా వినియోగించుకునే విధంగా ఎన్నికల వ్యవస్థ పనిచేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని, అయితే ఎన్నికల జాబితాల సవరణ ఎస్ఐఆర్ తదితర అంశాలపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నికల జాబితాల్లో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఉండేలా ఎవరి ఓటు హక్కు అన్యాయంగా కోల్పోకుండా పారదర్శకమైన విధానాలను అమలు చేయాలన, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును స ద్వినియోగం చేసుకునేలా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగ ల్ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, కందిక చెన్నకేశవులు, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి జాన్‌పాల్, మియాపు రంగోవర్ధన చారి, పరికిరాల రమేష్, ఎల్. దస్రు, బొట్ల శ్రీనివాస్, మస్కా సుధీర్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో


ఖమ్మం : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల అభిప్రాయాలను పక్కదారి పట్టించిన జ్ఞానేష్‌కుమార్ దేశ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. బిజెపికి తొత్తుగా వ్యవహరించిన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఆయ న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమి తి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణ కుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, మల్లికార్జున్, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

### సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో

మేడ్చల్ : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, శనివారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ సాగర్ హోటల్ ఎదురుగా నిరస న చేపట్టారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఉమా మహేష్, సత్యం, సిపిఐ మండల కార్యదర్శి స్వామి, మండల సహాయ కార్యదర్శి రాములు, సిపిఎం నాయకులు రాజశేఖర్, అంజయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, సిపిఐ నాయకులు బక్కరి మల్లేష్, రమేష్, గౌరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లో....



కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో....



వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద...



ఖమ్మం బైపాస్ రోడ్డులో...

# గణేశ్ శోభాయాత్ర విజయవంతం



**48 గంటలు.. లక్షలాది భక్తులు.. అయినా ప్రశాంతంగానే నిమజ్జనం!**

**28 వేల మందికి పైగా పోలీసులతో పటిష్ట బందోబస్తు..**

**2027 ఉత్సవాలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు : సిపి సజ్జనార్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లక్షలాది మంది భక్తులు, వేలాది విగ్రహాలు, దాదాపు 48 గంటల పాటు సాగిన గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసింది. నగర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ మహా నిమజ్జనోత్సవం విజయవంతం కావడంలో పోలీస్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఆర్అండ్‌బి, విద్యుత్, వైద్యారోగ్య, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయం కీలకంగా పనిచేసిందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. శనివారం తెలంగాణ సచివాలయం సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఉన్నతాధికారులతో కలిసి నిమజ్జనోత్సవ నిర్వహణ వివరాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా మూడు నెలల ముందుగానే ఏర్పాట్లపై కసరత్తు ప్రారంభించినట్లు సిపి తెలిపారు. ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణేశ్‌ను సుమారు 30 లక్షల మంది, బాలాపూర్ గణేశ్‌ను దాదాపు 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు వెల్లడించారు. నిమజ్జనోత్సవానికి హైదరాబాద్ సిటీ పోలీస్‌కు చెందిన 20 వేల మంది సిబ్బందితో పాటు జిల్లాల నుంచి 8 వేల మందికి పైగా అదనపు సిబ్బందిని బందోబస్తులో వినియోగించినట్లు సజ్జనార్ తెలిపారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, టీజీఎస్‌పీ విభాగాల బలగాలను కూడా రంగంలోకి దించినట్లు చెప్పారు. అదనపు బలగాలను సమకూర్చిన రాష్ట్ర డిజిపికి కృతజ్ఞతలు తెలిపారు. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ఒకే కమిషనరేట్ పరిధిలో ఉండటం, జోన్లు పరస్పరం అనుసంధానమై ఉండటంతో పోలీస్ శాఖలో సమన్వయం మరింత మెరుగైందని సిపి వివరించారు. టిజిఐసిసిసి మల్టీ ఏజెన్సీ వార్‌రూమ్ ద్వారా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించారని ప్రశంసించారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల ప్రజలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చిన భక్తులకు సిపి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలుగా అహోరాత్రులు పనిచేసిన జీహెచ్ఎంసీ, హైడ్రా, ఆర్అండ్‌బీ, టిజిఎస్‌పిడిసిఎల్, వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. పోలీస్ శాఖ సూచనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో పాటు ఖైరతాబాద్, బాలాపూర్ ఉత్సవ సమితులు పోలీసుల సూచనలను పాటిస్తూ సకాలంలో నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించాయని సజ్జనార్ పేర్కొన్నారు. అయితే నిమజ్జన శోభాయాత్రల్లో పేపర్ షాట్స్ వినియోగం వల్ల రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోయి, వర్షం కురిసినప్పుడు ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని సిపి హెచ్చరించారు. వీటి వినియోగాన్ని నిషేధించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రోడ్లపై అన్నదాన వ్యర్థాలు పడేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అశ్లీల నృత్యాలకు పాల్పడటం వంటి అంశాల్లో నిర్వాహకులు, ప్రజలు స్వీయ క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది అనుభవాలను విశ్లేషించి ప్రత్యేక డీబ్రీఫింగ్ సమావేశం నిర్వహిస్తామని, దాని ఆధారంగా వచ్చే ఏడాది గణేశ్ ఉత్సవాల నిర్వహణకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తామని సిపి తెలిపారు.

**విధుల్లోనూ.. సిబ్బందితోనూ సిపి సజ్జనార్..**

నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా సిపి సజ్జనార్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఎం.జె. మార్కెట్, బషీర్‌బాగ్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ తదితర ప్రధాన మార్గాల్లో ద్విచక్ర వాహనంపై కలియదిరిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అహోరాత్రులు విధుల్లో ఉన్న బందోబస్తు సిబ్బందిలో ఉత్సాహం నింపేందుకు వారితో కలిసి సరదాగా స్టెప్పులు వేసి సందడి చేశారు. పోలీస్ బాస్ తమతో కలిసి డ్యాన్స్ చేయడంతో సిబ్బంది ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ సిపిలు ఎం. శ్రీనివాస్, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి డి. జోయల్ డెవిస్, డిసిపిలు కె. శిల్పావల్లి, రక్షిత కె. మూర్తి, కాజల్ సింగ్, అవినాష్ కుమార్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఏడు రోజులు వర్షాలు

### తేలికపాటి నుండి ఒక మోస్తరు వానలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ముఖ్యంగా తొలి రెండు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. శని, ఆదివారాల్లో కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆది, సోమవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని చెప్పారు.

## మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్. మన్మోహన్ సింగ్ సేవలు దేశానికి చిరస్మరణీయమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా మన్మోహన్ సింగ్‌ను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.దేశ ఆర్థికాభివృద్ధి, సమగ్ర ప్రగతికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు ఆదర్శనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా ఆయన చూపిన సరళత, విజ్ఞానం, నిబద్ధతతో కూడిన నాయకత్వం ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర వేశాయని అన్నారు.ఆర్థిక సంస్కరణలకు పునాది వేసి దేశ ప్రగతికి బాటలు వేసిన మన్మోహన్ సింగ్ జీవితం, సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పాలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె ఘన నివాళులు అర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. సోనియాగాంధీ , రాహుల్‌గాంధీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యాన్ని బలోపేతం చేస్తున్నామ చెప్పారు. దొరల పెత్తనానికి, అణచివేతకు చరమగీతం పాడి ప్రజలే కేంద్రంగా పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

### జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శమని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం బిసి కమిషన్ కార్యాలయంలో ఆమె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి జి. నిరంజన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారి ఎన్. సునీత, స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మను స్మరించుకున్నారు.



### డిజిపి కార్యాలయంలో..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను శనివారం డిజిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి డి జి (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన ధైర్యసాహసపూరిత పాత్రను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎఐజి అడ్మిన్ జె. అన్యోన్య , స్టోర్స్ డిఎస్‌పి సత్యనారాయణ, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, సిఎఓ లు, సూపరింటెండెంట్లతో పాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



### స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోని బాలాదేవి, ఐఎఫ్ఎస్, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోనిబాలాదేవి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ సోని బాలాదేవి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు డాక్టర్ రవితేజ శ్రీనివాస్ అశోక్ కుమార్, కె ఆర్ పటాన్ అశ్విని దద్పే,శాలిని పి ఆర్ ఓ సురేష్ కాలేరు కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు.

### పాత రోజులు తెస్తానన్న రేవంత్

# నిజంగానే అదే చేశారు



**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో పాత రోజులు తీసుకొస్తానని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు నిజంగానే అదే చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరగా, వారికి కెటిఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు పెరిగిపోయాయని, యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలిచ్చే బర్రెలా పనిచేసిన కెసిఆర్‌ను పక్కనపెట్టి, ఇప్పుడు ప్రజలు తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 100 రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశారని, ఇప్పటివరకు ఒక్క హామీని కూడా సరిగా నెరవేర్చలేదన్నారు. నాట్లు వేసే సమయానికి కెసిఆర్ రైతుబంధు వేసేవారని, కానీ రేవంత్ రెడ్డి ఇప్పటికే మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని విమర్శించారు. కెసిఆర్ అసెంబ్లీకి, బయటికి రావాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కెసిఆర్ ప్రత్యేకంగా బయటకు రావాల్సిన పనిలేదని, ఆయన ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారన్నారు. మూడేళ్లు కెసిఆర్ కనిపించకపోయినా గల్లీ గల్లీలో కెసిఆర్ పాటలే వినిపిస్తున్నాయని, కోదాడ నుంచి సూర్యాపేట వరకు సాగునీళ్లు ఇచ్చిన మహనీయుడిగా ప్రజలు ఆయనను నిత్యం గుర్తుచేసుకుంటున్నారన్నారు. ఎవరు గెలిచినా సంక్షేమ పథకాలు బంద్ కావులే అని భావించి ప్రజలు ఓటేశారని, కానీ అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం ఊడిపోయిన చందంగా కాంగ్రెస్ పాలన తయారైందని విమర్శించారు. 2028లో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, కెసిఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అన్ని సర్వేలు స్పష్టం చేస్తున్నాయని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైనదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆరు జిల్లాల పార్టీ నేతలతో వరుస భేటీలు నిర్వహించారు. మొదటి దశలో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన నాయకులతో విడివిడిగా సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు భుజాన వేసుకోవాలని, నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. నోటిఫికేషన్ వెలువడే నాటికి క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండేలా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను తీవ్రంగా వంచించిందని, వారిలో ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. చదువుకున్న విద్యాధికులు తమ సొంత సమస్యలతో పాటు రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న కష్టాలను గమనిస్తున్నారని, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వ వ్యతిరేకతను బిఆర్ఎస్‌కు అనుకూల ఓటు బ్యాంకుగా మలచుకోవడానికి నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూమి, భుక్తి కోసం పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి ఎప్పటికీ చిరస్మరణీయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు కొనియాడారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ పేదలు, పీడిత ప్రజల హక్కుల సాధన కోసం ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే చాకలి ఐలమ్మకు మనం అందించే నిజమైన నివాళి అని కెటిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి వద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్ ఏ పార్టీ సొత్తు కాదు

### బోయినపల్లి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసిఐ) తన స్వతంత్రతను కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు విశ్వాసం ఉండాలని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్, లీగల్ సెల్ ప్రతినిధి లలితా రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నిర్ణయాధికారాల్లో ఏకపక్ష వైఖరి కనిపిస్తోందని, ముగ్గురు సభ్యుల కమిషన్‌లో మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియాలో వార్తలు రావడం తీవ్ర ఆందోళనకరమన్నారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'(ఎస్ఐఆర్) ప్రక్రియ పేరిట కోట్లాది మంది ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారని, అన్యాయంగా ఓట్లను తొలగించారని ఆరోపించారు. వివాదాస్పద నిర్ణయాలతో దిగజారిన ఈసి ప్రతిష్టను కాపాడేందుకు సిఈసి వెంటనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేదా కేంద్రమే ఆయనను తొలగించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సుప్రీంకోర్టు సుమోటోగా కేసు స్వీకరించి, రాష్ట్రపతికి నివేదించాలని, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న నియామక ప్రక్రియ కేసుపై పాత పద్ధతినే కొనసాగిస్తామని కేంద్రం అఫిడవిట్ ఇవ్వాలని కోరారు.



## భూ సమస్యల పరిష్కారానికి పోరాడతాం

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ భవన్‌లో పాలమూరు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులకు 'భూ సమస్యలుచట్టాలపై' శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బక్కని నర్సింహులు మాట్లాడుతూ భూ చట్టాలు, రక్షిత కౌలుదారీ వ్యవస్థ, సీలింగ్ యాక్ట్, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన కాలం నుంచి భూముల వివరాలకు సేత్వార్ ప్రధాన ఆధారమన్నారు. గతంలో పేదలు పటేల్, పట్వారీ వ్యవస్థ కింద తీవ్ర వెట్టిచాకిరీ అనుభవించారని, దివంగత ఎన్‌టిఆర్ అధికారంలోకి రాగానే ఒక్క కలం పోటుతో ఆ వ్యవస్థను రద్దు చేసి బడుగు, బలహీన వర్గాలకు విముక్తి కల్పించారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడి హయాంలో గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం భూస్వాములకు లబ్ధి చేకూర్చడానికే రికార్డుల నుంచి 'కాలమ్ 16'ను తొలగించిందని, అసైన్డ్ వక్ఫ్, దేవాలయ భూములను కాపాడటానికే 22ఎ నిబంధన తీసుకొచ్చారన్నారు. అయితే 22ఎ జాబితా నుంచి పేదల ప్రైవేట్ భూములను వెంటనే మినహాయించాలని ఆయన డిమాండ్ చేశారు. భూ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో చర్చించి, అవసరమైతే కోర్టులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ వర్క్‌షాప్‌లో టిడిపి సీనియర్ నేతలు బంటు వెంకటేశ్వర్లు, శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ ఇల్లందు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల హక్కులే టిడబ్ల్యుయు లక్ష్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతను పరిరక్షించడం ప్రధాన లక్ష్యంగా తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు) కూటమి ముందుకు సాగుతోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఆర్‌టిసి ఎన్నికల ఇన్చార్జ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న టిడబ్ల్యుయు బాణం గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు) అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డితో కలిసి బొంతు రామ్మోహన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఎన్నికలు తొలి మెట్టు అని అన్నారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు ప్రభుత్వం ముందు 32 ప్రధాన డిమాండ్లను ఉంచగా, వాటిలో 29 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 25వ పిఆర్‌సి అమలు, మెరుగైన వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. ఇ.అశ్వత్థామ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల టిఎంయూ ఎన్నికల బరిలో లేకపోవడంతో టిడబ్ల్యుయు, ఎస్‌డబ్ల్యుఎఫ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేసే టిడబ్ల్యుయు కూటమికి ఉద్యోగులందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో టిజెఐయు జనరల్ సెక్రటరీ రాఘవేంద్ర రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్ల నరసింహారెడ్డి, టిఎంయు అధ్యక్షులు శంకర్, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, రామవతారం, పాప రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో 'తెలంగాణ రక్షణ సేన' పోటీ : కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన( టిఆర్ఎస్) తరపున అభ్యర్థిని నిలబెట్టి పోటీ చేయిస్తామని పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మరొక పార్టీ తరపున ఎంపిగా పోటీ చేసే సంస్కృతిని కాంగ్రెస్ ప్రోత్సహించడం దారుణమన్నారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో పసిపిల్లలు మరణించిన ఘటన తీవ్రంగా కలచివేసిందని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏటా వేలాది మంది పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్స్, నీలోఫర్ ఆస్పత్రుల్లో బెడ్‌లు దొరకని పరిస్థితి ఉంటే, డల్లాస్, సింగపూర్ చేస్తామంటూ సిఎం రేవంత్ రెడ్డి కబుర్లు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి పరిస్థితులను ఎండగడతామని చెప్పారు. అలాగే, తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత తీవ్రంగా ఖండించారు. తన ఫామ్‌హౌస్ పరిధిలో గజం భూమి కూడా కబ్జా, ఇనాం లేదా ఎఫ్‌టిఎల్ పరిధిలో లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని కవిత విమర్శించారు.



## ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా ఉండాలని జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. శనివారం చిలుకూరు మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీర యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహనికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కడవెండి గ్రామంలో ఒకపేద కుటుంబంలో కోడలుగా వచ్చిన ఐలమ్మ ముసునూరు దొరలకు వ్యతిరేకంగా తన పంటను కాపాడుకోవడం కోసం దొరగుండాలని ఎదిరించి వారి అరాచకాలకు అడ్డు నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళ సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు మేరి, రెమిడాల జయసుద, ఎరమాల రాజేశ్వరి, బెజవాడ రమణ, తాళ్లూరి విజయలక్ష్మి, పొరండ్ల సంధ్య, బత్తిని లక్ష్మి, బెజవాడ నాగమణి, తాళ్లూరి వెంకటయ్య, వినోద్ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు వరం

బాధితుడికి ఎల్ఒసి అందజేసిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన పంతంగి నరసింహాచారి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆయనకు క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కు వైద్య చికిత్స అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీను సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం బాధితునికి అందజేశారు.ఈ సందర్భంగా నరసింహాచారి కుటుంబ సభ్యులు తమ పరిస్థితిని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా,వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందేలా కృషి చేసినట్లు తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్సలు భారంగా మారుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు.వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు కావడం పట్ల నరసింహాచారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో టూరిజం కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ నేతృత్వంలో డిప్యూటి కలెక్టర్లు, డిఐఓ, డిఆర్ఓలతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల స్థితిగతులను పరిశీలించి, వాటి అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ నివేదికను తయారు చేస్తుందని తెలిపారు. ఈ కమిటి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల స్థితిగతులను పరిశీలించి, వాటి అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ నివేదికను తయారు చేస్తుందని తెలిపారు. సెలవు దినాల్లో ప్రజలు సమయం గడిపేందుకు అనువుగా వల్లభాపురం, ఇతర సమీప చెరువుల వద్ద వికండ్ లేజర్ యాక్టివిటీస్, పిక్నిక్ స్పాట్లను తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. అనంతరం డాక్యుమెంట్ ప్రదర్శన, విద్యార్థుల నృత్యాలు తిలకించి, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డిఆర్ఓ ప్రేమ్ రాజు, ట్రైనీ డిప్యూటి కలెక్టర్స్ రవితేజ, అనూష, డిసిహెచ్ ఎస్. వెంకటేశ్వర్లు, డిఇఓ అశోక్ కుమార్, డిఐఇఓ సులోచనరాణి పాల్గొన్నారు.

## 7 ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘన కేసుల పరిష్కారం

కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు : ఉమ్మడి జిల్లా జోనల్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనకు సంబంధించి 7 కేసులు పరిష్కారమై రూ.69,500 జరిమానా విధించినట్లు ఉమ్మడి జిల్లా జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కేసుల విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా నాణ్యత, పరిరక్షణ ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పూర్తి బాధ్యతతో, చట్టానికి లోబడి మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాసిరకమైనటువంటి ఆహార పదార్థాలు, కల్తీ ఆహార పదార్థాలను విక్రయించినట్లయితే భారీ జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. అంతేకాకుండా నేరం తీవ్రతను బట్టి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. నమోదైన కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్ర ఆహార భద్రతా సంస్థకు చెందిన అధికారిక ఎఫ్ఓఎస్‌సిఓఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు యాదాద్రి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌తోపాటు సూర్యాపేట జిల్లా ఆహార భద్రతా అధికారి ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రత్యేక నేరాల కట్టడికి పోలీసులకు అధునాతన శిక్షణ

- పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్
- శిక్షణ పూర్తి చేసుకున్న బిహార్‌కు చెందిన డిఎస్‌పిలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్గనైజ్డ్ క్రైమ్, ఆర్థిక మోసాలు వంటి ప్రత్యేక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు అధునాతన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో బీహార్ పోలీస్ అకాడమీకి చెందిన 54 మంది డిఎస్‌పిలకు సెప్టెంబర్ 21 నుంచి 26 వరకు నిర్వహించిన ఆరు రోజుల ఇన్‌సర్వీస్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు రెండు రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య అనుభవాలు, ఉత్తమ విధానాల మార్పిడికి దోహదపడతాయని తెలిపారు. పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారా అంతర్రాష్ట్ర నేరాలను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్స్, నార్కోటిక్ డ్రగ్స్, ఆర్గనైజ్డ్ క్రైమ్, ఆర్థిక నేరాలు వంటి ప్రత్యేక నేరాల స్వరూపం మారుతున్నందున వాటిని ఎదుర్కొనేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఇప్పటివరకు 47 బ్యాచ్‌లలో సుమారు 7 వేల మంది పోలీసు, ఎక్సైజ్ అధికారులకు శిక్షణ అందించినట్లు వివరించారు. సైబర్ నేరాల దర్యాప్తు, నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా ఏఐ ఛాంపియన్స్, ఎన్‌సిఆర్‌బి, బిపిఆర్‌అండ్‌డి ఆధ్వర్యంలో ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తున్నట్లు అభిలాష బిస్త్ తెలిపారు. నేరాల స్వభావానికి అనుగుణంగా పోలీసు అధికారులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణలో పాల్గొన్న బీహార్ డిఎస్‌పిలు తెలంగాణ పోలీస్ అకాడమీలో అందించిన శిక్షణ తమ వృత్తిపరమైన విధులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. శిక్షణలో భాగంగా గోల్కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ, చార్మినార్, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలను సందర్శించడం ఆసక్తికరమైన అనుభవంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, డిఎస్‌పి ఆదూరి శ్రీనివాసరావు, 54 మంది బీహార్ డిఎస్‌పిలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నసీర్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీకి ఆర్‌టిసి బస్సులు పెంపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం (విసిఐడబ్ల్యుయు) విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు టిజిఎస్‌ఆర్‌టిసి బస్సు సర్వీసుల ఫ్రీక్వెన్సీని పెంచింది. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయు) క్యాంపస్ మీదుగా విసిఐడబ్ల్యుయు (కోఠి) మధ్య నడిచే బస్సుల సంఖ్యను పెంచగా, ఈ సర్వీసులు నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో ఓయు క్యాంపస్‌లో నివసించే పిజి విద్యార్థులతో పాటు విపిఐడబ్ల్యుయుకు రాకపోకలు సాగించే విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. రోజువారీ రాకపోకల్లో ఇబ్బందులు తగ్గడంతో పాటు విద్యా, విశ్వవిద్యాలయ కార్యకలాపాలకు సకాలంలో హాజరయ్యేందుకు ఈ సర్వీసులు ఉపయోగపడనున్నాయి. బస్సు సర్వీసుల పెంపుపై విసిఐడబ్ల్యుయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ రవాణా అవసరాలపై సానుకూలంగా స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టిసి ఎండి వి. నాగిరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడి అంచూరి శ్రీధర్ సహా ఆర్‌టిసి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

కుటుంబ రాజకీయాలకు కాంగ్రెస్ ప్రతీక

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్ రాజకీయ పోరు గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ స్వార్థ రాజకీయాలకు ప్రతీకగా నిలుస్తోందని, బిజెపి మాత్రం నేషన్ ఫస్ట్ అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. గాంధీ కుటుంబం చుట్టూ మాత్రమే కాంగ్రెస్ రాజకీయాలు తిరుగుతాయని, కానీ తమకు దేశ ప్రయోజనాలే ప్రధానమన్నారు. ఎమర్జెన్సీ విధించడం, ప్రజాస్వామ్యాన్ని అణచివేయడం, 1984 సిక్కుల హత్యాకాండ వంటి ఘటనలు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయన్నారు.

# వికసిత్ భారత్, నయా భారత్ భూటకం

'సర్' పేరుతో ఓటుహక్కు హరించే కుట్ర

'ద వైర్' మాజీ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ (హైదరాబాద్):** వికసిత్ భారత్ అనే భూటకపు నినాదంతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ చివరికి ప్రజలకు ఆయుధం లాంటి ఓటు హక్కు కూడా లేకుండా చేయడానికి కుట్ర పన్నుతున్న కేంద్రంలోని ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలని 'ద వైర్' మాజీ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్ పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తన మాయ మాటలతో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సాగిస్తున్న మోసాలను గమనించాలలన్నారు. ది వైర్ తెలుగు 'నవ భారత్‌కు నవ ఎజెండా' అనే అంశంపై శనివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో కాంక్లేవ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ది వైర్ పూర్వ సంపాదకులు ప్రముఖ జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు ఐషె ఘోష్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు కొడాలి శ్రీనివాస్, జెన్ జీలు పవనం, విజయ్‌లు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్‌కి ది వైర్ తెలుగు సంపాదకులు కొండురి వీరయ్య మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ వరదరాజన్ మాట్లాడుతూ వికసిత్ భారత్, నయా భారత్ అనేది అంతా భూటకమని, ఈ కొత్త పేరుతో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో హిందుత్వ ఎజెండాని అమలు చేయడానికి కొత్త కొత్త పద్ధతులు, విధానాలను, చట్టాలను తీసుకు వస్తున్నారని మండిపడ్డారు. వికసిత్ భారత్, నయా భారత్ గురించి 70 సంవత్సరాల క్రితమే చర్చ జరిగిందని,అలాగే సమాచార హక్కు, ఉపాధి హామీ కావాలని 20 ఏండ్ల కిందటనే చర్చ జరిగిందని వరదరాజన్ గుర్తు చేశారు. నయా భారత్ ఆలోచనలో సర్ ఒకటని,ఒక పద్ధతి ప్రకారం మోదీ, అమిత్ షా నియమించిన వారే దాన్ని ప్రయోగిస్తున్నారని, గతంలో సర్‌ను సమర్థించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికనే ఈ రోజు ఎన్నికల సంఘం అంతర్గత భాగోతాన్ని బయటపెట్టిందని అన్నారు. జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజి అధ్యక్షురాలు ఐషె ఘోష్ మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను సంస్థల ద్వారా అమలు పర్చడానికి కుట్ర పన్నుతూ నూతన విద్యా విధానం పేరుతో విద్యా సంస్థలను లక్ష్యంగా చేసుకుంటుందని విమర్శించారు. సైబర్ సెక్యూరిటీ నిపుణులు కొడాలి శ్రీనివాస్ మాట్లాడుతు డిజిటల్ ఇండియా ప్రస్తానం హైదరాబాద్ నగరం నుంచే ప్రారంభమైందని, దాని ఫలితమే నేడు హైదరాబాదే కాకుండా మొత్తం దేశమే నిఘా దేశంగా మారిపోయిందని చెప్పారు. పవనం మాట్లాడుతు దేశంలో ఉచిత విద్య, ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి ప్రజలు ఎప్పటికి ప్రతిపక్షం మాదిరిగా ఉండాలని, ఆ దిశగా వారిని చైతన్యం చేయడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ రాష్ట్ర కన్వీనర్ విజయ్ మాట్లాడుతు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు అక్టోబర్ 2 వ తేదీన ముంబయిలో శాంతియుత నిరసన కార్యక్రమాన్నిపెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు, ఆ తర్వాత పది రోజుల లోపే హైదరాబాద్‌లో నిరసన చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. మెడరేటర్ వీరయ్య మాట్లాడుతు ఇది మాకు హైదరాబాద్ యువతకు ఒక కొత్త ప్రయోగం లాంటిదని అన్నారు. దేశంలో కనీస మౌలిక అవసరాలు, లక్ష్యాల కోసం మళ్లీ ఎజెండాలను పెట్టుకోవల్సి వస్తుందని చెప్పారు.

# ఇసుక డంప్‌లపై దాడులు

సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

రెవెన్యూకు అప్పగింత

ప్రజాపక్షం ఎఫెక్ట్





**ప్రజాపక్షం/సూర్యాపేట :** "ఇసుక పాలసీకి తూట్లు!" ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి...!! అక్రమ రవాణాదారులకు అండగా అధికార పార్టీ నేతలు!! నెలవారీ మామూళ్ళతో సరిపెడుతున్న పోలీసులు? అంటూ శనివారం ప్రజాపక్షం మెయిన్‌లో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అక్రమ ఇసుక రవాణాకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించడంతో వారు రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి జిల్లాలో ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా, ఇసుక డంప్‌లు ఉన్న ప్రదేశాలలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మైనింగ్ ఏడి రఘుబాబు, ఏజి విజయరామరాజులు ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుండి మొదలుకొని సాయంత్రం 6 గంటల వరకు తనిఖీలు చేశారు. సూర్యాపేట మండలంలోని కాసరబాదలో 175 ట్రిప్పులు, కె.టి.అన్నారంలో 100 ట్రిప్పులు, పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారంలో 20 ట్రిప్పుల నిల్వ ఉన్న ఇసుక డంప్‌లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. నేరేడుచర్ల మండలంలోని నేరేడుచర్ల, సోమారం, పాలకవీడు మండలంలో స్థానిక రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు.

**ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు...**

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడి రఘుబాబు హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి ప్రభుత్వం తీసుకవచ్చిన ఇసుక పాలసీ ద్వారా నిర్మాణదారులకు తక్కువ ధరలకు ఇసుకను అందించడం జరుగుతుందని చెప్పారు. వాహనం సీజ్‌తోపాటు జరిమానా, బైండోవర్ చేయడం జరుగుతుందని తెలిపారు.

## మట్టి గణపతే మేలైన మార్గం

జలాశయాల పరిరక్షణకు టిజిపిసిబి కార్యాచరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వినాయక నిమజ్జనంతో జలాశయాలు కలుషితం కాకుండా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 3.26 లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేసింది. ప్రకృతిలో పుట్టిన మట్టితో విగ్రహాన్ని తయారు చేసి, పూజల అనంతరం అదే ప్రకృతిలో కలిపే సంప్రదాయాన్ని పర్యావరణ పరిరక్షణతో అనుసంధానిస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 2020 మే 12న జారీ చేసిన సవరించిన మార్గదర్శకాల ప్రకారం విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన చర్యలను టిజిపిసిబి అమలు చేస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటిలో భారీ లోహాలు చేరి జలచరాలకు, నీటి నాణ్యతకు నష్టం కలిగే అవకాశం ఉన్నందున మట్టి విగ్రహాలనే వినియోగించాలని ప్రజలకు సూచిస్తోంది. పర్యావరణహిత గణపతి విగ్రహాల పంపిణీని టిజిపిసిబి గత కొన్నేళ్లుగా కొనసాగిస్తోంది. 2022లో 1.56 లక్షలు, 2023లో లక్ష, 2024లో 2.34 లక్షలు, 2025లో 2.35 లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 3.26 లక్షలకు పెరిగింది. మట్టి విగ్రహాల తయారీ, సరఫరా టెండర్లను కుమ్మరి సంఘాలకు కేటాయించడం ద్వారా సంప్రదాయ చేతివృత్తులకు, ఉపాధి అవకాశాలకు కూడా ప్రోత్సాహం కల్పించినట్లు మండలి తెలిపింది.

**59 ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు..**

గణేష్ నిమజ్జనాల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసేందుకు జలాశయాల్లో పలు దశల్లో నీటి నాణ్యతను టిజిపిసిబి పరిశీలిస్తోంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో 6 ప్రాంతాలు, హైదరాబాద్ పరిసరాల్లోని చెరువులు, జలాశయాలు, కృత్రిమ కొలనుల్లో 41 ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో 12 ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరిస్తున్నారు. నిమజ్జనానికి ముందు సెప్టెంబర్ 12న, నిమజ్జనం సమయంలో ఈ నెల 17, 19, 21, 23 తేదీల్లో, నిమజ్జనం అనంతరం ఈ నెల 27న నీటి నాణ్యతను పరీక్షిస్తున్నారు. హుస్సేన్‌సాగర్ కోసం 6 బృందాలు, ఇతర జలాశయాల కోసం 10 బృందాలు పనిచేస్తున్నాయి. నీటిలో పీహెచ్, కరిగిన ఆక్సిజన్,బిఒడి,సిఒడి, విద్యుత్ వాహకత, మసకదనం, టిడిఎస్, క్లోరైడ్, టిఎస్ఎస్, కాఠిన్యం, క్షారత్వం, లోహాలు తదితర భౌతిక, రసాయనిక ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. అవసరమైన చోట్ల జలాశయాల అడుగు భాగంలోని అవక్షేప నమూనాలను కూడా సేకరించి భారీ లోహాల ఉనికిని పరీక్షిస్తున్నారు.గత ఏడాది పరిశీలనల్లో నిమజ్జనం సమయంలో కొన్ని ప్రాంతాల్లో బిఒడి,సిఒడి, టిఎస్‌డిఎస్ విలువలు పెరగడంతో పాటు కరిగిన ఆక్సిజన్ స్థాయి తగ్గినట్లు టిజిపిసిబి గుర్తించింది. నిమజ్జనం అనంతరం కొన్ని ప్రమాణాలు తిరిగి మెరుగుపడినట్లు తెలిపింది.

# పాఠశాలల పాలనను గాలికి వదిలేశాం



- టిపిఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఐఎఎస్ ఆకునూరి మురళి
- విద్యాబస్ యాత్రలో భాగంగా నల్లగొండలో
- రౌండ్ టెండ్ , మాడుగులపల్లిలో బడి నిద్ర

**ప్రజాపక్షం/నల్లగొండ :** మన పిల్లల గౌరవం, మర్యాద, విద్యా హక్కులతో ఇంకెంత కాలం రాజీ పడతాం అని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టీపీఎఫ్) కోర్ కమిటీ సభ్యుడు,మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ప్రశ్నించారు.తెలంగాణలో ఏ జిల్లాలో చూసినా పాఠశాలల పాలనను గాలికి వదిలేశాం అని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాల ప్రాంగణాలను జంతువులకే కాకుండా ప్రభుత్వంలోని ఇతర శాఖలకు కూడా అందుబాటులో ఉంచుతున్నారని, నీటి సరఫరా శాఖ ట్యాంకులు,గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఎంఈఓ కార్యాలయాలు,యునాని ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా అక్కడే ఏర్పాటు చేస్తున్నారని అన్నారు.పాఠశాల విద్యా పాలనను వివిధ విభాగాలుగా విడదీసి నిర్వహించేందుకు అనుమతిస్తున్నారని విమర్శించారు.పట్టణంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో టీపీఎఫ్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి అధ్యక్షత వహించారు.ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రతి ప్రసంగంలో విద్య గురించి ప్రస్తావిస్తున్నా క్షేత్ర స్థాయిలో వాస్తవ మార్పు కనిపించడం లేదని, ప్రతి మండలంలో అరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహా పాఠశాలలను నిర్మించాలని, ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. యాత్రలో భాగంగా మాడుగులపల్లి మండలం మాడుగులపల్లి గ్రామంలోని ఐదు ఎకరాల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బడి నిద్ర నిర్వహించారు.సమావేశంలో టీపీఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు,మాజీ ఐఏఎస్ ఎం. చంపాలాల్ టీపీఎఫ్ కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజ షా,సృజన యాదవ్,ముప్పూరి కుమారన్న,నిఖిల్ విజయ కృష్ణ, నల్లగొండకు చెందిన విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ల్లాలో నాగార్జునసాగర్, బుద్ధవనం, పానగల్, చెరువుగట్టు,దేవరకొండ కోట వంటి అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని,వాటి గురించి విస్తృతంగా తెలియజేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పానగల్, నాగార్జునసాగర్,బుద్ధవనం,చెరువుగట్టు ఎంతో ప్రఖ్యాతి కలిగి ఉన్నాయని,దేవరకొండ కోటను మినీ గోల్కొండలా తీర్చిదిద్దే అవకాశం ఉందని, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమిర్ అలీ,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ,రఫిక్,మల్లికార్జున్,పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పర్యాటకాభిమానులు 150 అడుగుల జాతీయ జెండాతో హెరిటేజ్ వాక్‌లో పాల్గొని ఆకట్టుకున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి, రైతులు పంట మార్పిడి వైపు అడుగులు వేయాలని ఉద్యాన అధికారి స్నేహిత,పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్‌లు అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు లాభాలను వివరించారు. కోతులు, అడవి పందుల బెడద ఉండడం మొక్కలు నాటిన తర్వాత నాలుగవ ఏడాది నుండి కాపు మొదలై 30 ఏళ్ల పాటు ప్రతి సంవత్సరం ఆదాయం పొందవచ్చని ,రవాణా మార్కెటింగ్ ప్రాసెసింగ్ సౌకర్యాలు కేటాయించిన టీజీ ఆయిల్ ఫేల్ కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని, ఒక్క ఎకరానికి సుమారు 10 నుండి 12 టన్నుల దిగుబడి వస్తుందని, కనుక దీని ద్వారా సంవత్సరానికి ఒక్క ఎకరాకు సుమారు రూ.లక్ష 20 వేల నుండి రూ.1,50,000 వరకు నికర ఆదాయం పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ ఏజీఎం ప్రసాద్, ప్రసన్న కుమార్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పనగట్ల సుదర్శన్, టిజీ ఆయిల్ ఫేల్ డిఎం ప్రవీణ్ రెడ్డి, ఏఈవోలు ఉమారాణి, జెస్సీ, హెచ్ఈఓ మంజుల, ఎఫ్ఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
ఆదివారం
27-09-2026
www.prajapaksham.in

“ రెబల్ స్టార్ ప్రభాస్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ మైథలాజికల్ ఎక్స్‌ట్రావెగాంజా ‘కల్కి 2898 ఏడీ’ కోసం క్రియేటివ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ సృష్టించిన ప్రపంచం ఇప్పుడు మరింత భారీ స్థాయిలో విస్తరించబోతోంది. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సీక్వెల్ రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ”

రీల్

# చిరంజీవి‘కాకా’ డబ్బింగ్ షురూ



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కలిసి చేస్తున్న సినిమా ‘కాకా’. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరో పక్క ‘కాకా’ డబ్బింగ్ పనులు పూజా కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో శరవేగంగా జరుగుతున్నాయి.ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు. భానునందు డైలాగ్స్ రాస్తున్నారు.‘కాకా’ 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# ‘కొండ కోన కోరసు పాడే’ సాంగ్ రిలీజ్



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది నటిస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ‘గరివిడి లక్ష్మి’ ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.తాజాగా కొండ కోన కోరసు పాడే సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటని చరణ్ అర్జున్ స్వయంగా సాహిత్యం అందించి ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. అనన్య భట్, చరణ్ అర్జున్ పాడిన తీరు అందరినీ అలరించింది. ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇతర పాత్రల్లో నరేష్, రాశి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ :జె . ఆదిత్య సంగీతం: చరణ్ అర్జున్, చీఫ్ కోఆర్డినేటర్: మేఘా శ్యామ్ పాతాడ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ చౌదరి కొల్లి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సుకుమార్ కిన్నెర,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: దుర్గా ప్రసాద్, క్రాంతి కుమార్ దత్తి.

# ‘రామాయణం’ నుంచి ‘జై జై రామ్’ పాట ఆవిష్కరణ



‘రామాయణం’ మేకర్స్ ఈ చిత్రంలోని తొలి పాట ‘జై జై రామ్’ తెలుగు వెర్షన్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుట్టారు. ఈ పాటకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. రాకేందు మౌళి తెలుగు సాహిత్యం అందించగా దీపాలి సహాయ్, రాఘవ్ కౌశిక్ పాడారు. శ్రీరాముడిని స్మరిస్తూ రూపొందిన ఈ పాటలో ఆధ్యాత్మిక భావాన్ని, సినిమాటిక్ సౌండ్‌తో ప్రజెంట్ చేశారు. శ్రీరాముడి కరుణ, ధర్మాన్ని పాట సాహిత్యం ప్రతిబింబిస్తుంది. పదే పదే వినిపించే ‘జై జై రామ్’ అనే నామస్మరణ ఈ పాటకు భక్తి భావాన్ని అందిస్తుంది.ఫిల్మ్‌మేకర్, ప్రొడ్యూసర్ నమిత్ మాట్లాడారు. మనం ఆరాధించే వ్యక్తిగా మాత్రమే కాకుండా.. మనలోని రక్షకుడిగా, మార్గదర్శిగా, బలానికి మూలంగా శ్రీరాముడిని ఈ పాట ద్వారా సెలబ్రేట్ చేయాలనుకున్నాం అని అన్నారు. ఏఆర్ రెహమాన్ మాట్లాడారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘రామాయణం’లో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవీ దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు.భారత్ మినహా ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తోంది.‘రామాయణం పార్ట్ వన్’ 2026 దీపావళికి థియేటర్లలోకి రానుంది.

# స్టోరీ నచ్చితేనే ఒప్పుకుంటా

‘ప్రజాపక్షం’ ఇంటర్వ్యూలో ఫరియా అబ్దుల్లా

## కథలు రాస్తున్నా...డైరెక్షన్ చేస్తా
## నా పర్సనాలిటీకి యాక్షన్ కూడా సెట్ అవుతుంది



టాలీవుడ్ ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలు హీరోయిన్‌లుగా చాలా తక్కువగా కనిపిస్తారు. ఒకరిద్దరు తప్ప అందరూ పరభాషా హీరోయిన్లే. తెలుగు తెరపై ఉన్న విపరీతమైన పోటీని సైతం తట్టుకుని సినిమాలు చేస్తూ దూసుకెళ్తోంది ఫారియా అబ్దుల్లా. తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. కేవలం నటనతోనే కాకుండా ఈమె మంచి గాయని కూడా. ర్యాప్ బాగా పడుతుంది. ఆమెనే స్వయంగా పాటలు కూడా రాస్తుంది. ‘జాతి రత్నాలు’ సినిమాలో చిట్టిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైనా ఫరియా ఇప్పుడు పరభాషా హీరోయిన్లకు సైతం పోటీనిస్తోంది. తెలుగు సినిమా చరిత్రలో ఒక పేజీని క్రియేట్ చేయూసుకున్న ఫారియా అబ్దుల్లా ‘ప్రజాపక్షం’కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చింది.

**ప్రశ్న: మీ ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ చెప్పండి?**

ఫరియా: నేను పుట్టి పెరిగింది అంత హైదరాబాద్. పక్క హైదరాబాద్ అమ్మాయిని. పదవ తరగతి వరకు మెరిడియన్ స్కూల్‌లో చదివాను. లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ చేశాను. నాకు యాక్టింగ్ అంటే ఇష్టం. సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వక ముందు మోడలింగ్ చేశాను. యూట్యూబ్‌లో వీడియోస్ చేశాను. ‘జాతి రత్నాలు’ సినిమా నా ఫస్ట్ మూవీ.

**ప్రశ్న : మీరు ర్యాప్ సాంగ్స్ పడతారు...పాటలు కూడా రాస్తారు ఎలా అలవాటైంది?**

ఫరియా: నాకు చిన్నప్పటి నుంచే అలవాటు అయింది. ర్యాప్ అంటే చాలా ఇష్టం. పాటలు బాగా వింటాను. రాయడం కూడా అలాగే అలవాటు ఇది. మత్తు వదలరా2లో డ్రామా నక్కో మామ అనే సాంగ్‌ను నేనే రాసి పాడాను. ఇది పూర్తిగా హైదరాబాది హిందీలో ఉంటుంది.

**ప్రశ్న : ఈ ర్యాప్ సాంగ్ పాడినందుకే మీకు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డు వచ్చిది ? ఎలా అనిపించింది ?**

ఫరియా : చాలా హ్యాపీగా అనిపించింది. నిజంగా నేను ఊహించలేదు. తెలంగాణ సర్కార్ ఫస్ట్ టైం అవార్డు ప్రవేశ పెట్టింది. ఫస్ట్ టైమే నాకు అవార్డు ఇచ్చింది. నాకు అవార్డు ఇచ్చిన జ్యూరి మెంబర్స్‌కి నా తరపున స్పెషల్ థాంక్స్ .

**ప్రశ్న : సినిమాలు ఎలా సెలెక్ట్ చేసుకుంటున్నారు ?**

ఫరియా: నాకు స్టోరీ నచ్చితేనే నేను ఒప్పుకుంటాను. స్టోరీలో నా రోల్ ఎలా ఉంది అనేది చూసుకుంటా. నా రోల్ నాకు కరెక్ట్ అనిపిస్తేనే సినిమా చేయడానికి సైన్ చేస్తా.

**ప్రశ్న: ‘మత్తు వదలరా’ నుంచి యాక్షన్ వైపు ఆసక్తి చూపిస్తున్నట్టున్నారు ?**

ఫరియా: నా పర్సనాలిటి యాక్షన్ కూడా ఫిట్ అవుతుంది. నాకు అన్ని రకాల సినిమాలు చేయాలనుంది. యాక్షన్ సినిమాలు చేయడం కూడా ఇష్టపడతాను.

**ప్రశ్న : తమిళ సినిమాల్లో కూడా అడుగుపెట్టినట్టున్నారు?**

ఫరియా: అవును ...తమిళ్ సినిమా కూడా చేస్తున్న. సిగ్మా నా తమిళ్ ఫస్ట్ మూవీ.. లైకా లాంటి పెద్ద ప్రొడ్యూసర్స్ బ్యానర్‌లో అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. ఇది మంచి యాక్షన్‌అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇందులో నా క్యారెక్టర్ రేడియో జాకీ. ఈ సినిమాలో నాకు మంచి ఎమోషన్స్ చూపించే అవకాశం దొరికింది. ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ప్రజెంట్ చేశాను. ఫ్యామిలీతో కలిసి మీరు సినిమా చూడొచ్చు. సిగ్మా డైరెక్టర్ జేసన్ తమిళ్‌లో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. అదంతా నాకు కూడా కలిసి వచ్చింది. జేసన్ జూమ్ కాల్‌లో కథ చెప్పారు. కథ మొత్తం విన్న తర్వాత ఆయన ఏజ్ ఎంత అని అడిగాను. 24 ఏళ్లు అని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అబ్బాయి. కాకపోతే అలాంటి ఫీలింగ్‌ను మనలో కలిగించరు. చాలా వినయంగా ఉంటారు. అందరితో ఫ్రెండ్లీగా కలిసిపోతారు. తనకు డైరెక్షన్ మీద మంచి కమాండ్ ఉంది. తొలి సినిమా అయినప్పటికీ ఎంతో క్లారిటీ ఉన్న విజన్‌తో తీశారు. తన సెట్‌ను హ్యాండిల్ చేసిన విధానం చాలా కూల్‌గా ఉంటుంది.

**ప్రశ్న: తమిళ్‌కి వెళ్లారు కదా.. అక్కడి పరిశ్రమకు, ఇక్కడి పరిశ్రమకు ఏదైనా తేడా గమనించారా?**

ఫరియా పరిశ్రమ ఒకలాగే ఉంది. కాకపోతే ఆహారపు అలవాట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. నేను ఎక్కడైనా అడ్జెస్ట్ అవ్వగలను. కొత్త కొత్త మనుషులు పరిచయం అయ్యారు. అందరూ ఫ్రెండ్లీగానే ఉన్నారు.

**ప్రశ్న: దర్శకత్వం చేసే ఆలోచన ఉన్నట్టు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది ?**

ఫరియా: నిజమే ... నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కొన్ని కథలు రాస్తున్నాను. కాకపోతే దానికి ఇంకా సమయం వుంది. నేను దర్శకత్వం చేస్తూనే సినిమాలో నేను నటిస్తాను.

**ప్రశ్న: తమిళ్‌లో కొత్త ఆఫర్స్ వచ్చాయా?**

ఫరియా: కొన్ని కథలు విన్నాను. సిగ్మా రిలీజ్ అయిన తర్వాత వాటి గురించి ఒక నిర్ణయం తీసుకుంటాను.తెలుగులో కూడా కథలు వింటున్నాను.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు నిబద్ధతతో పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన సేవలను సిఎం స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ.. ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ చేసిన త్యాగాలు, ఆయన చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సిఎం పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు.

# కూటమి పార్టీల సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యర్థులైన మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి, సిపిఐ(ఎం)లను కూడా ఎన్నికల సంఘం విషయంలో ఏకతాటిపైకి తీసుకువచ్చాయి. ఇటీవలి పరిణామాలపై సమావేశం కోరుతూ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష నాయకులకు లేఖ రాశారు. అనంతరం ఆయన బెనర్జీతో మాట్లాడగా, ఈ పరిస్థితికి సమన్వయ చర్య అవసరమని ఆమె అంగీకరించారు. సిఇసి కుమార్‌పై ప్రతిపక్ష పార్టీలు కొత్తగా తొలగింపు నోటీసుపై కసరత్తు చేస్తున్నాయి. దీనిని న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఉత్తర్వులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఓ ఆంగ్ల పత్రిక నివేదించిన నేపథ్యంలో ప్రతిపక్షం ఈ తాజా సమీకరణ చేపట్టింది.

**ప్రతిపక్ష పార్టీలు కలవాలని సందేశం పంపా : మమత**

ఎన్నికల సంఘానికి సంబంధించిన సమస్యలపై చర్చించి, ప్రతిపక్షాల తదుపరి కార్యాచరణను రూపొందించడానికి ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం జరిగే అవకాశం ఉందని పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ చెప్పారు. శనివారం ఆమె హుగ్లీ జిల్లాలోని సెరంపూర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో, ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి కూర్చోవాలని తాను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి సందేశం పంపినట్లు తెలిపారు. తాను రాహుల్ గాంధీకి ఒక సందేశం పంపి, మనం కలిసి కూర్చోవాలని చెప్పాను, 30న ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా కూటమి సమావేశం జరిగే అవకాశం ఉంది అని ఆమె తెలిపారు.

# పాక్ సర్కార్ కీలుబొమ్మ

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణలో అమెరికా సకాలంలో జోక్యం చేసుకుని నివారించిందని ప్రశంసించారు. మరోసారి అంతర్జాతీయ వేదికపై కశ్మీరు అంశాన్ని ఆయన ప్రస్తావించారు. గత ఏడాదినాటి సమస్య పునరావృతం కకాకుండా ఉండాలంటే కశ్మీరుకు న్యాయమైన,నిష్పాక్షికమైన పరిష్కారం అవసరమని ఆయన అన్నారు. దీంతో భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిస్పందన హక్కును ఉపయోగించుకుని భారత్ తీవ్రంగా జవాబు చెప్పింది.ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి పెటల్ గహ్లోట్ ఈ విషయంలో గట్టి ప్రతిఘటన ఇచ్చారు.ప్రభుత్వం దేశ రాజధానిలో తన సొంత ప్రజల నుండి రక్షణ పెంచుకోవడానికి కపట ప్రభోధాలు చేస్తోందని, మానవత్వ విలువలపై కపట ప్రకటనలు చేస్తోందని ఆమె విమర్శించారు.‘‘పాకిస్థాన్‌లో ఉన్నది ఒక సైనిక ప్రభుత్వం,సైన్యం కోసం,సైన్యంచేత,సైన్యం ద్వారా నడుస్తున్న ప్రభుత్వం,అందువల్ల ఆ దేశంలో ప్రజాస్వామ్యం గురించి కపట ప్రభోదాలు వినిపిస్తాయి,అనేక కీలుబొమ్మ ప్రభుత్వాలు పాకిస్థాన్‌లో రావొచ్చు,పోవచ్చు కానీ అక్కడ పాలకులకు నిజమైన అధికారాలు లేవు, గత ఏడాది నవంబరులో చేసిన దాని 27వ రాజ్యాంగ సవరణలో కూడా పాకిస్థాన్ సర్వసైన్యాధిపతికి న్యాయస్థానం ద్వారా ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా పూర్తి రక్షణలు ఏర్పాటు చేశారని విమర్శించారు.పాకిస్థాన్ సర్వసైనిక బలగాల అధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు న్యాయస్థానం ద్వారా ఎప్పటికీ ఎలాంటి సమస్యలూ రాకుండా గత ఏడాది రాజ్యాంగ సవరణ చేశారని పెటల్ గహ్లోత్ విమర్శించారు. మునీర్‌కు చట్టపరంగా ఎలాంటి విచారణలు లేకుండా జీవితకాల రక్షణ కల్పించారని, పాకిస్థాన్‌లో ఉన్నది సైనిక ప్రభుత్వమని,పాలకులు సైన్యం చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు.భారత్‌కు వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా పాకిస్థాన్ అసత్య ప్రచారం చేసినంతమాత్రాన అవన్నీ నిజాలుగా మారిపోయే అవకాశం లేదన్నారు. ఈ వాస్తవాన్ని వాస్తవంగా ప్రపంచ గుర్తిస్తుందన్నారు. పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం,మోసం,కపటత్వంవల్ల ప్రపంచానికిగానీ,ఆదేశానికిగానీ ఎలాంటి మేలూ జరగబోదని ఆమె అన్నారు.ఒసామా బిన్ లాడెన్ కారణంగా అమెరికాలో 9/11 దాడులు జరిగాయని, బిన్‌లాడెన్‌కు పాకిస్థాన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పించిందని,కిటకిటలాడే జనావాల ప్రాంతాల్లోనే బిన్‌లాడెన్ దొరక్కుండా జీవించాడని,9/11 దాడుల 25వ వార్షికోత్సవం జరిగిన కొద్ది రోజులకే పాకిస్థాన్ నాయకుడు అంతర్జాతీయ వేదికపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచిత్రంగా ఉందని గహ్లోత్ విమర్శించారు. జమ్మూ కశ్మీరు ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగంగా ఉంటుందన్నారు.కశ్మీరు విషయం పక్కనపెట్టండి,రావల్‌కోట్‌లో లక్షలమంది ప్రజలకు అనేక దశాబ్దాలుగా ప్రజాస్వామ్య హక్కులను,సాధారణ హక్కులను పాకిస్థాన్ ప్రభుత్వం నిరాకరిస్తోందని,వారిని అణచివేతకు గురిచేస్తోందని ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకువచ్చారు.భారత్‌పై దాడిచేసిన ఉగ్రవాదులు ఎక్కడికీ తప్పించుకోవడానికి అవకాశం ఉండదని ఇప్పటికే భారతదేశ సైన్యం నిరూపించిందని ఆమె గుర్తుచేశారు.పాకిస్థాన్ పెంచిపోషిస్తున్న ఉగ్రవాదానికి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


# మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క




ప్రజాపక్షం/రంగారెడ్డి: మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)అన్నారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి,ఉపాధి కల్పన, గ్రామీణ రహదారుల అభివృద్ధి,మంచినీటి సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి,మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ జిల్లాల అధికారులతో గ్రామీణాభివృద్ధి,పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా అంశాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆమె మిడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు,వరదలు,మంచినీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాంతాల వారీగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు.ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో 1,013 గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.3,382 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. దసరా అనంతరం అక్టోబర్ 25 లేదా 26వ తేదీ నుంచి రహదారి పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. వర్షపాతం లోటు కారణంగా భవిష్యత్‌లో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని సీతక్క తెలిపారు. సంగారెడ్డి జిల్లా సింగూరు జలాశయంలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బోర్లు, బావులు, ఇతర స్థానిక నీటి వనరులను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవి వరకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉమ్మడి నాలుగు జిల్లాలకు సుమారు రూ.30 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**నీటి సంరక్షణకు జలసిరి :** భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు ప్రతి నీటి బొట్టును సంరక్షించేందుకు జలసిరి' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇంటికి ఇంకుడు గుంత, పంటకు పంట కుంట,ఊరికి ఊట కుంట,బోరు రీచార్జ్ వంటి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి సీతక్క సూచించారు. కాలువలు, డ్రైనేజీలు, సోక్‌పిట్లు, ఫామ్ పాండ్లు, చెరువుల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీతక్క తెలిపారు. గతంలో చేపట్టిన సుమారు 3,000 గ్రామపంచాయతీ భవనాల్లో దాదాపు 1,000 భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని, మరో 1,800 భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా 9,000కు పైగా మహిళా భవనాల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసి, అందుబాటులో ఉన్న నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సర్పంచులకు మంత్రి సీతక్క సూచించారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com